Dwaraka

శనివారం
6•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 210
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

రైతుకు మద్దతు

ఈ ఏడాది నుంచి అన్నదాతకు ప్రత్యేక బడ్జెట్

- మార్కెట్‌లో మద్దతుధర రాకుంటే ప్రభుత్వమే కొనాలి
- మద్దతుధరల విషయంలో కేంద్రంపై ఒత్తిడి
- వరికి, మక్కలకు రూ.2 వేల మద్దతుధర కావాలని కోరుతాం
- ఇతర రాష్ట్రాల్లో మద్దతుధరల అధ్యయనానికి హరీశ్ నేతృత్వంలో బృందం
- వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం ఈ ఏడాది నుంచే అమలు
- మే 15 నాటికి మొదటి విడుతగా ఎకరానికి రూ.4 వేల చెల్లింపు
- అమలుపై పోచారం అధ్యక్షతన కమిటీ
- మొదటిదశ భూరికార్డుల ప్రక్షాళన దిగ్విజయంగా పూర్తి
- వ్యవసాయంపై సమీక్షలో సీఎం కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతుధర రాకుంటే ప్రభుత్వమే నేరుగా కొనుగోలుచేసే విధానం తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచించారు. ప్రగతిభవన్‌లో వ్యవసాయంపై ముఖ్యమంత్రి శుక్రవారం విస్తృత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రైతులు సుస్థిరంగా ఉంటేనే రాష్ట్రం ప్రశాంతంగా ఉంటుంది. వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బాగుంటుంది. అందుకే రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి, పండించిన ప్రతిగింజకూ మద్దతుధర అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది' అన్నారు.

సమైక్యరాష్ట్రంలో మన రైతాంగం నష్టపోయింది

సమైక్యరాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేశారని, అందువల్ల రైతాంగం నష్టపోయిందని సీఎం అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిచేయడం కోసం ఇప్పటికే అనేకచర్యలు తీసుకున్నామని తెలిపారు. 'సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. చెరువులు పునరుద్ధరించాం. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చేశాం. గోదాములు నిర్మించాం. ఎకరానికి

మిగతా 2వ పేజీలో



ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

29 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జనవరి 5:

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ శుక్రవారం సిఫారసు చేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19) గాను బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. పార్లమెంట్ ప్రారంభం రోజునే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అదే రోజు ప్రభుత్వం ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతుందని పార్లమెంటరీ వ్యవహారాల

మిగతా 5వ పేజీలో

వృద్ధిరేటు 6.5 శాతమే!



- నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి జీడీపీ
- మోదీ హయాంలో ఇదే అతితక్కువ
- కేంద్ర గణాంకాల సంస్థ అంచనా
- వ్యవసాయం, తయారీ రంగాల పనితీరు మందగించడమే కారణం
- తగ్గనున్న తలసరి ఆదాయం వృద్ధి రేటు

13

ఎవరు మాఫియా?

ఇసుకను మాఫియాకు వదిలేసిన కాంగ్రెస్సా..

వెయ్యి కోట్ల ఆదాయం సాధించిన మేమా?: కేటీఆర్ ప్రశ్న



శుక్రవారం తెలంగాణ భవన్‌లో మంత్రులు కేటీఆర్, పోచారం సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న బాన్సువాడ టీడీపీ ఇంచార్జి భోజ్యానాయక్. చిత్రంలో ఎమ్మెల్సీలు నారదాసు, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు కూడా ఉన్నారు.

- ఏదిపడితే అది మాట్లాడితే సహించం
- కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి
- రైతుల పొలాలకు నీళ్లు వస్తుంటే.. కడుపు మంటతోనే విమర్శలు
- కాంగ్రెస్ పార్టీపై మంత్రి కేటీఆర్ మండిపాటు
- టీఆర్‌ఎస్‌లో చేరిన బాన్సువాడ టీడీపీ ఇంచార్జి భోజ్యానాయక్
- కేసీఆర్ సీఎంగా దొరుకటం ప్రజల అదృష్టం: మంత్రి పోచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'పదేండ్ల మీ పాలనలో ఇసుక ద్వారా రాష్ట్రానికి రూ.39 కోట్ల ఆదాయం వస్తే.. మూడున్నరేండ్ల మా పాలనలో వెయ్యి కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇసుక మాఫియా మీదా? మాదా?' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పాలనలో ఇసుకను మాఫియాకు వదిలేశారని చెప్పారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో ఇసుక మాఫియా వీఆర్‌ఏను హత్య చేసినట్టు వచ్చినవార్తల్లో నిజంలేదని చెప్పారు. ఉదయం పత్రికల్లో వార్తలు చూసిన తాను కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, మృతుడు సాయిలు వీఆర్‌ఏ కాదని, అది ఇసుక ట్రాక్టర్ కాదని రిపోర్టు ఇచ్చారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పనిలేక గవర్నర్‌ను కలువటానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులకు ఈ విషయాలు తెలుసా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఏది పడితే అది మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మీడియా కూడా సంచలనాలకు తావులేకుండా ప్రజలకు వాస్తవాలు తెలిసేవిధంగా సమాచారం ఇవ్వాలని కోరారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో మంత్రులు కేటీఆర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బాన్సువాడ టీడీపీ ఇంచార్జి భోజ్యానాయక్ టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ నాయకులు

మిగతా 2వ పేజీలో

మూడేండ్లలో తెలంగాణ ప్రగతి అభినందనీయం

- ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్
- మంత్రి కేటీఆర్‌తో భేటీ
- త్వరలో రాష్ట్రానికి ఫ్రెంచ్ బృందం

6

కొత్త పది నోటు విడుదల

ముంబై, జనవరి 5: చాక్లెట్ గోధుమరంగులో రూపొందించిన కొత్త రూ.10 నోటును ఆర్బీఐ శుక్రవారం విడుదల చేసింది. కొత్త సిరీస్‌తో మొదలయ్యే ఈ నోటు మధ్యలో మహాత్మాగాంధీ చిత్రం, కుడివైపు అశోకచక్రంతోపాటు మరెన్నో విశిష్ట లక్షణాలను కలిగి ఉన్నది. నోటు పైభాగంలోని ఎడమవైపు, కిందిభాగంలోని కుడివైపున మిగతా 5వ పేజీలో



బడిపిల్లలకు బ్యాగులేని రోజు

శనివారం విరామం

ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్న విద్యాశాఖ.. ఇప్పటికే కర్ణాటకలో విజయవంతం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వీపులు వంగిపోయేలా స్కూల్ బ్యాగ్‌లు మోస్తున్న బడిపిల్లలకు శుభవార్త. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్ బ్యాగ్‌ల బరువు విషయంలో ఆంక్షలు విధించిన రాష్ట్ర విద్యాశాఖ మరో అడుగు వేస్తున్నది. ప్రతి శనివారం స్కూల్ బ్యాగ్‌లకు విరామం ప్రకటించే అంశంపై కసరత్తు చేస్తున్నట్టు విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఇప్పటికే కర్ణాటకలో వారంలో ఒకరోజు స్కూల్ బ్యాగ్‌కు విరామం ప్రకటించారని, అక్కడ 'నో స్కూల్ బ్యాగ్ డే' విధానం

మిగతా 12వ పేజీలో

కాంగ్రెస్ నేతలకు గవర్నర్ క్లాస్

ప్రతీ విషయానికి సీఎం, ఆయన కుమారుడ్ని బాధ్యులను చేస్తారా?

గవర్నర్ వ్యాఖ్యలతో కంగుతిన్న కాంగ్రెస్ పెద్దలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నదని, అందులో భాగంగానే కారెగాంలో వీఆర్‌ఏ హత్య జరిగిందంటూ ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులపై గవర్నర్ నరసింహన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రతి అంశాన్నీ వివాదాస్పదం చేస్తే ఎలా.. అన్ని సంఘటనలకూ ముఖ్యమంత్రి, ఆయన కుమారుడ్ని బాధ్యులను చేస్తారా? అంటూ ప్రశ్నించినట్టు సమాచారం. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ, మండలిలో ప్రతిపక్షనాయకులు జానారెడ్డి, షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు సర్వే సత్యనారాయణ, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లు రవి, ఎమ్మెల్యేలు డీకే అరుణ, సంపత్‌కుమార్, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీమంత్రి దానం నాగేందర్

మిగతా 2వ పేజీలో



శుక్రవారం ప్రగతిభవన్‌లో వ్యవసాయంపై నిర్వహించిన విస్తృతస్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

రైతుకు మద్దతు

మొదటిపేజీ తరువాయి...

ఏడాదికి రూ.8 వేల పెట్టుబడిని ఈ ఏడాది నుంచే అందిస్తున్నాం. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒకరు చొప్పున వ్యవసాయ విస్తరణాధికారులను నియమించాం. రైతులను సంఘటితశక్తిగా మార్చాం. వ్యవసాయ యూనివర్సిటీని బలోపేతంచేశాం. భూరికార్డుల ప్రక్షాళనద్వారా వ్యవసాయభూముల యాజమాన్యం విషయంలో స్పష్టత వచ్చింది. వీటితో పాటు రైతులు పండించిన పంటకు మద్దతుధర లక్ష్యంగా ప్రభుత్వం విధానాన్ని రూపొందిస్తుంది' అని తెలిపారు.

రైతులకు ధైర్యాన్ని ఇవ్వాలి

ఆర్థికవేత్తలు ఏంచెప్పినా.. ఎక్కువమంది ఆధారపడిన ప్రధానరంగం వ్యవసాయమేనని, రాష్ట్రంలో 70% మంది వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నారని సీఎం అన్నారు. వ్యవసాయదారులు తీవ్ర నిరాశానిస్పృహల్లో కూరుకుపోయి తమనెవరూ పట్టించుకోరు అనే భావనలో ఉన్నారని, తమ ఖర్మ ఇంతే అనుకుంటున్న రైతుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. వారికి చేయూత అందించి, అండగా నిలువాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల వల్ల కొంతమార్పు వచ్చిందని తెలిపారు. 'రైతులకు మేలు జరుగుతున్నది. అంతిమంగా రైతులు పండించిన పంటకు మంచి ధర రావాలి. అది ఇప్పుడు ప్రభుత్వం ముందున్న లక్ష్యం. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతుధర వచ్చేలా ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుంది. ఈ విషయంలో అత్యంత పట్టుదలతో, కృతనిశ్చయంతో ప్రభుత్వం వ్యవహరిస్తుంది. వరి, మక్కల లాంటి దిగుబడులకు ప్రస్తుతం కనీస మద్దతుధర లభిస్తున్నది. పత్తి లాంటి ఇతర పంటలకు మద్దతుధర విషయంలో అనిశ్చితి నెలకొంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లు, కేంద్రప్రభుత్వ విధానాలు ప్రభావం చూపుతున్నాయి. సీసీఐ లాంటి సంస్థలు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించే వ్యూహం రూపొందించాలి. రైతు సమన్వయ సమితుల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసి, తిరిగి అమ్మాలి. ఇలా చేయడం వల్ల ఏమైనా నష్టం వస్తేకూడా ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో పండిన ప్రతి పంట మార్కెట్‌నెట్‌లోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో వివిధ పంటలకు మద్దతుధర ఇచ్చే విషయంలో ఎలాంటి విధానం పాటిస్తున్నారో అధ్యయనం చేయడానికి అధికారులు మహారాష్ట్ర, కర్ణాటకలాంటి రాష్ట్రాల్లో పర్యటించాలి. మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో అధికారుల బృందం దేశవ్యాప్తంగా మద్దతుధరలకు సంబంధించిన విధానాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. రైతులకు మద్దతుధర వచ్చే విషయంలో ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరిస్తుంది. వరిధాన్యం, మక్కలు, పసుపు వంటి సంప్రదాయ పంటలే కాకుండా.. పసుపు, మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలకు, మామిడి, నిమ్మ, బత్తాయి వంటి పండ్లకుకూడా మంచిధర రావాలన్నదే మా లక్ష్యం. అందుకనుగుణంగానే ప్రభుత్వ విధానం ఉంటుంది' అని సీఎం స్పష్టం చేశారు.

వ్యవసాయానికి ఈ ఏడాది నుంచి ప్రత్యేక బడ్జెట్

రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి నిధుల కొరత లేదని సీఎం స్పష్టంచేశారు. ఈ ఏడాది నుంచి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడుతామని ప్రకటించారు. రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతోపాటు మద్దతు అందించడం కోసం కొంత నిధిని కూడా బడ్జెట్‌లో కేటాయిస్తామన్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికయ్యే ఖర్చును ముందే అంచనావేసి, బడ్జెట్‌లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య రాదని సీఎం వెల్లడించారు.

కేంద్రం ఉదారంగా వ్యవహరించాలి

'మద్దతుధర విషయంలో కేంద్రంకూడా మరింత ఉదారంగా వ్యవహరించాల్సి ఉంది. వరి, మక్కలకు మద్దతుధర పెరుగాల్సి ఉంది. ఈ రెండింటికీ రూ.2 వేల మద్దతుధర ప్రకటించాలి. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అసలు మద్దతుధరే లేదు. కాబట్టి దేశంలో పండే ప్రతి పంటకు మద్దతుధర ప్రకటించేలా కేంద్ర విధానం ఉండాలి. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వంగా కేంద్రంతో మాట్లాడుతాం. టీఆర్‌ఎస్ తరఫున పార్లమెంట్‌లోకూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తాం' అని సీఎం చెప్పారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం (ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్ స్కీం) ఈ ఏడాది నుంచే అమలవుతుందని కేసీఆర్ ప్రకటించారు. మే 15 నాటికి మొదటివిడుతగా ఎకరానికి రూ.4 వేల చొప్పున పెట్టుబడిని రైతులకు అందిస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలుచేయాలి? రైతులకు డబ్బులు నేరుగా అందివ్వాలా? బ్యాంకుల ద్వారా అందివ్వాలా? సాగుచేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలి? తదితర అంశాలను అధ్యయనం చేయడానికి వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని సీఎం నియమించారు. ఈ కమిటీలో మంత్రులు ఈటల రాజేందర్, టీ హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి సభ్యులుగా ఉంటారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, జోగు రామన్న, మహేందర్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎండీసీ చైర్మన్ సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు అనురాగ్‌శర్మ, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, వ్యవసాయ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రవీణ్‌రావు, సీసీఎల్‌ఏ డైరెక్టర్ వాకాటి కరుణ, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు రఘునందన్‌రావు, ఎంవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు, సిబ్బందికి సీఎం ప్రశంసలు

- రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే విషయంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యదర్శి పార్థసారథి నాయకత్వంలో అధికారులు విశేషకృషి చేశారని సీఎం కేసీఆర్ అభినందించారు.
- పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులతో పాటు, రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల పనులను శరవేగంగా పూర్తిచేయడానికి కృషిచేస్తున్న నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావును, అధికారులను సీఎం ప్రశంసించారు.
- తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌రంగంలో అత్యుత్తమ సేవలందించి కేంద్రప్రభుత్వం ద్వారా సీబీఐపీ అవార్డు అందుకున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావును సీఎం అభినందించారు.
- మొదటిదశ భూరికార్డుల ప్రక్షాళన పూర్తయినట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో 71,75,096 వ్యవసాయ ఖాతాలు, 1,42,12,826.17 ఎకరాల వ్యవసాయయోగ్యమైన భూమి ఉన్నట్టు లెక్కతేలిందన్నారు. భూరికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తిచేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, సిబ్బందిని సీఎం అభినందించారు.
- వీలైనంత త్వరలో రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు అందివ్వనున్నట్టు సీఎం తెలిపారు. ఇప్పటినుంచి భూముల క్రయ, విక్రయాలు జరిగిన వెంటనే ఆ వివరాలు రాష్ట్ర అధికారుల వద్ద కూడా నమోదు కావాలన్నారు. భూముల మ్యుటేషన్ అధికారం కూడా తహసీల్దార్లకే అప్పగిస్తున్నామని, ఇక ఆర్డీవోల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు.
- రాష్ట్రంలో వినియోగించే ఆహార పదార్థాలు ఎన్ని రకాలనే విషయమై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నామని, దానికి అనుగుణంగా క్రాప్ కాలనీలు నిర్ధారించి, రైతులకు అవగాహన కల్పిస్తామని సీఎం తెలిపారు. మంచి మార్కెట్ ఉన్న పంటలను, నాణ్యమైన రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాల్సిందిగా రైతులను కోరుతామని చెప్పారు.
- కల్తీ విత్తనాలను అరికట్టడంలో గతఏడాది ఎంతో కృషి జరిగిందని, ప్రభుత్వం పీడీ యాక్టు కూడా తెచ్చిందని, ఈ ఏడాది కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం అధికారులను కోరారు. విత్తనాల తయారీదారులు, అమ్మకందారుల వివరాలు, ఫొటోలు ముందే సేకరించి పెట్టుకోవాలని, ఎక్కడ ఏ పొరపాటు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు.
- ఎరువుల కొరత రాకుండా ముందే స్టాక్ పెట్టుకున్నారని, అయినప్పటికీ ఎక్కడా ఏ ఇబ్బంది రాకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సీఎం కోరారు.
- మార్కెటింగ్‌శాఖ కొత్తగా గోదాములను నిర్మిస్తున్నదని, దీంతో 22.50 లక్షల టన్నుల నిల్వసామర్థ్యం కలిగిన గోదాములు అందుబాటులోకి వస్తాయని సీఎం అన్నారు. వేర్‌హౌజింగ్, ఎఫ్‌సీఐ గోదాములు కూడా కలిపిచూస్తే రాష్ట్రంలో 53 లక్షల టన్నుల నిల్వసామర్థ్యం ఉంటుందని, వీటిని ఎరువులు, విత్తనాలు నిల్వ చేసుకోవడానికి ఉపయోగించుకోవచ్చని సీఎం చెప్పారు.
- పంటలకు చీడపీడలు రాకుండా తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, వ్యవసాయ విస్తరణాధికారులు రైతులను చైతన్యపర్చాలని సీఎం కోరారు.
- రాష్ట్రంలోని ఏ ఎకరంలో ఏ పంట వేశారనే లెక్కలు వ్యవసాయశాఖ వద్ద ఉండాలని, రెవెన్యూశాఖపై ఆధారపడకుండా వ్యవసాయ విస్తరణాధికారులతో సమాచారం తెప్పించుకోవాలని సీఎం కోరారు.

పైప్‌లైన్ డిస్ట్రిబ్యూటరీతో మేలు!

చివరి భూముల సమస్యకు ఇదే శాశ్వత పరిష్కారం

- టెయిల్ టు హెడ్ విధానం వల్ల ఉపశమనం
- విస్తృత అవగాహనతో రైతాంగంలో చైతన్యం
- మార్గాలు సూచిస్తున్న నిపుణులు
- ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో టెయిల్‌ఎండ్ సమస్యకు చెక్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కింద టెయిల్‌ఎండ్ సమస్యను అధిగమించేందుకు నీటిపారుదలశాఖ భారీ కసరత్తు చేస్తున్నది. టెయిల్ టు హెడ్ విధానం వల్ల ఉపశమనం కలుగుతుందని, రైతాంగంలో విస్తృత అవగాహనతో చైతన్యం తీసుకురావాల్సిన ఆవశ్యకత కూడా ఉందని నిపుణులు అంటున్నారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం, పైప్‌లైన్ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థతో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సూచనలను నీటిపారుదలశాఖ పరిశీలిస్తున్నది. వానకాలం సీజన్‌లో ఆరుతడి పంటల సాగు అనేది సాగునీటి ప్రాజెక్టు కాల్వల డిజైన్‌లో ప్రామాణికంగా తీసుకునే అంశం. ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నీటి పరిమాణాన్ని లెక్కించడంలో ఈ అంశమే కీలక భూమిక పోషిస్తుంది. అటువంటిది వర్షాకాలంలో అందునా ఆరుతడి పంటల కోసం కాల్వలను డిజైన్ చేస్తే యాసంగిలో వరి పైర్లకు సాగునీటిని అందించడం సాధ్యం అవుతుందా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. కాల్వల పొడవునా మోటర్ల ఏర్పాటుతో సమస్యలు తప్పవని, టెయిల్ టు హెడ్ విధానంతో సమస్య తీవ్రతను తగ్గించవచ్చని నీటిపారుదలశాఖ వర్గాలు చెప్తున్నాయి. ఆయకట్టు రైతుల్లో అవగాహన పెంచడం వల్ల సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందంటున్నారు. పైప్‌లైన్ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థతో జటిలమైన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర సర్కారు ఈ విధానాన్ని ప్రోత్సహించడం వెనుకున్న ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటని చెప్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల కింద కేవలం వానకాలం సీజన్‌లో అందునా ఆరుతడి పంటలకే సాగునీళ్లు ఇస్తామంటే సరిపోదని నిపుణులు భావిస్తున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని రైతులే నీళ్లు తీసుకోవాలని, మధ్యలో ఎవరూ మోటర్లు పెట్టొద్దంటే కుదిరే పనికాదని అభిప్రాయపడుతున్నారు. అధికార యంత్రాంగానికి ఈ విధంగా రైతులను కట్టడి చేయడం సాధ్యం కాదని అంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే టెయిల్‌ఎండ్ సమస్య క్లిష్టంగా మారుతున్నది. అందుకే సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. కరెంటు మెరుగ్గా ఉన్న దరిమిలా కాల్వల పొడవునా ఉండే మోటర్లు నీటి సరఫరాపై ప్రభావాన్ని చూపుతున్నాయి. పైగా వానకాలంలో ఆరుతడి పంటలను దృష్టిలో ఉంచుకొని డిజైన్ చేసిన దరిమిలా టెయిల్‌ఎండ్ (చివరి భూములకు) సమస్యలు తప్పడంలేదు. మధ్యప్రదేశ్ అమలుచేస్తున్న టెయిల్ టు హెడ్ విధానం వల్ల సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందని రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల కింద అధికారులు రుజువుచేశారు. పలు సమీక్షల్లోనూ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ విధానాన్ని అమలు చేయాలని పదేపదే సూచిస్తున్నారు. అధికారులు డిస్ట్రిబ్యూటరీల కింద ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసి, ఆయకట్టు రైతులంతా వరి వైపు వెళ్లకుండా ముందస్తు అవగాహనతో చైతన్యం తీసుకురావాల్సి ఉందంటున్నారు. రీడిజైనింగ్‌లో భాగంగా రూపొందించిన శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంతో ప్రాజెక్టు పరిధిలో టెయిల్‌ఎండ్ సమస్యకు చెక్ పడుతుందని అధికారులు ఆశిస్తున్నారు. సీఎం కేసీఆర్ కూడా పలు పర్యాయాలు ఈ విషయాన్ని చెప్పారు. కాకతీయ కాల్వ మరమ్మతులతో పాటు పునర్జీవ పథకాన్ని పూర్తి చేస్తున్నందున టెయిల్‌ఎండ్ సమస్య ఉత్పన్నం కావొద్దని ఇప్పటికే స్పష్టం చేశారు. కాగా, పునర్జీవ పథకం పూర్తయితే శ్రీరాంసాగర్‌లో నీటి లభ్యతకు ఢోకా ఉండదు కాబట్టి చివరి భూములకు నీళ్లందకపోవడం అనే అంశమే ఉత్పన్నం కాదని ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ అభిప్రాయపడుతున్నారు. ఏ ప్రాజెక్టుల్లో ఉన్న టెయిల్‌ఎండ్ సమస్యలకైనా పైప్‌లైన్ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ (టీ) ప్రధానకార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూసేకరణ సమస్య ఉండకపోవడం సానుకూలాంశం కాగా, పైప్‌లైన్ల వల్ల నీటి ఆదాతో చివరి భూములకూ నిర్దేశిత పరిమాణంలో నీరు అందించగలుగడం మరో సానూకూలతన్నారు. అందుకే ప్రభుత్వం కాళేశ్వరం పథకంలో భాగంగా చేపడుతున్న ప్యాకేజీ-20, 21 పరిధిలోని రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పైప్‌లైన్ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించిందని చెప్పారు. ఈ విధానాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరముందని, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల్లోనూ పైప్‌లైన్ వ్యవస్థ అమలుచేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి

కాకివాగులో ఇసుక క్వారీ లేదు

సాయిలు వీఆర్‌ఏ కాదు.. అది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన

కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి

కామారెడ్డి / నమస్తే తెలంగాణ: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగావ్‌లో జరిగిన ఘటనలో మృతి చెందిన సాయిలు వీఆర్‌ఏ కాదని, ఆయన చిన్నాన్న నారాయణ వీఆర్‌ఏ అని కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని జనహిత సమావేశ హాల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాకివాగులో ఇసుక కార్వీ లేదన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ రికార్డుల ప్రకారం కాకివాగు ఇసుక రవాణా ప్రాంతం కాదని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ఈ వాగులో నుంచి బతానీ గింజలాగా ఉండే ఇసుకను మరుగుదొడ్ల నిర్మాణం, ఇతర పనులకు మాత్రమే తీసుకెళ్తారని చెప్పారు. సాయిలుకు, ఆయన భార్య సాయవ్వ మధ్య గొడవలు జరుగడంతో ఇంటి నుంచి బయటకు వచ్చినట్టు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ ఎర్ర అంబయ్య, సాయిలు పడుకున్న ప్రాంతాన్ని గమనించలేదని, దీంతో సాయిలు పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో చనిపోయినట్టు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు ఐదుగురు కూలీలు ఉన్నారని, పక్క చేనులో రైతు సాయిలు సైతం ఉన్నాడని, ప్రమాదం జరిగిన సమయంలో వీరు ప్రత్యక్షంగా ఉన్నారని చెప్పారు. ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ కాదని, ఇటుకల లోడ్‌తో ట్రాక్టర్ వెళ్లిందన్నారు. జిల్లాలో హస్గుల్ , కిష్టాపూర్ రెండు చోట్ల మాత్రమే ప్రభుత్వ ఇసుక క్వారీలు ఉన్నాయన్నారు. వీటి నుంచి డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి, రోడ్డు పనులకు ఇసుకను తీసుకెళ్తారని చెప్పారు. కొన్ని పత్రికలు, మీడియాలో ఇసుక మాఫియా చేతిలో వీఆర్‌ఏ హత్యకు గురైనట్టు వచ్చిన వార్తలో నిజంలేదని స్పష్టంచేశారు. ఉదయం 11 గంటల నుంచి ఎస్పీ శ్వేతారెడ్డితోపాటు తాను గ్రామస్థులతో విచారణ చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు. ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతున్నదన్నారు. ఈ మేరకు పిట్లం పోలీసుస్టేషన్‌లో ట్రాక్టర్ డ్రైవర్ ఎర్ర అంబయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ప్రాథమిక విచారణలో సాయిలు యాక్సిడెంటల్‌గా మృతిచెందినట్టు తేలిందన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పూర్తి వివరాలు అందుతాయని వివరించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 32 కేసులు నమోదు చేసి రూ.3 లక్షల 82 వేల జరిమానా విధించామని, 44 ట్రాక్టర్లను సీజ్‌చేశామని తెలిపారు.




ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 5.52 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, పంచమి సాయంత్రం 5.11 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం: మఖ తె. 2.16 వరకు తదుపరి పుబ్బ. అమృత ఘడియలు: రాత్రి 7.12 నుంచి 8.48 వరకు, తిరిగి రాత్రి 12.02 నుంచి తె. 1.38 వరకు, రాహుకాలం: ఉదయం 9.37 నుంచి 10.59 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.51 నుంచి 8.20 వరకు, వర్జ్యం: ఉదయం 9.58 నుంచి 11.34 వరకు.

లోకం పోకడ



అర్థం చేసుకోండి.. డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్ని కంట్రోల్ చేయలేకే నేను తాగాల్సొచ్చిందిష

ఎవరు మాఫియా?

మొదటిపేజీ తరువాయి...

ఆస్తులు, పొట్టలు పెంచుకున్నారు తప్ప ప్రజలకేమీ చేయలేదని విమర్శించారు. రైతుల పొలాలకు నీళ్లు వస్తుంటే తమ కిందికి నీళ్లు వస్తున్నాయనే కడుపుమంటతోనే కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. 'రాత్రి కరెంటుతో పాములు కరువంగా, తేళ్లు కుట్టంగా, బాయిలకాడికి పోయి.. ఎంతోమంది రైతులు చనిపోయిన సంగతి తెలియదా?' అని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు అనే రీతిలో 24 గంటల కరెంటుపై కాంగ్రెస్ నాయకులు షబ్బీర్‌అలీ, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి అవగాహన లేకుండా ఏదో మాట్లాడుతున్నారని విమర్శించారు. 'నీకు శాతగాదు.. చేయకపోతివి.. మంచిమాట చెప్పకపోతివి.. కరెంటు ఇచ్చే దమ్ము, ధైర్యం లేకుండా మాట్లాడుతున్నారు' అని మంత్రి కేటీఆర్ దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడిన నాడు విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 4,700 మెగావాట్లు ఉండగా ప్రస్తుతం అది 14వేల మెగావాట్లకు చేరిందని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా లేనివిధంగా తెలంగాణలో మూడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తును కొత్తగా ఉత్పత్తి చేశామని వివరించారు. అద్భుతంగా నాణ్యమైన కరెంటు ఇస్తున్నది వాస్తవం కాదా? సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు ఉన్నాయా? అని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. తమ పాలనలో కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా తండాల సౌకర్యాలు, వసతుల గురించి ఆలోచించిందా? అని ప్రశ్నించారు. తండాలు, గూడేల్లో తాగునీటికి కూడా మహిళలు కిలోమీటర్ల కొద్దీ తరలిపోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించాలనే ఆలోచన వచ్చిందా? అని ప్రశ్నించారు. గిరిజనుల పండుగైన సమ్మక్క సారలమ్మ జాతరకు తాము ఉప రాష్ట్రపతిని ఆహ్వానించామని, గతంలో ఏనాడైనా ఈ జాతరకు జాతీయస్థాయి పదవుల్లో ఉన్న వారిని ఆహ్వానించారా? అని ప్రశ్నించారు. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకులా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అయ్యారని చెప్పారు. రైతుల కష్టం తెలిసిన వ్యక్తి కాబట్టే సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.4వేలు పెట్టుబడి ఇచ్చేందుకు ముందుకొచ్చారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికైనా ఇలాంటి అలోచన వచ్చిందా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో గతానికి భిన్నంగా పరిస్థితి ఉన్నదని చెప్పారు. గతంలో అసెంబ్లీకి ఎండిపోయిన వరికంకులు, పురుగుల ముందులు పట్టుకొచ్చేవారని, రోశయ్య ఉరితాడు పట్టుకొని వచ్చారని గుర్తుచేశారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఎరువులు, విత్తనాలను పోలీస్‌స్టేషన్లలో పెట్టి అమ్మించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేని విమర్శించారు. గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టారని, రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథిలో కూడా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని గుర్తుచేశారు. కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తడట అంటూ ఎద్దేవాచేశారు. ప్రజలకు ఏమీచేయని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఆగం చేయటంలో, మసిపూసి మారేడుకాయ చేయటంలో పీహెచ్‌డీ చేశారని తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీవి చిల్లర రాజకీయాలని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్ పరిపాలనను ఇంటి దగ్గరకు తీసుకురావటంతో కాంగ్రెస్ నాయకులకు అజీర్తి అవుతున్నదని విమర్శించారు. గడ్డాలు పెంచితే సన్యాసులు అవుతారు తప్ప అధికారంలోకి రాలేరని ఎద్దేవాచేశారు. తాము తప్పు చేస్తే ప్రజలు శిక్షిస్తారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో కార్యకర్తలు ఒక్కొక్కరు సైనికుడిగా పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయం అంటే వ్యాపారం కాదని, దేవుడిచ్చిన బ్రహ్మాస్త్రం లాంటిదని, పేదలకు సేవచేయటానికి ఉపయోగించాలని చెప్పారు. తన అనుభవంలో 14 మంది సీఎంలను చూశానని, కేసీఆర్ అంత చక్కటి సీఎంను దేశంలోనే చూడలేదని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా దొరుకటం తెలంగాణ ప్రజల అదృష్టమని అన్నారు. మంత్రి కేటీఆర్‌ను తండ్రికి తగ్గ తనయుడిగా పోచారం అభివర్ణించారు. బాన్సువాడ నియోజకవర్గంలో 40 ఏండ్ల రాజకీయ చరిత్ర తనకు ఉన్నదని, మొదటినుంచి తనకు దళితులు, బంజారాలు, గిరిజన, బీసీవర్గాలు అండగా నిలిచాయని, రెడ్డి కులస్థులు తనను బహిష్కరించారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, ఆరూరి రమేశ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు గవర్నర్ క్లాస్

మొదటిపేజీ తరువాయి...

తదితరులు శుక్రవారం రాజ్‌భవన్‌కు తరలివెళ్లారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో ఇసుక మాఫియా సాయిలు అనే వీఆర్‌ఏని బలిగొన్నదని వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా చెలరేగిపోతున్నదని, అందులో భాగంగానే కారెగాంలో వీఆర్‌ఏ హత్య జరిగిందని చెప్పుకొచ్చారు. అయితే.. సాయిలు మృతిపై పోలీసుల నుంచి అప్పటికే వివరాలు తెలుసుకున్న నరసింహన్.. సాయిలు వీఆర్‌ఏ కాదని, రాత్రి సయయంలో భార్యతో గొడవపడి అంబాపూర్‌లోని కూతురు వద్దకు వెళుతున్న క్రమంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందాడని, అతడి మృతిలో ఇసుక మాఫియా హస్తంలేదని చెప్పేసరికి కాంగ్రెస్ నాయకులు కంగుతిన్నట్టు సమాచారం. నేరెళ్ల నుంచి కామారెడ్డి వరకు ప్రభుత్వం ఇసుకను మాఫియాకు కట్టబెట్టిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడంపై కూడా గవర్నర్ స్పందించారు. రాష్ట్రంలో ఎక్కడా అలాంటి పరిస్థితి కన్పించడం లేదుకదా అని నరసింహన్ పేర్కొన్నట్టు తెలిసింది. అయినా.. ప్రతీ చిన్న విషయానికి ముఖ్యమంత్రిని, మంత్రి కేటీఆర్‌ని టార్గెట్ చేసినట్టు మాట్లాడటం కంటే ఆధారాలు చూపి ఆరోపించాలని వారికి హితవు పలికినట్టు సమాచారం.

మైనింగ్ మంత్రి కాబట్టే కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నామని, నేరెళ్లలో ఇసుక మాఫియాకు దళితులు బలైనా ప్రభుత్వపరంగా నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి ఘటన ప్రమాదమని, నేరెళ్లలో దళితులకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలపై వాస్తవాలు తెలుసుకుంటానని గవర్నర్ వారికి చెప్పినట్టు తెలిసింది. మంద కృష్ణ మాదిగను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపించగా, కండీషనల్ బెయిల్‌పై ఉన్నవ్యక్తి ఆందోళన చేయడం తగదు కదా? అని గవర్నర్ అభిప్రాయపడ్డట్టు సమాచారం. గవర్నర్ నరసింహన్ ఇంతగా స్పందిస్తారని ఊహించని కాంగ్రెస్ నాయకులు బిక్కమొహాలు వేసుకుని రాజ్‌భవన్ నుంచి బయటకు వచ్చారు.


మలక్‌పేటలో దివ్యాంగుల పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, మేయర్ రామ్మోహన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ముసారంబాగ్‌లో ఇండోర్ స్టేడియంను ప్రారంభించి షటిల్ ఆడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి


సాహెబ్‌నగర్‌లో రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, మేయర్ రామ్మోహన్, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఆర్ కృష్ణయ్య

సోలార్‌లో గుజరాత్‌ను వెనక్కినెట్టాం

- 24 గంటల విద్యుత్ సరఫరాతో చరిత్ర సృష్టించాం
- వ్యవసాయానికి కరెంట్, ఇంటింటికీ నీళ్లు ఇస్తే ప్రతిపక్షాలకు కడుపుమంట
- దివ్యాంగులకు దేశంలో మొదటి ఐటీ పార్కు
- డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మూడు శాతం వారికే
- గ్రేటర్ హైదరాబాద్ పర్యటనలో మంత్రి కేటీఆర్
- ఇండోర్ స్టేడియం, ఏడు రిజర్వాయర్లు, దేశంలోనే మొదటి దివ్యాంగుల పార్కు ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: 'సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులతో ప్రభుత్వం ముందుకు పోతున్నది. కానీ కొంతమంది ఓర్వలేక ప్రభుత్వంపై రాజకీయపరమైన విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా 24 గంటలపాటు విద్యుత్ సరఫరాపై చిల్లరమల్లరగా మాట్లాడుతున్నరు. కరెంట్ ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడి నుంచి ఇస్తున్నరు? అని అంటున్నరు. కాంగ్రెస్‌పోళ్లకు అధికారంలో ఉన్నప్పుడు చాతకాలేదు కానీ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ ఇస్తుంటే ఓర్వలేక విమర్శిస్తున్నరు' అని ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కే తారక రామారావు కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. 'ప్రతిపక్ష పార్టీకి.. ఇంటింటికీ తాగునీరిస్తే కండ్లమంట.. కడుపు నిండా కరెంట్ ఇస్తే కడుపుమంట.. ఇంతకంటే దౌర్భాగ్యమైన ప్రతిపక్షం నాకు తెలిసి దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేదు' అని ఎద్దేవాచేశారు. ప్రజలకు మంచిచేస్తే సంతోషపడాల్సింది పోయి కరెంట్ ఎక్కడి నుంచి ఇచ్చినరు.. ఎట్ల ఇస్తున్నరని మాట్లాడటం సిగ్గు చేటన్నారు. శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్‌లో విస్తృతంగా పర్యటించిన మంత్రి కేటీఆర్ జలమండలి ఆధ్వర్యంలో రూ.1900 కోట్ల హడ్కో పథకంలో పూర్తి చేసిన ఏడు రిజర్వాయర్లను ప్రారంభించారు. మలక్‌పేటలో దివ్యాంగుల పార్కును, ముసారంబాగ్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడేనాటికి తెలంగాణలో విద్యుత్ స్థాపిత సామర్థ్యం 4,370 మెగావాట్ల పైచిలుకు మాత్రమేనని, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ స్థాపిత సామర్థ్యం 14 వేల మెగావాట్లకు చేర్చిన ఘనత ప్రభుత్వానిది కాదా? అని ప్రశ్నించారు. విద్యుత్‌ను మెరుగుపర్చేందుకు రూ.12 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టి కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లేన్లు వేసింది కనిపించడంలేదా అని నిలదీశారు. సోలార్ విద్యుత్ విషయంలో రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌ను కూడా వెనుకకు నెట్టి మూడు వేల మెగావాట్ల పైచిలుకు ద్వారా దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, ఇది సీఎం కేసీఆర్, ప్రభుత్వ నాయకత్వ పటిమ కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సిందిపోయి కుసంస్కారంతో చిల్లరమల్లర విమర్శలు చేసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. తమకు బాసులు ఢిల్లీలో, పక్క రాష్ట్రంలో లేరని, రాష్ట్ర ప్రజలే తమకు బాసులన్నారు. ప్రజలకు జవాబుదారితనంగా ఉంటామే తప్ప దారిన పోయే దానయ్యలకు జవాబు చెప్పాల్సిన పనిలేదన్నారు. సమర్థవంతంగా పనిచేస్తే ప్రజల మన్ననలు అందుకునే దిశగా ప్రభుత్వ ఒక్కో కార్యక్రమం చేసుకుంటూ పోతున్నదన్నారు.

రాష్ట్ర అవతరణ కానుకగా ఎల్బీనగర్ వరకు మెట్రో

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) రోజున ప్రజలకు కానుకగా ఎల్బీనగర్ వరకు మెట్రో మార్గాన్ని ప్రారంభించి తీరుతామని, ఈ దిశగా ప్రత్యేక లక్ష్యంతో నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. మెట్రోను దశలవారీగా అందుబాటులోకి తీసుకొచ్చి నగరంలో ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేస్తామన్నారు.

రూ.3,100 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

జీహెచ్‌ఎంసీలో విలీనమైన మున్సిపాలిటీల్లో తాగునీటి కొరత తను తీర్చినట్టే డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ మున్సిపాలిటీల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.3,100 కోట్ల అంచనాతో డీపీఆర్‌ను రూపొందించనున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఈ డ్రైనేజీ నిర్మాణ పనులు మొదలు పెడుతామని హామీ ఇచ్చారు. మూసీ సుందరీకరణ పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు.

విపక్ష నేతలు మెచ్చుకోవడం గర్వంగా ఉన్నది

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు తావు లేకుండా అధికార పార్టీతోపాటు విపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య లాంటి నేత 'సీఎం కేసీఆర్ ఏ పని చేసినా సాహసోపేతంగా నిర్ణయాలు తీసుకుంటారు' అని చెప్పడం గర్వంగా ఉన్నదన్నారు. రాజకీయాల్లో స్వరసాధారణంగా ఒకరిపై ఒకరు సానుకూలంగా మాట్లాడుకోవడం తక్కువ, కానీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య కితాబు ఇవ్వడం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ఎల్బీనగర్‌పై వరాల జల్లు

ఎస్‌ఆర్‌డీపీలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో చేపడుతున్న పథకాల్లో జూన్ 2 వరకు రెండు ప్రాజెక్టులను, మరో రెండు ప్రాజెక్టులను ఈ ఏడాది చివరికి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి కేటీఆర్ వివరించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా ఎల్బీనగర్ ప్రజలకు రెండు హామీలు ఇచ్చామని, ఈ నియోజకవర్గంలో నాలుగు వేల పైచిలుకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కడుతున్నామని, వీటిని దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. ఇక సర్వే నంబర్లు 200, 96, 101, 73, 58లలో ఇండ్లు రిజిస్ట్రేషన్ కావడం లేదని తమ దృష్టికి వచ్చిన సందర్భంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చామన్నారు. దీనిపై ఈ నెల 11, 12వ తేదీల్లో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ సమయం తీసుకొని ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, కాలనీ సంఘాల నేతలతో సమావేశమై శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు.

కరెంటు, మంచినీటి కష్టాలకు చరమగీతం

తెలంగాణ వస్తే అసలు కరెంట్ ఉండదని, చిమ్మచీకట్లు కమ్ముకుంటాయని నాటి ముఖ్యమంత్రులు విమర్శించారని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. కానీ మూడున్నరేండ్లలోనే దేశంలోని అన్ని రాష్ట్రాలు, ముఖ్యమంత్రులు, దశాబ్దాల పరిపాలనా అనుభవం కలిగిన మహానుభావులు నోరు వెల్లబెట్టుకునేలా రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ చరిత్ర సృష్టించామన్నారు. అన్నదాతలను ఆదుకుంటున్న ఏకైక సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా హైదరాబాద్ ప్రజలు పడుతున్న నీటి కష్టాలకు చరమగీతం పాడామని, శాశ్వతంగా మంచినీటి కష్టాలు లేకుండా చేశామన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లకు టెండర్లు పిలిచి పనులను వేగిరం చేశామని, ఒక్కో ఇంటిని 560 స్క్వేర్ యార్డులో రూ.8.70 లక్షలతో కడుతున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందన్నారు.

కార్పొరేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక పార్కులు

రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రత్యేక ఐటీ పార్కును ఏర్పాటుచేస్తున్నట్టు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. గ్రేటర్‌లో నిర్మించే లక్ష ఇండ్లలో దివ్యాంగులకు మూడు శాతం ఇండ్లను కేటాయించనున్నట్టు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక పార్కులను ఏర్పాటుచేయనున్నామన్నారు. మలక్‌పేట్‌లో రూ.1.77 కోట్లతో దివ్యాంగుల కోసం నిర్మించిన ప్రత్యేక జాతీయ పార్కును ప్రారంభించారు. దివ్యాంగులకు పలురకాల చికిత్సల కోసం ప్రత్యేక కేంద్రాలతో కూడిన ఇటువంటి జాతీయ పార్కు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని కితాబిచ్చారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు నగరంలో ఇటువంటి పార్కులు ఏర్పాటుచేసేందుకు ముందుకొస్తే సహకరిస్తామన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక ఐటీ పార్కు ఏర్పాటుకు బెంగళూరుకు చెందిన ఓ సంస్థ ముందుకొచ్చిందని, ఐదు నుంచి పది ఎకరాల స్థలం కేటాయిస్తే వారు ఐటీ పార్కు ఏర్పాటుచేస్తామన్నారని చెప్పారు. వారికి అవసరమైన స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముసారంబాగ్‌లో టీఆర్‌ఎస్ కార్పొరేటర్ సునరితారెడ్డి, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అస్లమ్ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వాటిని గమనించిన మంత్రి కేటీఆర్ వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు సునరితారెడ్డికి రూ.50 వేలు, అస్లమ్‌కు రూ.25 వేలు జరిమానా విధించి వసూలు చేశారు. మంత్రి వెంట డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎంపీలు చామకూర మల్లారెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆర్ కృష్ణయ్య, బలాలా, వికలాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, కమిషనర్ జనార్దన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



దివ్యాంగుల పార్కు ప్రారంభోత్సవ సభలో మంత్రులు కేటీఆర్, నాయిని, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాటామంతి. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, వికలాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి కూడా ఉన్నారు.

దమ్మున్న సీఎం కేసీఆర్

ఇంటింటికీ నల్లా ద్వారా నీరందించి ఆడబిడ్డల కష్టాలు తీరుస్తానని, నీటి కష్టాలు తీర్చకపోతే మళ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగనన్న దమ్మున్న సీఎం కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ తెలిపారు. రూ.2 వేల కోట్లతో గ్రేటర్‌లో విలీనమైన 10 మున్సిపాలిటీల్లో ప్రజలకు సమృద్ధిగా నీరందిస్తున్నామన్నారు. ఈ ఏడాది మార్చి వరకు ఈ పథకం పనుల గడువు ఉన్నప్పటికీ మూడు నెలలు ముందుగానే ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి అనుగుణంగా జలమండలి పరిధిని ఔటర్ వరకు విస్తరించి ఓఆర్‌ఆర్ లోపల ఉన్న 174 గ్రామాల తాగునీటి కోసం రూ.700 కోట్లతో పనులు చేపట్టామన్నారు. 800 గురుకులాలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.20 లక్షలు ఖర్చు పెడుతూ లక్షల మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నామన్నారు. ఉచిత డయాలసిస్, ఐసీయూలతోపాటు బస్తీ దవాఖానాలతో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ కిట్లు అద్భుత కార్యక్రమమన్నారు.

ఎక్కడ చూసినా అభివృద్ధే: ఎంపీ మల్లారెడ్డి

రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పరుగులు పెడుతున్నదని మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పరిధిలో రూ.రెండు వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. దేశంలో నంబర్‌వన్ రాష్ట్రం తెలంగాణ అని, నంబర్ వన్ సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వం ఉండటం తెలంగాణ ప్రజల అదృష్టమన్నారు. మరి కొన్ని రోజుల్లో ప్రతి కుటుంబానికి సరిపడా రోజూ మంచినీళ్లు వస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేసీఆర్ ప్రతి నిర్ణయం చారిత్రాత్మకమే: ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య


రిజర్వాయర్లను ప్రారంభించిన అనంతరం సాహెబ్‌నగర్ సభలో మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య నవ్వులు

సీఎం కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా అది చారిత్రాత్మకమేనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశంసించారు. ఎల్బీనగర్‌లో అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదన్నారు. గతంలో ఎండాకాలం వస్తే ప్రజల్లో భయం ఉండేదన్నారు. ఇప్పటినుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవన్నారు. సరిపడా నీటి సరఫరా ఉంటుందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా కలా.. నిజామా అన్న సందేహం కలుగుతున్నదన్నారు. అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. నియోజకవర్గం శివారున ఉన్నందున కొత్త కాలనీలు అధికంగా ఉన్నాయన్నారు. దీంతో సమస్యలు కూడా పెరుగుతున్నాయన్నారు. రహదారులు, డ్రైనేజీలను నిర్మించాల్సి ఉందని, మంత్రి కేటీఆర్ ఆయా సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. మురుగునీరు సరూర్‌నగర్ చెరువులో కాకుండా మూసీలో కలిసేలా పెద్ద ఎత్తున ట్రంక్ లైన్లు నిర్మించాల్సిన అవసరం ఉన్నదన్నారు. సమయానికి ముందే పనులు నిర్వహించిన జలమండలి అధికారులు, సిబ్బందిని అభినందించారు. కేటీఆర్ వేగవంతగా నిర్ణయాలు తీసుకొని పనులు పూర్తి చేస్తారని, తమ నియోజకవర్గంలో కావాల్సిన అవసరాలపై అదే తీరుతో నిధులు మంజూరు చేయాలని కోరారు.

డబ్బులిస్తే ఇంటర్ ప్రాక్టికల్స్‌లో మార్కులు

- ప్రైవేట్ కాలేజీల కొత్త దందా.. ఫిర్యాదులు అందాయంటున్నబోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో కొత్త దందా మొదలైంది. నాణ్యత ప్రమాణాల కోసం ఓ వైపు ప్రభుత్వం, ఇంటర్మీడియట్ బోర్డు కృషి చేస్తుంటే.. మరోవైపు ప్రైవేట్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాయి. నగదు ఇస్తే ప్రాక్టికల్స్ చేయకపోయినా మార్కులు వేస్తామంటున్నారు. అధిక నగదు ఇస్తే ఎక్కువ మార్కులు వేస్తామని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభ పెడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయని ఇంటర్‌బోర్డు సెక్రటరీ ఏ అశోక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యాజమాన్యాలు చేస్తున్న మోసాలకు ఎవరూ బాధితులు కావొద్దని ఆయన చెప్పారు. డబ్బులు వసూలు చేస్తున్న కాలేజీలపై 040-246001100 సహాయ కేంద్రానికి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఉస్మానియా దవాఖానలో ట్రామా కేర్ సెంటర్

ప్రమాదాల్లో గాయపడ్డవారికి మరింత మెరుగైన వైద్యం.. డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/సుల్తాన్‌బజార్: నిమ్స్ దవాఖానలో మాదిరిగా ఉస్మానియాలో కూడా ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దవాఖానలోని ఎడ్వర్డ్ హాల్‌లో నిర్వహించిన హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్(హోం) జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏదైన ప్రమాదంలో గాయపడినవారికి అత్యవసర చికిత్సలు అందించే లెవల్-1 ట్రామా కేర్ సెంటర్ ప్రస్తుతం నిమ్స్‌లో మాత్రమే ఉన్నదని, త్వరలోనే ఈ కేంద్రాన్ని ఉస్మానియాలో కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ఇతర విభాగాల అధిపతులు కూడా హోం వంటి సదస్సులను నిర్వహించాలన్నారు. ఇలాంటి సదస్సుల వల్ల వైద్య విద్యార్థులకు క్లీనికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్ అవసరమని, వీటి వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు సత్వర వైద్యసేవలు అందే వీలుంటుందన్నారు. ప్రస్తుతం కామారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో ఈ సెంటర్లు ఉన్నప్పటికీ అవి తక్కువ స్థాయిలోనే పనిచేస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని వైద్యరంగం అభివృద్ధికి రూ.కోట్లు కేటాయిస్తున్నందువల్లే మెరుగైన వైద్యం అందుతున్నదని, ఫలితంగా నేడు సర్కార్ దవాఖానలకు రోగుల తాకిడి పెరిగిందన్నారు. అనంతరం 'హోం' సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ పద్మ, ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డాక్టర్ కోదండపాణి, డాక్టర్ రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఉస్మానియా దవాఖానలో 'హోం' సీడీని ఆవిష్కరిస్తున్న డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి

పోలీసులకు దోపిడీ ముఠా సవాలు

బైక్ నంబర్ ప్లేట్ తీసేసి మరో దోపిడీకి విఫలయత్నం

రెండు రోజులు నగరంలోనే ముఠా.. ప్రత్యేక బృందాల వేట

హైదరాబాద్ సిటీబ్యూరో/చార్మినార్, నమస్తే తెలంగాణ: పట్టపగలు దారిదోపిడీకి పాల్పడిన ముఠా నగరంలోనే తిష్టవేసి, దోపిడీ చేసిన బైక్ నంబర్ ప్లేట్‌ను తీసేసి మరో దోపిడీకి విఫలయత్నం చేసింది. ఎలాంటి ఘటననైన వెంటనే ఛేదించే సత్తా ఉన్న నగర పోలీసులకు దోపిడీ ముఠాను పట్టుకోవడం సవాలుగా మారింది. మూడు రోజులైనా దోపిడీ ముఠా దొరుకకకుండా సవాలు విసురుతున్నది. పట్టపగలు దోపిడీలకు పాల్పడ్డ ఈ ముఠాను పట్టుకోవడానికి జూబ్లీహిల్స్, టాస్క్‌ఫోర్స్, సౌత్‌జోన్ పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్ ఘటన జరుగగానే దోపిడీ దొంగల రూట్‌ను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నించి ఉంటే దొంగలు దొరికేవారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు డయల్ 100కు ఫోన్ చేయగానే పోలీసులు ఐదు నిమిషాల్లోనే ఘటన స్థలికి వెళ్లారు. దోపిడీ ముఠా వెళ్లిన రూట్‌లోని పోలీసులను అప్రమత్తం చేసి, ఇంటర్ సెప్టర్, పెట్రోలింగ్ వాహనాలను ఉపయోగించుకొనే అవకాశాలున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో దోపిడీ ముఠా పోలీసుల కండ్లు గప్పి నగరంలో సంచరించింది. జూబ్లీహిల్స్ ఘటన బుధవారం జరిగితే గురువారం సీసీ కెమెరా పుటేజీ బయటకు వచ్చిన తర్వాతే పోలీసులు వేగంగా స్పందించినట్టు తెలుస్తున్నది.

ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాగా అనుమానం

పట్టపగలు జూబ్లీహిల్స్‌లో బైక్‌ను దోపిడీ చేసిన ముఠా బేగంపేట వరకు వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఆ తర్వాత వాళ్లు ఎక్కడికి పోయారనేది పోలీసులకు అంతు చిక్కడం లేదు. ముగ్గురు సభ్యులు ఉన్న ఈ ముఠా గురువారం బహుదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం మరో దోపిడీకి విఫలయత్నం చేసింది. రమ్నాస్‌పురకు చెందిన అబ్దుల్లా బిన్ అల్ అఫ్సర్(20) గురువారం సాయంత్రం 4 గంటలకు పార్కు సమీపంలోని ఎస్‌బీఐలో రూ.40 వేలు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. బ్యాంకు పనివేళలు ముగిశాయని సిబ్బంది నగదు డిపాజిట్ చేసుకోకపోవడంతో వెను తిరిగాడు. అప్పటికే దుండగులు అనుమానాస్పదంగా సంచరిస్తూ బ్యాంక్‌లో లావాదేవీలను పరిశీలిస్తూ అబ్దుల్లాను గమనించారు. అతను తిరిగి డబ్బులతో వెళ్తున్న విషయాన్ని పసిగట్టి దోపిడీ చేసిన బైక్‌పై అతనిని వెంబడించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఒంటరిగా ఉన్న అబ్దుల్లాపై దాడి చేసి అతని వద్ద ఉన్న నగదును దోచుకునేందుకు ప్రయత్నించగా బాధితుడు పెద్దగా అరిచాడు. ఆ అరుపులు విన్న స్థానికులు నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. దీంతో దుండగులు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయారని సౌత్ జోన్ డీసీపీ సత్యనారాయణ తెలిపారు. వీరు బీహార్ బవరీయా గ్యాంగ్ సభ్యుల తరహా దోపిడీలకు పాల్పడుతున్నారని డీసీపీ తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో దోపిడీ చేసిన ముఠా ఆ రోజు రాత్రి హైదరాబాద్‌లోనే మకాం వేసి, మరుసటి రోజు గురువారం బహుదూర్‌పురాలో దోపిడీకి ప్రయత్నించినట్టు తెలుస్తున్నది. దోపిడీ చేసిన బైక్ నంబర్ ప్లేట్‌ను తీసేసిన ఆ ముఠా నగరంలో తిరిగినట్టు బహుదూర్‌పురా ఘటనతో వెల్లడవుతున్నది. హైదరాబాద్ పోలీసుల వద్ద సుమారు లక్షకుపైగా పాత నేరస్థుల డేటాబేస్ ఉన్నది. అందులో దోపిడీ ముఠాకు సంబంధించిన ఆనవాళ్లు ఏమైనా దొరుకుతాయని ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. ఇది ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా కావచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు రోజులుగా విచారణ జరుపుతున్న పోలీసులు ఈ ముఠాకు సంబంధించిన కీలకమైన ఆధారాలు లభ్యమయినట్టు జూబ్లీహిల్స్ డీఐ ముత్తు తెలిపారు.



పాక్ నేతలు ఆ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారు. వారి భద్రత విషయంలో మేమెంతో చేశాం. టెర్రరిస్టు దాడుల నుంచి రక్షించాం. అయినా పాక్ కొన్ని టెర్రరిస్టుమూకలకు మద్దతుగా నిలుస్తున్నది. దీంతోనే అమెరికా ఆందోళన చెందుతున్నది. పాక్ మరో ఉత్త రకొరియాలాగా మారాలనుకుంటే నష్టపోయేది వారేననేది గుర్తించాలి.

హెచ్.ఆర్.మెక్ మాస్టర్, అమెరికా జాతీయ భద్రతా సలహాదారుడు



పాకిస్థాన్ పట్ల అమెరికా వైఖరి ఒక మిత్రదేశం, లేదా సహచరదేశంలా లేదు. పాక్ గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎన్నడూ అమెరికా పాక్‌కు మద్దతుగా నిలువలేదు. ఎప్పుడూ మిత్రద్రోహమే చేసింది. ఈ నేపథ్యంలో మా జాతి ప్రతిస్పందనలకు అనుగుణంగా నడుచుకుంటాం. అమెరికాతో అన్నిరకాల సంబంధ, బాంధవ్యాలను సమీక్షించుకుంటాం.

ఖవజా ముహమ్మద్ ఆసిఫ్, పాకిస్థాన్ విదేశాంగ మంత్రి

చరిత్రలో నేడు



1838

టెలిగ్రాఫ్ విధానాన్ని కనుగొన్న ఆల్‌ఫ్రెడ్ వేల్.



1907

రోమ్‌లో తొలిసారిగా మాంటిస్సోరీ స్కూల్‌ను ప్రారంభించిన మారియా మాంటిస్సోరీ.



1929

పేదల సేవ కోసం కలకత్తా చేరుకున్న మదర్ థెరీసా.

మహారాష్ట్ర పూణె నగర శివారులోని భీమా కోరేగావ్ గ్రామంలో జరిగిన అల్లర్ల నివారణలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. ఏటా జనవరి ఒకటిన నిర్వహిస్తున్న ఈ సమావేశానికి వేలాదిగా దళితులు తరలివస్తారని తెలిసి కూడా మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కనీస భద్రతా చర్యలు తీసుకోలేదని తెలుస్తున్నది. దీంతోనే ఆ గ్రామంలో మొదలైన అల్లర్లు అన్ని నగరాలకు విస్తరించాయి. 1818 బ్రిటిష్ పాలనాకాలంలో మెహర్ సైనికులు స్థానిక భూస్వామ్య పీష్వాకు వ్యతిరేకంగా పోరాడిన ఆత్మగౌరవ దినంగా పాటిస్తున్నారు.అయితే ఇప్పుడు కొన్ని మతశక్తులు దళితులపై దాడికి పాల్పడటం అల్లర్లకు కారణమైంది.

ది హిందూ

ఆప్ మరోసారి వివాదానికి కేంద్రమైంది. రాజ్యసభ సభ్యుల ఎంపికలో కేజ్రీవాల్ తీరును ఆప్ నేత కుమార్ విశ్వాస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీలోని సీనియర్లను కాదని బయటివారికి పదవులు కట్టబెట్టడం పట్ల కేజ్రీ తీరును అమ్ముడుపోవటంగా విమర్శిస్తున్నాడు. మేధావులను రాజ్యసభకు పంపే పేర పార్టీ వ్యక్తులను అణగదొక్కటం దారుణమని అంటున్నాడు. ఇప్పటికే వరుస ఓటములతో విమర్శలను ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ ఇప్పుడు ఎదురైన వివాదం పార్టీలో పెద్ద సంక్షోభంగా మారే ప్రమాదమున్నది. దీన్ని ఏ విధంగా ఎదుర్కొంటారో చూడాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

స్వదేశాగమనం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'బయ్ అమెరికన్, హైర్ అమెరికన్' అనే నినాదంతో అధికారానికి వచ్చిన నేపథ్యంలో, హెచ్-1బి వీసా కొనసాగింపు పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తారనేది మన దేశ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఆందోళన కలిగిస్తున్నది. ఈ ప్రతిపాదన చట్టరూపం దాలిస్తే, కొన్ని లక్షల మంది నిపుణులైన కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి భారత్‌కు తిరిగి రావలసి ఉంటుందని అంచనా. ఇప్పుడున్న విధానం ప్రకారం- మూడేండ్ల వీసా గడువు మరో పర్యాయం పొడిగించుకోవచ్చు. ఆరేండ్ల తర్వాత గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉంటే, అది తేలేవరకు నిరవధికంగా వీసా పొడిగింపు ఉంటుంది. ఈ క్రమంలో లక్షలాదిమంది భారతీయులు అమెరికాలో స్థిరపడుతున్నారు. కానీ ట్రంప్ చెబుతున్న విధానం అమలులోకి వస్తే గ్రీన్‌కార్డు ప్రాసెసింగ్‌లో ఉన్నప్పుడు హెచ్-1బి పొడిగింపు ఉండదు, వీరు అమెరికాలో కొనసాగలేరు. దీనికితోడు ఇతర దేశస్థులను నియమించుకోవడం వల్ల, స్వదేశీయులు ఉద్యోగం కోల్పోవడం లేదని కంపెనీ హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగులకు కనీస వేతనాన్ని కూడా పెంచుతున్నారు. చౌకగా విదేశీయుల సేవలను ఉపయోగించుకునే వెసులుబాటు ఉండదు. ఇవన్నీ నేరుగా, పరోక్షంగా విదేశీయులను నియమించుకోకుండా, అడ్డుకట్ట వేసే నిబంధనలను ప్రవేశ పెట్టాలనే ప్రతిపాదన ఉన్నది. అయితే ఈ ప్రతిపాదన బిల్లు రూపంలో చట్టసభల్లో ప్రవేశపెట్టడానికి ముందే పారిశ్రామికవర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నది. అందువల్ల గండం గట్టెక్కే అవకాశం కూడా ఉన్నది. ట్రంప్ పట్టుదలగా వ్యవహరిస్తే మాత్రం సాఫ్ట్‌వేర్ కంపెనీలకు, ఉద్యోగస్తులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడటం ఖాయం.

హెచ్-1బి నిబంధనలు మార్చడం జరిగితే ఎక్కువగా నష్టపోయేది భారతీయులే. ఏటా ఇచ్చే 85 వేల హెచ్-1బి వీసాలలో సగానికి పైగా లబ్ధి పొందేది భారతీయులే. ఇప్పటికే హెచ్-1బి వీసాతో వచ్చిన వారి భార్య లేదా భర్తపై ఆంక్షలు విధించదలిచారు. విస్తృత కుటుంబ కోటా కింద వచ్చే వారినీ కట్టడి చేస్తున్నారు. క్రమంగా అమెరికాకు వలస వెళ్ళేవారికి ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయనేది దీనివల్ల తెలుస్తున్నది. ఊహిస్తున్న ప్రమాదం జరుగకపోవచ్చు. కానీ జరిగితే ఏ విధంగా ఎదుర్కోవాలనేది కూడా ఆలోచించవలసిందే. చట్టపరంగా, నైతికంగా అమెరికా అనుసరించే విధానాన్ని తప్పుపట్టలేము. అక్కడి ప్రజలు, అక్కడి అవసరాలకు అనుగుణంగా వారు తమ విధానాలను రూపొందించుకుంటారు. ఈ అంశం ఆర్థికపరమైనదే కాదు, సామాజికమైనది, ఉద్వేగభరితమైనది. ఒక్క అమెరికానే కాదు, పలు ఇతర దేశాలు కూడా వలసల పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తున్నాయి. యూరప్ దేశాలలో నెలకొన్న సంక్షోభం గమనిస్తూనే ఉన్నాం. గల్ఫ్ దేశాలలో ఒకప్పుడున్న ఉపాధి అవకాశాలు ఇప్పుడు లేవు. భవిష్యత్తులో విదేశీ ఉద్యోగాల పరిస్థితి మరింత క్లిష్టంగా మారినా ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ నేపథ్యంలో మన విధానకర్తలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలె. మన ప్రయోజనాల పరిరక్షణకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలె. అభివృద్ధి చెందిన దేశాల పారిశ్రామిక రంగానికి అనుబంధంగా ఉండటం, సేవారంగంపై ఎక్కువగా ఆధారపడటం వంటి అంశాలను సమీక్షించుకోవాలె. మనకంటూ పారిశ్రామిక పునాదిని నిర్మించుకోవడం, స్వావలంబన సాధించడం అవసరం.

చైనా యువత స్వదేశం వెళ్ళి అక్కడి ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసిందనే వార్తలు వినబడుతున్నాయి. మన భారతీయులు స్వదేశం వస్తే, చేతులు ముడుచుకొని ఉండరు. తాజా సాంకేతిక పరిజ్ఞానం వారి చేతిలో ఉన్నది. తమ సృజనాత్మకతను మేళవించి, కొత్త తరహా ఆర్థిక వ్యవస్థలో- ఫేస్‌బుక్, అమెజాన్, ఉబర్ వంటి అనేక కొంగ్రొత్త సంస్థలను సృష్టిస్తారు. కొన్ని లక్షలమంది ఉన్నత విద్యావంతులు, నిపుణులు స్వదేశానికి రావడం వల్ల ఇక్కడి ఆర్థిక వ్యవస్థ మరింత సుసంపన్నం అవుతుందనే నిర్మాణాత్మక దృక్పథం అలవరుచుకుందాం. అమెరికా వద్దనుకుంటే, మన బిడ్డలను రెండు చేతులా ఆహ్వానిద్దాం.

లక్షలాదిమంది తిరిగి వచ్చే కార్మికులకు ఉద్యోగ కల్పన ప్రభుత్వ బాధ్యత కాదు. కానీ వారు ఉపాధి పొందడం అనేది మన ప్రభుత్వాలు అనుసరించే విధానాలపై ఆధారపడి ఉంటుంది. విదేశాల నుంచి నైపుణ్యంతో, అనుభవంతో వచ్చే వారు వృద్ధి పొందే పరిస్థితులు ఇక్కడ నెలకొని ఉండాలె. అది ఇక్కడి పారిశ్రామికులకు, నిపుణులకు, విస్తృతంగా మొత్తం సమాజానికి ఉపయోగపడుతుంది. ఇవాళ హెచ్-1బి వీసా నైపుణ్య కార్మికులు కావచ్చు, రేపు మరో వర్గానికి చెందిన వారు ఉండవచ్చు. విదేశాల నుంచి స్వదేశానికి వచ్చే వారు ఏదో కోల్పోయిన భావనకు గురికాకూడదు. స్వదేశంలో బతుకుదెరువు ఎట్లా అనే ఆందోళన చెందకూడదు. నిపుణులుగా ఎంతో అనుభవంతో స్వదేశంలో అడుగు పెడుతున్నందుకు సంతోషించాలె. తాము గడించిన అనుభవంతో స్వదేశానికి ఏ విధంగా ఉపయోగపడగలమనే మథనం జరుగాలె. ఈ క్రమంలో తాము ఉపాధి పొందడం అనేది చిన్న విషయమై పోతుంది. తాము తమ కాళ్ళ మీద నిలబడటమే కాకుండా, అనేకమందికి ఉపాధి కల్పించి, సామాజిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడిన వారవుతారు. చైనా యువత స్వదేశం వెళ్ళి అక్కడి ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసిందనే వార్తలు వినబడుతున్నాయి. మన భారతీయులు స్వదేశం వస్తే, చేతులు ముడుచుకొని ఉండరు. తాజా సాంకేతిక పరిజ్ఞానం వారి చేతిలో ఉన్నది. తమ సృజనాత్మకతను మేళవించి, కొత్త తరహా ఆర్థిక వ్యవస్థలో- ఫేస్‌బుక్, అమెజాన్, ఉబర్ వంటి అనేక కొంగ్రొత్త సంస్థలను సృష్టిస్తారు. కొన్ని లక్షలమంది ఉన్నత విద్యావంతులు, నిపుణులు స్వదేశానికి రావడం వల్ల ఇక్కడి ఆర్థిక వ్యవస్థ మరింత సుసంపన్నం అవుతుందనే నిర్మాణాత్మక దృక్పథం అలవరుచుకుందాం. అమెరికా వద్దనుకుంటే, మన బిడ్డలను రెండు చేతులా ఆహ్వానిద్దాం.

జనగళం

రక్షణ కల్పించాలె

నగరంలో పట్టపగలే దాడిచేసి దొంగతనాలకు పాల్పడటం చూస్తుంటే భయమేస్తున్నది. రక్షణ పట్ల అభద్రతాభావం ఏర్పడుతున్నది. నగరవ్యాప్తంగా సీసీ కెమెరాలు అమర్చినా దొంగతనాలకు అడ్డుకట్ట పడకపోవటం శోచనీయం. ఇదిలా ఉంటే సాటి మనిషిని ఆగంతకులు కత్తులతో బెదిరిస్తున్నా చుట్టూ ఉన్న వాళ్లు చూస్తూ ఊరుకోవడం చూస్తుంటే మన సమాజం ఎటు పోతున్నదో అర్థమవుతున్నది. ఇకనైనా దొంగల బారి నుంచి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి. పోలీసులు నిఘా పెంచాలి. ప్రజలు కూడా అప్రమత్తతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తాళ్లపెల్లి మనోజ్‌గౌడ్, హైదరాబాద్

కఠినంగా శిక్షించాలె

గజల్ శ్రీనివాస్ చేసిన గలీజు పనులు సామాజిక మాధ్యమాల్లో ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పెద్దమనిషి రూపంలో వింతరక్కసి జనం మధ్యనే ఇన్నాళ్లూ తిరిగిన తీరుపట్ల ఆశ్చర్యం వేస్తున్నది. ఇంతచేసి కూడా తానేం చేయలేదన్నట్లు నటించడం, మాట్లాడటం చూస్తే ఎంత కరుడుగట్టిన మనిషో తెలిసివస్తున్నది. మహిళల పట్ల నీచంగా ప్రవర్తించిన శ్రీనివాస్‌కు కఠినశిక్ష అమలయ్యేలా చూడాలి.

- పి.కవిత, అడ్వోకేట్, వరంగల్

ప్రయాణికులకు భరోసా

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అలంకారప్రాయంగానే ఉంటున్నాయి. అలాకాకుండా ఫస్ట్ ఎయిడ్‌బాక్సుల్లో అత్యవసరమైన మందులను ఏర్పాటుచేస్తే అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ అధికారులు ఈ దిశగా చర్చలు తీసుకొని ప్రయాణికులకు భరోసానివ్వాలి.

- సరికొండ శ్రీనివాసరాజు వనస్థలిపురం

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

జట్ మంగ్నీ పట్‌షాది

ఎండాకాలం మండిపోతున్నది. వరంగల్లు కోట పక్కనే మా చిన్న ఊరులో మరింత ఎండ, అగ్నిపర్వతం నుంచి లావా ఎగసి ఎగసి వస్తున్నట్లు వడగాడ్పులు. వరిగడ్డి వాములు కొద్దిపాటి నీడనిస్తున్నాయి. నలుగురిలో ఒకతను అడిగాడు 'ఏడి వెంకటి ఇంకా రాలేదు' అని. మరొకతను అన్నాడు 'యాకమ్మ ఒదినె అవ్వ, అయ్య వచ్చిండ్లట. ఇయ్యాల ఇప్పుడు పంచాయితి ఉన్నదట...' వెంకటి భార్య యాకమ్మ. ఇద్దరి పెండ్లయి రెండేండ్లు కూడా కాలేదు. 'బాగానే ఉండెటోళ్లు, ఏమైందో' అని ఆ నలుగురిలో ఇంకొకతను అన్నాడు.

మా ఇంటికి వెనుక ఓ మూలన పెద్ద చింతచెట్టు కింద కొన్ని గుడిసెలు. పట్టపగలే చింతచెట్టు కింద ఐదారు గురు కుల పెద్దలు కూర్చున్నరు. వెంకటి, యాకమ్మ, వాళ్ల తల్లిదండ్రులు, పెద్దలు ఒకరి తర్వాత ఒకరు మాట్లాడుతున్నరు. ఎవరు మాట వాళ్లు చెబుతున్నరు. పొద్దుగూకే సమయానికి పంచాయితీ పూర్తయింది. వెంకటిని వదిలేసి (విడాకులిచ్చి) యాకమ్మ అమ్మగారింటికి పోయి మార్వానం వెళ్లడానికి కులపెద్దలు అంగీకరించి తీర్పిచ్చారు. రాతలేదు, పూతలేదు, పెద్దల నోటిమాటతో అంతా ముగిసింది. యాకమ్మ మార్వానం పూర్తయి ఉంటుంది. కొద్ది రోజుల్లోనే వెంకటి రెండో పెళ్లి కూడా అయింది. ఇదీ అప్పటి తలాక్‌ల ముచ్చట. వెంకటి కనీసం ఒకసారైనా 'తలాక్' అనకుండానే భార్య యాకమ్మకు విడాకులివ్వగలిగాడు. యాకమ్మ బతుకు ఏమవుతుందో, భవిష్యత్తు ఏమిటో వెంకటి ఆలోచించలేదు. ఆలోచించాలని ఎవరు అడుగలేదు, ఆలోచించవలసిన అవసరం కలుగలేదు. ఎందుకంటే కుల పెద్దలదే సుప్రీం తీర్పు. అనాది నుంచే, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు పుట్టకముందు నుంచే ఉందనుకుంటున్న హిందూ సమాజంలో, సామాజిక జీవనంలో ఎన్నో ఆచారాలు, అనేక సంప్రదాయాలు, విశ్వాసాలు, కట్టుబాట్లు. సాదాసీదాగా, ఎటువంటి భేషజాలు, ఆంక్షలు, ఆక్షేపణలు లేకుండా ముక్కుసూటిగా గడిచే, నడిచే సామాన్యుల జీవితాల్లో సాంసారిక సమస్యలు సులువుగా, క్షణాల్లో చెట్టుకింది తీర్పులతో పరిష్కారమవుతుంటాయి, లేక ముగుస్తుంటాయి. యాకమ్మ వంటి అసంఖ్యాకులు హిందూ సమాజంలోని ఈ దుష్టాచారాలకు బలవుతుంటారు. నాగరికులుగా, విద్యావంతులుగా, సంస్కృతీపరులుగా హిందూ సమాజంలో చలామణి అవుతున్న మధ్య తరగతి కుటుంబీకుల సాంసారిక పరిస్థితి భిన్నంగా ఉంది. చెట్టుకింద పెద్దలు, కల్లుకుండలు, కోడి లేక యాట కూరలు లేక చేప పులుసులతో మధ్యతరగతి కుటుంబీకుల, శ్రీమంతుల సమస్యలు పరిష్కారం కావు, ముసుగులో కుమ్ములాటలు, మానసిక మథనాలు, వ్యథలు, కుట్రలూ కుహకాలు, హత్యలూ ఆత్మహత్యలు, అపార్థాలు, విపరీతార్థాలు, విపత్కర పరిణామాలు ఈ కుటుంబాల ప్రత్యేకతలు. మరో నిదర్శనం.. ఇద్దరు ఓ కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఇరువైపులా తల్లిదండ్రులు ఇష్టపడకపోయినా ఓ రోజు పెళ్లి చేసుకున్నారు. జట్ మంగ్నీ పట్‌షాది. ఏడాదైనా గడువకముందే ఇద్దరు ఇష్టప్రకారం విడాకుల కోసం కోర్టు మెట్లెక్కారు. ఇద్దరి వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తి 'మరోసారి ఆలోచించి రండి' అని కొంత సమయం ఇచ్చాడు. కొన్నాళ్ల తర్వాత ఇద్దరూ చెమ్మాచెక్కా అనుకుంటూ వెళ్లి 'విడిపోవడం మా తుది నిర్ణయం' అని న్యాయమూర్తికి చెప్పారు. 'మీ కర్మ' అని తన మనసులో అనుకొని న్యాయమూర్తి యాంత్రికంగా వాళ్లిద్దరి విడాకులకు అంగీకరించాడు. సంతోషంతో బయటికివచ్చి, ఒక పెద్ద హోటల్‌లో ఇద్దరూ తీరికగా (హెస్టీబైట్ కాకుండా) లంచ్ బ్రంచింగ్ చేసి ఆబిడ్స్‌లో హాయిగా విడిపోయారు. తర్వాత కొంతకాలానికి ఇద్దరు అమెరికాలో కలిసి తిరిగి ఒక్కటయ్యారు. లీగల్‌గా మళ్లీ పెళ్లి చేసుకున్నారు. మన లోకల్ మీడియా పడికట్టు పరిమిత పదజాలంలో చెప్పాలంటే వాళ్ల 'సంబరాలు అంబరాన్నంటాయి'.

ఈ మళ్లీ పెళ్లి వార్త తెలియగానే (వాట్సప్ ఫోన్‌లో, వీడియోలో) ఇద్దరి తల్లిదండ్రులు భద్రకాళి అమ్మవారి సన్నిధికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదంతా అక్షరాలా నిజం. ఒట్టు. సినిమా కథ కాదు. ముస్లిం సోదరసోదరీమణుల, మిత్రుల తలాక్ సంప్రదాయం మీద తుది తీర్పు ఇస్తున్నప్పుడు సుప్రీంకోర్టు, ఆ తీర్పుకు అనుగుణంగా హడావుడిగా, పార్లమెంట్‌లో ఒక చట్టాన్ని ఆమోదింపజేయడానికి ప్రధాని మోదీజీ నడుం బిగించినప్పుడు పలు ముఖ్యాంశాలను, సాంసారిక జీవన సత్యాలను విస్మరించడం జరిగింది. సాంసారిక జీవన సరిగమలు, శ్రుతులు, అపశ్రుతులు సన్యాసులకు, సాంసారిక పవిత్ర బాధ్యతను త్యజించిన వారికి అర్థం కావడం కష్టం. కేవలం ముస్లిం సమాజంలోనే తక్షణ సంస్కరణలు అవసరమవుతున్నాయా అన్నది అన్నిటికంటే ముఖ్య ప్రశ్న. హిందూ మతంతో పోల్చినప్పుడు ఇస్లాం, ముస్లిం మతం నిన్నమొన్నటిది. ముస్లిం మత సంప్రదాయాలు చాలావరకు శాస్త్రీయమైనవని అభిప్రాయపడుతున్న మేధావులు కొందరున్నారు. వయసు మళ్లిన, వృద్ధాప్యం ముదిరిన సనాతన హిందూ సమాజం దుష్టాచారాలు, సంప్రదాయాలు, మూఢవిశ్వాసాలు, కుల, మత, వర్గ ద్వేషాలతో కుళ్లి దుర్గంధాలను ప్రసరింపజేస్తున్నదని, హిందూమతంలో, సమాజంలో తీవ్ర సంస్కరణలు తక్షణ కర్తవ్యమని రెండు వేల ఏండ్ల కిందటి నుంచే భావించి, ఆ దిశలో అవసరమైన సంస్కరణల కోసం కంకణధారణ చేసిన మహనీయులు, మహా పురుషులు గౌతమబుద్ధుడు, మహావీరుడు, ఆది శంకరుడు, భగవద్రామనుజుడు, గురునానక్, జ్యోతిరావుపూలే, నారాయణగురు, రాజారామ్ మోహన్‌రాయ్, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు మహర్షి దేవేంద్రనాథ్ ఠాగోర్ (బ్రహ్మసమాజ స్థాపకుల్లో ఒకరు), దయానంద సరస్వతి, శ్రద్ధానంద్‌జీ, పాల్కుర్కి సోమన, కందుకూరి వీరేశలింగం తదితరులు. వారు హిందూమతం, సమాజం క్షాళన కోసం తమ జీవితాలను అంకితం చేసిన త్యాగధనులు. ఈ స్వతంత్ర భారతదేశంలోని అత్యధిక సంఖ్యాకులు, నూరు కోట్ల కంటే ఎక్కువ మంది హిందువులు. వందల ఏండ్ల కిందటి దుష్టాచారాలు, కుల, మత, వర్గ విభేదాలు ఇప్పటికీ ఘోరంగా హిందూ సమాజంలో కొనసాగుతున్నాయి. లింగాయత్‌లు తమది హిందూమతం కాదంటున్నారు. నాడు బౌద్ధులు, జైనులు, సిక్కులు అన్నట్లు. హిందూ సమాజంలో ఇప్పటికీ సతీసహగమనాలు, బాల్యవివాహాలు, వితంతు వివాహాల పట్ల వ్యతిరేకత, వరకట్నాల కోసం వేధింపు (వరకట్న నిషేధచట్టం ఉన్నప్పటికీ), స్త్రీ జనాల పట్ల విముఖత విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. హిందూ సమాజంలో స్త్రీలు ఇప్పటికీ సమానహక్కులు, సముచిత గౌరవం పొందడం లేదంటే అతిశయోక్తి కాదు. స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనుభవించే హక్కు లేదన్నారు. స్త్రీ బుద్ధులు ప్రళయాలకు దారితీస్తాయని నిందించారు. కొన్ని దేవాలయాల్లోకి స్త్రీలు ప్రవేశించరాదని ఆంక్షలు విధించారు. హిందూ పురుష పుంగవులతో పోల్చినప్పుడు హిందూ సమాజంలో స్త్రీలు అనుభవించే కష్టాలు, ఇబ్బందులు, సమస్యలు చాలా ఎక్కువ. జనాభా పెరుగుదల నిరోధానికి ప్రభుత్వాలు అమలు జరుపుతున్న సంతాన నిరోధక చర్యల భారమంతా నిజానికి స్త్రీల మీదనే పడుతున్నది. సంతాన నిరోధక శస్త్ర చికిత్సల్లో అత్యధిక సంఖ్యలో శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నది స్త్రీలే. పురుషులు సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేయించుకోవడానికి వెనుకాడుతున్నారు. కొందరు ప్రముఖ సన్యాసులు హిందువుల జనాభాను పెంచడానికి హిందూ స్త్రీలు పదిమందిని కనాలనని ఆదేశిస్తున్నారు. వారి ఆదేశాన్ని పాటిస్తే నేటి హిందూ స్త్రీలు చిక్కి శిథిలమవుతారు. ప్రజా ప్రాతినిధ్య సంస్థల్లో స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం కాకపోయినా కనీసం సమ నిష్పత్తి ప్రాతినిధ్యం కల్పించడానికి పార్లమెంట్‌లో దాదాపు 20 ఏండ్ల కిందట ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ప్రభుత్వాలు ఎన్నిమారినా ఇంతవరకు ఆమోదముద్ర పొందకపోవడం శోచనీయం. మూడున్నరేండ్ల కిందట మోదీజీ ప్రభుత్వం ఏర్పడటంతో ఈ దేశంలో హిందూరాజ్యం వచ్చిందని ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ పదేపదే అంటారు. అయినా, హిందూ స్వాములు, బాబాలు, గురువుల ఫైవ్‌స్టార్ ఆశ్రమాల్లో హిందూ స్త్రీలు మాటల్లో చెప్పనలవిగాని అమానుష కృత్యాలకు, అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారు. తలాక్ అన్నమాట ఒకటి అనకుండానే హిందూ పురుషధీరులు తమ భార్యలను వదిలేసి, రోడ్లమీద పడేసి అనాథలను చేస్తున్న విషాద సంఘటనలు అసంఖ్యాకం.

ఈ దేశంలో, ఈ సనాతన పుణ్యభూమిలో, కోట్లాది హిందూ స్త్రీలు ప్రతిక్షణం ఎదుర్కొంటున్న బాధల గాథలను విస్మరించి ప్రధాని మోదీజీ కేవలం కొన్ని లక్షల మంది స్త్రీలకు సంబంధించిన తలాక్ సమస్య పట్ల ఇంతగా శ్రద్ధ వహించడం, ఇంతగా సానుభూతి చూపడం విచిత్రం. తాత్కాలిక కోపావేశాలు, స్వల్పమైన తగాదాలు కుటుంబాల్లో, సంసారాల్లో సహజం. ముస్లిం కుటుంబాల్లో, హిందూ కుటుంబాల్లో చాలావరకు ఆర్థిక సమస్యలు, దారిద్ర్యం వల్ల దంపతుల మధ్య ఉద్రిక్తత ఉత్పన్నమవుతున్నది. ఇది మూల సమస్య. మూల సమస్యను గుర్తించకుండా మోదీజీ మూడుసార్లు తలాక్ అన్న వాళ్లందరినీ క్రిమినల్ కేసుల్లో ఇరికించి మూడేండ్లు జైళ్లలో నిర్బంధించినట్లయితే ముస్లిం కుటుంబాల్లో, ముస్లిం సమాజంలో అశాంతి రగుల్కొంటుంది. విడాకుల తర్వాతైనా దంపతులు తిరిగి సామరస్యంతో జీవించగలిగే అవకాశాలు మృగ్యమవుతాయి. స్వతంత్ర భారత రాజ్యాంగంలో ప్రసాదించిన సమాన హక్కులకు ఎడతెగకుండా విఘాతం కల్గిస్తున్న వారే, రాజ్యాంగంలోని పవిత్ర ఆశయాలకు, లక్ష్యాలకు, ఆదేశ సూత్రాలకు తనివితీర తలాక్ ఇస్తున్నవాళ్లే తలాక్‌ను నిషేధించడంతో సమానత్వం సాధ్యమవుతుందన్న భ్రమ కలిగించడం విచిత్రం. అన్నింటికంటే ముఖ్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొని అన్నివర్గాల అభ్యున్నతి పథకాలతో, చర్యలతో పేదరికానికి, దారిద్ర్యానికి, అజ్ఞానానికి, అసమానతలకు శాశ్వతంగా తలాక్ ఇవ్వడం. తలాక్ అనగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జ్ఞాపకం రావడం సహజం. ఆయన తలాక్‌లు ఇవ్వడంలో సాటిలేనివాడు. ఏడాది కిందట ఎన్నికల సమయంలో ఆయన నిజాయితీకి తలాక్ ఇచ్చి అబద్ధాల ప్రచారంలో, అసభ్య ప్రవర్తనలో ఆరితేరాడు. ఏడాది కిందట అధ్యక్షుడిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసినప్పుడే ఆయన విజ్ఞతకు, విచక్షణకు తలాక్ ఇవ్వడం విశేషం. పాకిస్థాన్ 33 బిలియన్ డాలర్ల తమ డబ్బు తిని తమకు అబద్ధాలు చెప్పిందని నిన్నమొన్న ఆయన ప్రకటించాడు. కానీ నెలరోజులు కూడా కాలేదు, ఆయన రక్షణమంత్రి, విదేశాంగమంత్రి కరాచీ (ఇస్లామాబాద్) వచ్చి టెర్రరిస్టులను వ్యతిరేకించే పోరాటంలో పాకిస్థాన్ ప్రశంసనీయ, అద్భుతపాత్ర వహిస్తున్నదని సర్టిఫికెట్లు ఇచ్చి వెళ్లారు.

స్వతంత్ర భారత రాజ్యాంగంలో ప్రసాదించిన సమాన హక్కులకు ఎడతెగకుండా విఘాతం కల్గిస్తున్న వారే, భారత రాజ్యాంగంలోని పవిత్ర ఆశయాలకు, లక్ష్యాలకు, ఆదేశ సూత్రాలకు తనివితీర తలాక్ ఇస్తున్నవాళ్లే తలాక్‌ను నిషేధించడంతో సమానత్వం సాధ్యమవుతుందన్న భ్రమ కలిగించడం విచిత్రం.

మార్కెట్లో మన వస్తువులకు మోజు

వాణిజ్యం



ఎన్.రాజేంద్రప్రసాద్

బ్రాండెడ్ వస్తువుల వినియోగం అనగానే గత కొన్నేండ్లుగా ప్రపంచానికి గుర్తొచ్చే పేర్లు అమెరికా, ఫ్రాన్స్, జపాన్, చైనా, ఇతర ప్రాశ్చాత్య దేశాలు. కానీ ఇప్పుడు వాటితోపాటు మన భారతదేశం పేరు కూడా మార్మోగుతున్నది. గత కొన్నేండ్ల కాలంలో వేగంగా 'కదిలే వినియోగదారుల వస్తువుల అమ్మకం'(FMCG)లో నమోదవుతున్న గణాంకాలే దీనికే నిదర్శనం. గత కొన్ని నెలలుగా భారత్, బ్రాండెడ్ వస్తువుల వాడకంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతూ వస్తున్నది. మోదీ ప్రధాని పీఠం అధిష్ఠించిన తర్వాత నుంచి 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ భారత్' లాంటి పథకాలతో బ్రాండెడ్ వస్తువుల తయారీలోనూ పోటీపడుతున్నది. నిజానికి 1992కు ముందు మన దేశంలో వేగంగా కదిలే వినియోగదారుల వస్తువుల వాడకంలో బ్రాండెడ్ వస్తువుల వినియోగం కేవలం 6 శాతం ఉంటే అదిప్పుడు 82 శాతానికి చేరింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో రెండో స్థానంలో ఉన్న మనదేశంలో పట్టణ వినియోగదారులకన్నా గ్రామీణ వినియోగదారుల సంఖ్య దాదాపు 60 శాతం ఉన్నది. కొంతకాలం కిందటి వరకు బ్రాండెడ్ వస్తువుల పట్ల పట్టణ వినియోగదారులకే ఎక్కువ ఆసక్తి ఉండేది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రామీణ వినియోగదారులు కూడా బ్రాండెడ్ వస్తువుల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. దానికి ఉదాహరణగా 'లైఫ్‌బాయ్', అంబాసిడర్‌కార్, నిర్మా, మొదలైన వస్తువుల మార్కెట్ పరిస్థితులను చెపుకోవచ్చు. ఇవన్నీ దాదాపు 90వ దశాబ్దంలో ఒక వెలుగు వెలిగిన వస్తువులే. చివరికి కొన్ని కంపెనీలు మూతపడగా మరికొన్ని వాటి టార్గెట్ మార్కెట్‌ను మార్చుకొని మనుగడను సాగిస్తున్నాయి. ఇలా అన్నిరకాల పరిశ్రమల్లోను బ్రాండెడ్ వస్తువుల వినియోగం పెరుగుదలను చూస్తే భారతీయ వినియోగదారుల మార్కెట్ మీద ఇతర దేశాల కంపెనీలు ఎంతగా ఆధారపడ్డాయో అర్థమవుతున్నది.

నిజానికి బ్రాండెడ్ వస్తువుల వాడకం పట్టణాలకే పరిమితమైనప్పటికీ కంపెనీలు వారివారి మార్కెట్ వ్యూహాలను మార్చుకొని వస్తువుల పరిమాణంతోపాటు ధరలనూ తగ్గించి గ్రామీణ వినియోగదారులకు చేరువయ్యాయి. దానికి ఉదాహరణగా FMCG వస్తువుల్లో లక్స్, సంతూర్ వంటి బ్రాండెడ్ వస్తువులు కేవలం రూ. 5కే మార్కెట్లో లభిస్తూ గ్రామీణ వినియోగదారులకు చేరువగా, మైసూర్ శాండల్, డవ్ లాంటి వస్తువులు పట్టణ వినియోగదారులకే పరిమితమయ్యాయి. ఒకవిధంగా బ్రాండెడ్ వస్తువుల వాడకం గత కొన్నేండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుదలకు పరోక్షంగా భారత ప్రభుత్వ సంస్కరణలు కూడా దోహదపడుతున్నాయి. కేంద్రం ఆన్‌లైన్ కంపెనీలకు అనుమతులిచ్చి, ఆన్‌లైన్ వ్యవహారాలను ప్రోత్సహిస్తుండటం, గ్రామాల్లో ఇంటర్నెట్ సదుపాయాలు కలిగించడం తద్వారా గ్రామీణ యువత స్మార్ట్‌ఫోన్ వాడుతూ ఆన్‌లైన్‌లో లభించే బ్రాండెడ్ వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. బ్రాండెడ్ వస్తువులపై సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా ఉన్నది. నిజానికి బ్రాండెడ్ వస్తువుల వాడకం మనదేశంలో ఎక్కువగా FMCG వస్తువుల్లో నమోదవుతుండగా ఆ తర్వాతి స్థానంలో ఎలక్ట్రానిక్ టెక్స్‌టైల్స్, వాహన రంగాల్లో నమోదవుతున్నది. మన దేశంలో 2016 లెక్కల ప్రకారం ఒక్క FMCGలోనే బ్రాండెడ్ ప్రొడక్ట్స్ వాడకం విలువ సుమారు 49 బిలియన్ అమెరికా డాలర్లు కాగా ఆ విలువ 2020 నాటికి 103 బిలియన్ అమెరికా డాలర్లుగా నమోదయ్యే అవకాశముందని గణాంకాల అంచనా.

కొంతకాలం వరకు వినియోగదారులు స్వదేశీ వసువులను కొనడానికి ఆసక్తి చూపేవారు కాదు. దానికెన్నో కారణాలున్నపటికీ ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. వస్తువు స్వదేశీ అయినా ఫరవా లేదు కానీ అది తప్పకుండా బ్రాండెడ్ అయి ఉండాలి అన్నంతగా వినియోగదారులలో మార్పు వచ్చింది.

ఇక భారతీయ మార్కెట్లో ఇతర దేశాల కంపెనీల పెట్టుబడికి సంబంధిచిన పాలసీలు కూడా ఒక విధంగా బ్రాండెడ్ వస్తువుల వాడకం మీద ప్రభావం చూపిస్తున్నాయి. మన దేశంలో సింగిల్ బ్రాండ్ రిటైల్ మార్కెట్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అనుమతి ఉండగా అది కాస్తా మల్టీ బ్రాండ్ రిటైల్ రంగంలో 51 శాతం ఉన్నది. FMCG వస్తువుల్లో అత్యధిక శాతం హౌజ్‌హోల్, పర్సనల్ కేర్ వంటి వస్తువుల కొనుగోలులో బ్రాండెడ్ వస్తువులు వినిమయం ఎక్కువగా ఉన్నది. ఇండియన్ బ్రాండ్ ఈక్విటీ అసోసియేషన్-2016 ప్రకారం.. సుమారు 50 శాతం వరకు బ్రాండెడ్ వస్తువులు హౌజ్‌హోల్, పర్సనల్ కేర్ వస్తువుల్లో నమోదు కాగా హెయిర్‌కేర్ రంగంలో 23 శాతం, ఫుడ్ అండ్ బేవరేజ్ వస్తువుల్లో అది 19 శాతంగా నమోదైంది. గమనించదగ్గ విషయమేమంటే, ఈ మధ్యకాలంలో వినియోగదారుల ఆసక్తి ఆయుర్వేద వస్తువుల మీద పెరుగడంతో దేశీయ బ్రాండ్లు గతంతో పోలిస్తే ఎప్పుడూ లేనంతగా విదేశీ బ్రాండ్లకు గట్టి పోటీనిస్తున్నాయి. ఈ విషయంలో పతంజలి బ్రాండ్ భారతీయ మార్కెట్లో పాతుకుపోయిన విదేశీ బ్రాండ్లకు చెమటలు పట్టిస్తున్నది. దానికితోడు డాబర్, ఆయూష్ వంటి దేశీయ బ్రాండ్లు కూడా మార్కెట్లో తమ వాటాను పెంచుకుంటున్నాయి.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్స్, మొదలగు ఈ-కామర్స్ రంగానికి చెందిన విదేశీ కంపెనీలు భారతీయ మార్కెట్లో ప్రవేశించడం కూడా గడచిన నాలుగేండ్లలో బ్రాండెడ్ వస్తువుల వినియోగానికి దారితీసింది. అమెజాన్ ఇండియా 2014-15లో సుమారు 1,002 కోట్ల ఆదాయం ఆర్జించగా అది కాస్తా 2015-16లో 2,275 కోట్లకు చేరుకుంది.

మన దేశంలో స్వదేశీ బ్రాండెడ్ కన్నా విదేశీ బ్రాండెడ్ వస్తువుల వినియోగం అధికం. కొంతకాలం వరకు వినియోగదారులు స్వదేశీ వస్తువులను కొనడానికి ఆసక్తి చూపేవారు కాదు. దానికెన్నో కారణాలున్నపటికీ ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. వస్తువు స్వదేశీ అయినా ఫరవాలేదు కానీ అది తప్పకుండా బ్రాండెడ్ అయి ఉండాలి అన్నంతగా వినియోగదారులలో మార్పు వచ్చింది. ఏదేమైనా, బ్రాండెడ్ వస్తువుల వినియోగం దేశ జీడీపీని ప్రభావితం చేస్తున్నది. ఎందుకంటే, వినియోగదారుడు ఒక విదేశీ బ్రాండెడ్ వస్తువును కొంటే అది ఆయా దేశాల జీడీపీకి చేరుతుంది. అలా కాకుండా స్వదేశీ వస్తువులు కొంటే అది మన దేశ జీడీపీ పెరుగుదలకు దోహదం చేస్తుంది. అందుకే దేశీయ సంస్థలు కూడా విదేశీ బ్రాండెడ్ వస్తువులకు దీటుగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మనదేశ వినియోగదారులకు చేరువయ్యేలా జాగత్తలు తీసుకోవాలి. తద్వారా మన దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమమవుతుంది.

(వ్యాసకర్త: భారత వాణిజ్యం మండలి సభ్యుడు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నా 'కలాన్ని' అదృశ్య శక్తులు ఆపాయి

కన్నడ పత్రికలో తన వ్యాసాలను నిలిపివేయటంపై ప్రకాశ్‌రాజ్



బెంగళూరు, జనవరి 5: ప్రముఖ నటుడు, జాతీయ అవార్డు గ్రహీత ప్రకాశ్‌రాజ్ కన్నడ దినపత్రిక 'ఉదయవాణి'లో తాను రాసే వ్యాసాలను ఒక్కసారిగా ఆపివేశారని ఆరోపించారు. దీనివెనుక అదృశ్య శక్తులు ఉన్నాయని ఆయన మండిపడ్డారు. దీనిపై గురువారం ఆయన ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఉదయవాణి పత్రికలో ప్రకాశ్‌రాజ్ రాసే వ్యాసాలకు కోస్తా కర్ణాటక అంతా మంచి ఆదరణ ఉన్నది. ఆయన చివరి వ్యాసాన్ని గతేడాది డిసెంబర్ 24న పత్రిక ప్రచురించింది. వివిధ సమస్యలపై కేంద్రప్రభుత్వం లక్ష్యంగా ప్రకాశ్‌రాజ్ తన వ్యాసాల్లో విమర్శించేవారు. బెంగళూరులో గౌరీ లంకేశ్ హత్య జరిగిన తర్వాత ప్రకాశ్‌రాజ్ కేంద్రప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాసాలను ఉదయవాణి పత్రిక ఒక్కసారిగా నిలిపివేసింది. దీనిపై ఆ పత్రిక ఎడిటర్ శివసుబ్రమణ్యా స్పందిస్తూ..''సాధారణ ప్రక్రియలో భాగంగానే ప్రకాశ్‌రాజ్ వ్యాసాలను నిలిపివేశాం. మా వద్ద వందల మంది రచయితల వ్యాసాలు ఉంటాయి. ఎప్పుడూ ఒకరి వ్యాసాలే వేయలేం' అని ఆయన తెలిపారు.

అమ్మను చంపిన అధ్యాపకుడు

భవనం పైనుంచి తోసేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన క్రూరత్వం

రాజ్‌కోట్, జనవరి 5: నవమాసాలు మోసి.. కనిపెంచిన అమ్మనే చంపేశాడో నరరూప రాక్షసుడు. నలుగురికి మంచిని బోధించాల్సిన అధ్యాపక వృత్తిలో ఉన్న ఆ మానవ మృగం.. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిపై కక్షపెంచుకొని ప్రాణాలు తీశాడు. కనిపెంచిందన్న మమకారాన్ని కూడా మరిచి.. కసాయిగా మారి భవనం డాబాపై నుంచి తోసేసి మట్టుబెట్టాడు. దీన్ని ఆత్మహత్యగా చిత్రీకరించి, అందరినీ నమ్మించాడు. అయితే, ఒక అజ్ఞాత వ్యక్తి లేఖతో ఘటన జరిగిన మూడునెలలకు ఈ విషయం బయటపడింది. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటన గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో వెలుగుచూసింది. రాజ్‌కోట్‌లోని గాంధీగ్రామ్ ప్రాంతం దర్శన్ వీధికి చెందిన సందీప్ నత్వానీ స్థానికంగా ఓ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి జయశ్రీబెన్ (64)తో కలిసి సొంతింట్లో ఉంటున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 27న ఇంటి డాబాపై నుంచి తల్లిని తోసేశాడు. కింద పడి ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని సందీప్ అందరినీ నమ్మించాడు. పోలీసులు సైతం బలవన్మరణంగా భావిస్తూ కేసు నమోదుచేశారు. దాదాపు మూడు నెలల తర్వాత పోలీసులకు ఓ అజ్ఞాత వ్యక్తి రాసిన లేఖతో కేసు మళ్లీ మొదటికొచ్చింది. జయశ్రీబెన్ ఆత్మహత్యకు పాల్పడలేదని, అది హత్యగా అనుమానం ఉన్నదని అందులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు మళ్లీ విచారణ చేపట్టారు. 'మా అమ్మ సూర్య నమస్కారం చేయడానికి వెళ్లేందుకు నేను సాయం చేశాను' అని సందీప్ పోలీసులకు చెప్పాడు. ఇంట్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు.. జయశ్రీబెన్ అనారోగ్యంతో బాధపడుతున్నదని, ఇటీవలే శస్త్రచికిత్స జరిగినందున కనీసం నడిచేందుకు కూడా ఇబ్బంది పడ్డట్టు గుర్తించారు. తల్లిని సందీప్ మెట్లపై నుంచి తీసుకెళ్తున్న దృశ్యాలను పరిశీలించారు. డాబాపై ఉన్న ప్రహరీగోడ ఎత్తు 2.5 అడుగులు ఉంటుందని, అంత ఎత్తు ఆమె ఎక్కి ఆత్మహత్యకు పాల్పడడం అసాధ్యమని తేల్చారు. ఆ తర్వాత తమదైన శైలిలో సందీప్‌ను విచారించగా.. అతడే హత్య చేసినట్టు తేలింది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లితో విసుగుచెందానని, అందుకే ఆమెను చంపాలని నిర్ణయించుకొని ఆ పని చేశానని నిందితుడు చెప్పాడు.



తల్లిని ఇంట్లోంచి మెట్ల మీదుగా భవనం పైకి తీసుకెళ్తున్న సందీప్ నత్వానీ; (ఇన్‌సెట్‌లో) నిందితుడు

చట్టాలెన్ని ఉన్నా దుర్వినియోగమే!

'ఆధార్'పై ఎడ్వర్డ్ స్నోడెన్ వ్యాఖ్య



వాషింగ్టన్/ న్యూఢిల్లీ: చట్టాలు ఎన్ని ఉన్నా.. ఎలా ఉన్నా.. ఫలితం మాత్రం వాటి దుర్వినియోగమేనని చరిత్ర వెల్లడిస్తున్నదని అమెరికా జాతీయ భద్రత సంస్థ మాజీ కాంట్రాక్టర్, అమెరికా రహస్య సమాచారాన్ని గతంలో లీక్ చేసిన ఎడ్వర్డ్ స్నోడెన్ పేర్కొన్నారు. చండీగఢ్ కేంద్రంగా వెలువడే 'ది ట్రిబ్యూన్' పత్రిక ఆధార్ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ కథనాన్ని రాసింది. కాగా ఈ కథనాన్ని జాక్ విట్టేకర్ అనే అమెరికన్ జర్నలిస్ట్ గురువారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. 'రూ.500 చెల్లిస్తే పదినిమిషాల్లో వంద కోట్ల మంది ఆధార్‌కార్డుల వివరాలు లభిస్తాయి' అని సదరు కథనంలో పేర్కొన్న నేపథ్యంలో స్నోడెన్ స్పందించారు. 'ఇది ప్రభుత్వాల సహజమైన ధోరణి. ప్రైవేటు జీవితాలకు సంబంధించిన సమాచారాన్ని కూపీలాగాలని అవి కోరుకుంటాయి. చరిత్ర చెప్తున్న విషయం ఏమిటంటే చట్టాలు ఎన్ని ఉన్నా.. అంతిమ ఫలితం మాత్రం వాటి దుర్వినియోగమే' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



ఇస్లామాబాద్‌లో అమెరికాకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పాక్ విద్యార్థులు

పాకిస్థాన్‌కు మరో షాక్!

మొత్తం రూ.12,659 కోట్ల సాయాన్ని నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటన

ఉగ్రవాదులను అణిచివేయనందు వల్లే ఈ నిర్ణయం

వాషింగ్టన్/ ఇస్లామాబాద్, జనవరి 5: ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన పాకిస్థాన్‌కు అమెరికా షాకిచ్చింది. పాకిస్థాన్‌కు 2017 సంవత్సరానికిగాను 200 కోట్ల డాలర్ల (రూ.12,659 కోట్లు) ఆర్థిక సాయం, మిలిటరీ ఆయుధాల సరఫరా నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. సంకీర్ణ మద్దతు నిధుల (సీఎస్‌ఎఫ్) కింద పాకిస్థాన్‌కు 2017 సంవత్సరానికి అందజేస్తున్న 90 కోట్ల డాలర్ల (రూ.5705 కోట్లు) సాయాన్ని, అంతకుముందు ఖర్చు చేయని నిధులను నిలిపివేస్తున్నట్లు అమెరికా రక్షణశాఖ తెలిపింది. విదేశీ మిలిటరీ ఫండింగ్ (ఎఫ్‌ఎంఎఫ్) కింద 2016కు ఇచ్చే 25.50 కోట్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేశామని పేర్కొన్నది. ఉగ్రవాదం అంతానికి తాము 15 ఏండ్లుగా 3300 కోట్ల డాలర్ల సాయం అందజేస్తే.. పాకిస్థాన్ చేసిందేమీ లేదని, పైగా అసత్యాలు చెప్తూ తమను వంచించిందని నూతన సంవత్సర దినోత్సవం నాడు ట్వీట్ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పాకిస్థాన్‌కు అందజేస్తున్న అన్నిరకాల భద్రతా సాయాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ తదితర ఉగ్రవాద గ్రూపుల అంతంతోపాటు వాటి స్థావరాల ధ్వంసం విషయమై పాకిస్థాన్ నిర్ణయాత్మక చర్యలు తీసుకునే వరకు జాతీయ భద్రతా సాయం నిలిపివేస్తున్నట్లు అమెరికా రక్షణశాఖ అధికార ప్రతినిధి హీథర్ నౌర్ట్ చెప్పారు. ఉగ్రవాద గ్రూపులు దక్షిణాసియాలో అస్థిరతను సృష్టించడంతోపాటు తమ భద్రతా సిబ్బందిని, పౌరులను లక్ష్యంగా చేసుకున్నందునే పాక్‌కు భద్రతాసాయం నిలిపేసినట్లు చెప్పారు. ముంబై ఉగ్రదాడి సూత్రధారి, జమాత్ ఉద్ దవా అధిపతి హఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవడంలోనూ పాక్ విఫలమైందని తెలిపారు. అతడిని గృహ నిర్బంధం నుంచి విముక్తి చేయొద్దని సూచించినా పాకిస్థాన్ చర్యలు తీసుకోలేదన్నారు. ఉగ్రవాద సంస్థల అంతంపై నిర్ణయాత్మక చర్యలు తీసుకునేందుకు పాకిస్థాన్‌కు ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు ఉన్నదని నౌర్ట్ తెలిపారు.

ముగిసిన పార్లమెంట్

గట్టెక్కని ట్రిపుల్ తలాక్ బిల్లు.. మొత్తం 22 బిల్లులకు ఆమోదం

శీతాకాల సమావేశాలు ఫలవంతమయ్యాయన్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 5:

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. గుజరాత్ ఎన్నికల సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తొలుత కొంత దుమారం రేపినప్పటికీ ఈ సమావేశాలు ఫలవంతంగానే సాగాయని ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించిన 'తక్షణ ట్రిపుల్ తలాక్'పై నిషేధం బిల్లు మాత్రం రాజ్యసభలో గట్టెక్కలేకపోయింది. లోక్‌సభలో 13, రాజ్యసభలో తొమ్మిది బిల్లులు ఆమోదం పొందాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ సమావేశాల్లో మొత్తం 17 బిల్లులను ప్రవేశపెట్టగా ఉభయ సభలు 12 బిల్లులను ఆమోదించాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నిషేధించే బిల్లు ఆమోదం పొందకపోవడానికి కారణం కాంగ్రెస్‌పార్టీయేనని ఆయన ఆరోపించారు. డిసెంబర్ 15 నుంచి జనవరి ఐదో తేదీ వరకు జరిగిన శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు 13 సార్లు సమావేశమయ్యాయి. కాగా ఉభయ సభలను శుక్రవారం నిరవధికంగా వాయిదా వేశారు. రాజ్యసభలో ప్రధాని నరేంద్రమోదీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ వద్దకు వెళ్లి కరచాలనం చేశారు. సభ వాయిదాపడి, వందేమాతరం గీతం ఆలపిస్తుండగానే మోదీ ప్రతిపక్ష సభ్యులు కూర్చున్నవైపు వెళ్లారు. ఈ నెల 27తో పదవీకాలం ముగియనున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరణ్‌సింగ్‌ను కూడా మోదీ కలుసుకున్నారు. గుజరాత్ ఎన్నికల ప్రచార సమయంలో మాజీ ప్రధాని మన్మోహన్ పాకిస్థాన్‌తో కుమ్మక్కయ్యారంటూ ప్రధాని మోదీ చేసిన ఆరోపణలపై రాజ్యసభలో గందరగోళం ఏర్పడిన సంగతి తెలిసిందే. ప్రధాని క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షాలు పట్టుబట్టినా, అధికారపక్షం లొంగలేదు.

అంతరాయాలతో 34 గంటలు నష్టం: వెంకయ్య

సభలో సభ్యులు తమ ప్రవర్తన విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యానాయుడు సూచించారు. అంతరాయాల కారణంగా శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ 34 గంటలు నష్టపోయిందని చెప్పారు. అయినప్పటికీ తొమ్మిది బిల్లులను సభ ఆమోదించిందని తెలిపారు. సభ్యులు 19 ప్రైవేటు బిల్లులను ప్రవేశపెట్టారని, వాటిలో ఒకదానిపై మాత్రమే సుదీర్ఘంగా చర్చ జరిగిందని చెప్పారు. మొత్తంగా రాజ్యసభ 41 గంటలు పనిచేసిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై వచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, రైల్వే పునరాభివృద్ధి ప్రమాణాలను పునరుద్ధరించనున్నామని చెప్పారు. ఆదాయం, ప్రయాణికుల సంఖ్య, వ్యూహాత్మక ప్రాధాన్యాలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్లను వర్గీకరిస్తామని తెలిపారు. మొదటి దశలో 23 స్టేషన్ల పునరాభివృద్ధిని చేపడుతామని చెప్పారు.



2018 రాజ్యసభ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్ వెంకయ్యానాయుడు, డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్

లోక్‌సభలో 12 బిల్లులు ఆమోదం

ముస్లిం మహిళల (వివాహ పరిరక్షణ)బిల్లు సహా లోక్‌సభలో 12 బిల్లులు ఆమోదం పొందాయని స్పీకర్ సుమిత్రా మహాజన్ తెలిపారు. లోక్‌సభ 61 గంటల 48 నిమిషాలపాటు జరిగిందని చెప్పారు. అంతరాయాలు, వాయిదాల కారణంగా 15 గంటలను కోల్పోయామన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాల పెంపుదల బిల్లు, జీఎస్టీ (రాష్ర్టాలకు పరిహారం) సవరణ బిల్లు సహా పలు కీలక బిల్లులను సభ ఆమోదించిందని చెప్పారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ, ప్రపంచ బ్యాంకు చేసే 50 కోట్ల డాలర్ల సాయంతో ఆరేండ్లపాటు దేశంలో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతామని చెప్పారు. జీవనోపాధి కోసం నైపుణ్య సేకరణ, జ్ఞానంపై అవగాహన (సంకల్ప్) పథకాన్ని 67.5 కోట్ల డాలర్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. దీనికి ప్రపంచ బ్యాంకు 50 కోట్ల డాలర్లను అందిస్తున్నదని పేర్కొన్నారు. చిట్‌ఫండ్ కుంభకోణాల్లో భాగస్వాములైన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలేది లేదని జైట్లీ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని సెబీ పర్యవేక్షిస్తున్నదని, మోసాలకు పాల్పడిన కంపెనీల ఆస్తుల స్వాధీనానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

లాలూకు నేడు శిక్ష ఖరారు!

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకటించనున్న న్యాయమూర్తి



న్యూఢిల్లీ, జనవరి 5: దాణా కుంభకోణం కేసులో దోషిగా ఖరారైన బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు కోర్టు శనివారం శిక్ష విధించనుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ జడ్జి శివ్‌పాల్ సింగ్ ఈ శిక్షను ప్రకటించనున్నారు. వాస్తవానికి లాలూ జైలు శిక్షను ఇప్పటికే ప్రకటించాల్సి ఉన్నప్పటికీ జడ్జి రెండుసార్లు వాయిదా వేశారు. బీహార్‌లోని బిర్సా ముండా జైలులో ఉన్న లాలూ జ్యుడీషియల్ కస్టడీ శుక్రవారం ముగియడంతో ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యం బాగాలేదని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని తక్కువ శిక్షను విధించాలని న్యాయమూర్తిని లాలూ కోరారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి శనివారం కచ్చితంగా శిక్షను ప్రకటించే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. 'మీకు సంబంధమున్న వ్యక్తుల నుంచి నాకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. విచారపడకు. చట్టప్రకారం నడుచుకుంటా' అని ఇప్పటికే లాలూతో న్యాయమూర్తి పేర్కొన్న విషయం తెలిసిందే.

హిమపాతం ధాటికి 9 మంది గల్లంతు

ఇద్దరిని రక్షించిన సైనికులు.. జమ్ముకశ్మీర్‌లో ఘటన

కశ్మీర్: కశ్మీర్‌లో హిమపాతం ధాటికి 9మంది గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరిని రక్షించగా, మిగతా ఏడుగురి ఆచూకీ కోసం సైనికులు గాలిస్తున్నారు. ఈ సంఘటన శుక్రవారం కుప్వారా జిల్లాలోని తాంగ్‌ధర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎనిమిది మంది టాటా సుమో వాహనంలో కుప్వారా నుంచి కర్నా ప్రాంతానికి బయలుదేరారు. అయితే తాంగ్‌ధర్ ప్రాంతానికి చేరుకునే సరికి హిమపాతం ఒక్కసారిగా సంభవించింది. దీంతో ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఇదే ప్రాంతంలో సరిహద్దు రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన ఒక జవాన్ కూడా హిమపాతం ధాటికి గల్లంతయ్యారు. గల్లంతైన 9 మందిలో ఇద్దరిని రక్షించిన సైనికులు ఇతరులను గుర్తించడానికి తీవ్రంగా కృషిచేస్తున్నారు.

ప్రాదేశిక సైన్యంలో మహిళల నియామకం

ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ: భారత ప్రాదేశిక సైన్యంలో మహిళల నియామకానికి మార్గం సుగమం చేస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రాదేశిక సైన్యంలో మహిళల నియామకాన్ని నిరోధించేందుకు ఏవైనా ఆంక్షలు విధిస్తే అది వారికి రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని తాత్కాలిక చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సీ హరిశంకర్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొన్నది. ప్రాదేశిక సైన్యంలో మహిళల నియామకంపై వివక్షకు వ్యతిరేకంగా కుష్ కల్రా అనే న్యాయవాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను ధర్మాసనం విచారించింది.అత్యవసర సమయాల్లో దేశాన్ని రక్షించుకునేందుకు ఎంపిక చేసిన వలంటీర్లకు సైనిక శిక్షణ ఇస్తారు. ఈ వలంటీర్లనే టెరిటోరియల్ ఆర్మీ అని సంబోధిస్తారు.

హజ్ అర్హత నిబంధనలకు సవరణ

దివ్యాంగులకు అనుకూలంగా మారుస్తామన్న కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 5: ఇటీవల కొత్తగా ప్రతిపాదించిన హజ్ అర్హత నిబంధనలను దివ్యాంగులకు అనుకూలంగా ఉండే విధంగా సవరణ చేసేందుకు కేంద్ర మైనార్టీశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ అంగీకారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దివ్యాంగుల హక్కుల సంస్థ ప్రతినిధులు ఆయనతో సమావేశమయ్యారు. 'దివ్యాంగుల చట్టం ఉల్లంఘనకు గురికాకుండా హజ్ నిబంధనలను సవరించేందుకు కేంద్ర మంత్రి నక్వీ అంగీకరించారు. వికలాంగులు భౌతికంగా.. మానసికంగా బలహీనంగా ఉన్న వారు హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు అన్న నిబంధనను తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు' అని దివ్యాంగుల హక్కుల సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి వీ మురళీధరన్ పేర్కొన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లకు లక్ష్యంగా మారుతున్నాం

జిగ్నేశ్ మేవాని, ఉమర్ ఖాలిద్ ఆరోపణ

న్యూఢిల్లీ, జనవరి 5: ఆరెస్సెస్, బీజేపీలు తనను లక్ష్యంగా చేసుకుంటున్నాయని దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని ఆరోపించారు. గత నెల 31న పుణేలో జరిగిన సభలో తాను ఏ విధమైన రెచ్చగొట్టే ప్రసంగం చేయలేదని చెప్పారు. పుణె సభలో రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేశారంటూ మేవానితోపాటు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైన సంగతి తెలిసిందే. దీనిపై మేవాని శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని మోదీకి సన్నిహితులైన కొందరిని నిర్దోషులుగా నిరూపించేందుకే తమను లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. 'నేను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించలేదు, మహారాష్ట్ర బంద్‌లో పాల్గొనలేదు. నా ప్రసంగంలో ఏదైనా అమర్యాదకరమైనదుంటే ఎవరైనా రాజ్యాంగ నిపుణుడిని విశ్లేషించమని చెప్పండి. సభ ముగియగానే తీవ్రమైన తలనొప్పి కారణంగా విశ్రాంతి తీసుకున్నాను. భీమా కోరెగావ్ గ్రామాన్ని కూడా సందర్శించలేదు. అయినప్పటికీ నాపై ఆరోపణలు వస్తున్నాయంటే దీని వెనుక ఏదో కుట్ర కనిపిస్తున్నది. ఆరెస్సెస్, బీజేపీ కావాలనే నన్ను లక్ష్యంగా చేసుకుంటున్నాయి' అని మేవాని పేర్కొన్నారు. తానుకూడా పుణే సభ తరువాత ఎక్కడా ప్రసంగించలేదని ఖాలిద్ చెప్పారు. భీమా కోరెగావ్‌తోపాటు మహారాష్ట్రలో హింసకు, అల్లర్లకు కారణమైన శంభాజీ భిడే, మిలింద్ ఎక్‌బోటేల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే తమపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దళితులకు వ్యతిరేకంగా ఇంతటి హింస జరిగినా, తాను అంబేద్కర్ వాదినని చెప్పుకొనే ప్రధాని ఎందుకు స్పందించడం లేదని వారు నిలదీశారు. దళితులకు శాంతియుతంగా సభలు నిర్వహించుకొనే హక్కు ఉన్నదో లేదో ప్రధాని స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు.



మీడియా సమావేశంలో జిగ్నేశ్ మేవాని

బయటివారి వల్లే హింస: ఈ నెల ఒకటిన భీమాకోరెగావ్ గ్రామంలో జరిగిన హింసకు బయటినుంచి వచ్చిన వారే కారణమని గ్రామస్థులు చెప్పారు. ఆ రోజున తమ గ్రామానికి లక్షల సంఖ్యలో ప్రజలు వస్తారని తెలిసినప్పటికీ ప్రభుత్వం సమగ్రమైన రీతిలో భద్రతను ఏర్పాటుచేయలేదని అన్నారు. తమ గ్రామంలో అన్ని కులాల వారు సామరస్యంతో జీవిస్తున్నారని సర్పంచ్ సునీతా కాంబ్లే చెప్పారు. అల్లర్ల కారణంగా ఇండ్లు, దుకాణాలు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాల్యవివాహాలను సహించవద్దు

రాష్ర్టాలకు ఎన్‌హెచ్‌ఆర్సీ సూచన

భువనేశ్వర్: బాల్యవివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదని, బాల్య వివాహ నిషేధచట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) అన్ని రాష్ర్టాలను కోరింది. బాల్యవివాహాలను అరికట్టే అంశంపై గురువారం భువనేశ్వర్‌లో జరిగిన మహాసభలో ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రధాన కార్యదర్శి అంబుజ్‌శర్మ మాట్లాడారు. మన దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో బాల్యవివాహాలు ఒకటని చెప్పారు. ఈ సామాజిక రుగ్మతను నిర్మూలించడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం కోసమే ఈ మహాసభను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రపంచంలో జరుగుతున్న బాల్యవివాహాల్లో 40 శాతం కంటె ఎక్కువగా ఇండియాలోనే చోటు చేసుకుంటున్నాయని ఎన్‌హెచ్‌ఆర్సీ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిరోజు 3600 బాల్యవివాహాలు మన దేశంలో జరుగుతున్నా కేవలం కొన్నింటి సమాచారం మాత్రమే అందుతున్నది.

మైనారిటీ తీరిన మహిళకు పూర్తి స్వేచ్ఛ

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మైనారిటీ తీరిన మహిళ తన నిర్ణయాలు తాను తీసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, కోర్టులు ఈ విషయంలో 'మహా సంరక్షకుల' (సూపర్ గార్డియన్లు) పాత్ర పోషించజాలవని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. మేజర్ అయిన మహిళకు తన ఇష్టం వచ్చిన విధంగా జీవించే హక్కు ఉంటుందని, ఈ విషయంలో ఆమెపై ఎలాంటి నిషేధాలు ఉండరాదని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'మేజర్‌గా ఆమె తన స్వేచ్ఛను అనుభవించవచ్చు. ఇష్టం వచ్చిన చోటికి వెళ్లవచ్చు. ఇష్టమైన పని చేయవచ్చు. ఆమె లక్ష్యాలను ఎవరూ నిరోధించడానికి వీలులేదు' అని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అన్నారు. మేజర్ అయిన కుమార్తెను తనకు అప్పగించాలని ఆమె తల్లి దాఖలు చేసి పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మేజర్ అయిన వారిని కోర్టులు కూడా ఆపలేవని అంటూ ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది.

చర్చలకు ఉత్తర కొరియా అంగీకారం

- దక్షిణ కొరియా ప్రతిపాదనకు సరేనన్న కిమ్
- వచ్చేవారం చర్చలు



కిమ్‌జోంగ్ ఉన్

సియోల్, జనవరి 5: వచ్చేవారం ఉత్తర, దక్షిణకొరియా దేశాల మధ్య చర్చలు జరుగనున్నాయి. ఈ మేరకు దక్షిణకొరియా ప్రతిపాదనను ఉత్తరకొరియా శుక్రవారం అంగీకరించింది. శీతాకాల ఒలింపిక్స్ క్రీడలు ముగిసే వరకు సంయుక్త సైనిక విన్యాసాలను వాయిదా వేయాలని అమెరికా, దక్షిణకొరియా ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్న కొద్ది గంటల్లోనే ఉత్తరకొరియా సానుకూలంగా స్పందించింది. 2015 డిసెంబర్ తర్వాత ఉభయ కొరియాల మధ్య తొలి సమావేశం ఇదే కావడం గమనార్హం. ఇరుదేశాల సరిహద్దుల్లోని సైనిక రహిత గ్రామమైన పాన్‌మూన్‌జోమ్‌లో చర్చలు జరుగనున్నాయి. గత ఏడాది ఉత్తరకొరియా పలు ఖండాంతర క్షిపణి ప్రయోగాలు చేపట్టడంతో ప్రాంతీయంగానే కాక ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. అదేసమయంలో దక్షిణకొరియాలో జరుగనున్న ఒలింపిక్స్ క్రీడలకు తమ బృందాన్ని పంపుతామని ఉత్తరకొరియా ప్రకటించడంతో ఉభయ దేశాల మధ్య కొంత సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే వచ్చేవారం చర్చలకు రావాలని దక్షిణకొరియా ఉత్తరకరియాను ఆహ్వానించింది.

సొంత పట్టణాన్ని ఢీకొట్టిన ఉత్తరకొరియా క్షిపణి!

లండన్: ఉత్తరకొరియా గతేడాది ప్రయోగించిన ఓ మధ్య శ్రేణి క్షిపణి అదే దేశంలోని ఓ పట్టణంపై పడినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ 28వ తేదీన మధ్యశ్రేణి ఖండాంతర క్షిపణి (ఐఆర్‌బీఎం) హ్వాసంగ్-12ను ఉత్తరకొరియా ప్రయోగించింది. ప్రయోగం విఫలమై ఉత్తరకొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌కు 90 మైళ్ల దూరంలో ఉన్న టోక్చోన్ పట్టణంలో ఆ క్షిపణి పడినట్టు అమెరికా అధికారవర్గాలు భావిస్తున్నాయి.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

మొదటిపేజీ తరువాయి...

శాఖ మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. బడ్జెట్ సమావేశాల తొలి దశ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కొంత విరామం తరువాత రెండో విడుత సమావేశాలు మార్చి 5వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సమావేశమైన పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సిఫారసు చేసిందని తెలిపారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి.

కొత్త పది నోటు విడుదల


మొదటిపేజీ తరువాయి...

చిన్న సైజు నుంచి పెద్ద సైజు వరకు సంఖ్యలు ఉంటాయి. వెనుక వైపు ఎడమ దిక్కున నోటు ముద్రించిన సంవత్సరం, స్వచ్ఛభారత్ లోగోతోపాటు నినాదం, భాషల జాబితా, కోణార్క్ సూర్య దేవాలయం, దేవనాగరి లిపి హిందీలో పది అని రాసి ఉంటుంది. ఈ నోటు 63 మిల్లీమీటర్ల పొడవు, 123 మిల్లీ మీటర్ల వెడల్పుతో ఉండనున్నది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న రూ.పది నోట్లు కూడా చెల్లుబాటులో ఉంటాయని ఆర్బీఐ స్పష్టం చేసింది.

హెచ్-1బీ నిబంధనలతో అమెరికాకే నష్టం

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం.. భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయి

పలువురు భారతీయ అమెరికన్ సెనేటర్ల ఆందోళన



తులసి గబ్బార్డ్

వాషింగ్టన్, జనవరి 5: హెచ్-1బీ వీసా నూతన నిబంధనల వల్ల అమెరికాకే ఎక్కువ నష్టం జరుగుతుందని భారత సంతతికి చెందిన అమెరికన్ సెనేటర్లు భావిస్తున్నారు. ఐటీకి అమెరికా పుట్టినిల్లుగా విరాజిల్లుతున్నదని, నూతన నిబంధనల వల్ల ఈ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్తున్నారు. అంతేగాక భారత్, అమెరికా మధ్య సంబంధాలపై కూడా ఈ నింబంధనల ప్రభావం పడనుందని పేర్కొంటున్నారు. ప్రతిభావంతులైన ఐటీ ఉద్యోగులను అమెరికా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన మహిళా ఎంపీ తులసి గబ్బార్డ్ మాట్లాడుతూ 'హెచ్-1బీ వీసా నూతన నిబంధనలు దాదాపు 5లక్షల మంది భారతీయులపై ప్రభావం చూపనున్నాయి. వారంతా అమెరికా ఆర్థిక వృద్ధికి తోడ్పడుతున్నారు. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే వారంతా స్వదేశానికి వెళ్లిపోతారు. దీంతో అమెరికాకే ఎక్కువ నష్టం జరుగుతుంది' అని పేర్కొన్నారు. చట్టసభ సభ్యుడు రో ఖన్నా మాట్లాడుతూ హెచ్-1బీ వీసా నూతన నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం ఉపసంహరించుకుంటుందన్న నమ్మకం తనకు ఉందని తెలిపారు.

పాక్‌లో ఇద్దరు హిందూ సోదరుల హత్య

దోపిడీకి యత్నించి కాల్చివేసిన దొంగలు

కరాచీ: పాకిస్థాన్‌లో ఇద్దరు హిందూ సోదరులు హత్యకు గురయ్యారు. ఈ సంఘటన శుక్రవారం సింధ్ రాష్ట్రంలోని థార్‌పార్కర్ జిల్లాలో చోటుచేసుకుంది. మృతులను అన్నదమ్ములు దిలీప్‌కుమార్, చందర్ మహేశ్వరిగా గుర్తించారు. ఉదయం తమ ఆహారధాన్యాల దుకాణాన్ని తెరుస్తుండగా ఇద్దరు దోపిడీ దొంగలు బైక్ వచ్చి వారి దగ్గర ఉన్న డబ్బు సంచిని లాక్కోవడానికి ప్రయత్నించారు. దీంతో అన్నదమ్ములు ఇద్దరు ప్రతిఘటించగా దొంగలు తమ వద్ద ఉన్న తుపాకీతో ఆ ఇద్దరిని కాల్చిచంపారు. దీంతో అక్కడ ఉన్న ఇతర వ్యాపారులు దుకాణాలను మూసివేసి ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ హత్యలు రాజకీయంగానూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

వర్గీకరణపై కేంద్రం చిత్తశుద్ధితో లేదు

• టీఆర్‌ఎస్ నేత నోముల నర్సింహయ్య



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షానికి ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదంటే కేంద్రానికి చిత్తశుద్ధి లేదని అనుమానం వస్తున్నదని టీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణ సమస్యపై అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకె ళ్లేందుకు సీఎం కేసీఆర్ ఇప్పటికే పలుమార్లు ప్రధాని అపాయింట్‌మెంట్ అడిగారని.. కానీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సిన అవసరంలేదన్నారు. వర్గీకరణపై సీఎం కేసీఆర్ నిజాయితీతో ఉన్నారు కాబట్టే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. వర్గీకరణపై నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సింది కేంద్రమే అన్నారు. మంద కృష్ణ ఏం చేయాలనుకున్నా ఢిల్లీలోనే చేయాలని, కేంద్రంపై పోరాటం చేస్తే తగిన ఫలితం ఉండవచ్చన్నారు.

మూడేండ్లలో తెలంగాణ ప్రగతి అభినందనీయం

• ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ ప్రశంస
• మంత్రి కేటీఆర్‌తో భేటీ.. త్వరలో రాష్ట్రానికి ఫ్రెంచ్ బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మూడేండ్లలో తెలంగాణ ఎంతో ప్రగతి సాధించిందని ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ ప్రశంసించారు. ఫ్రెంచ్ కంపెనీలు తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై సానుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఫ్రెంచ్, భారత్ మధ్య శతాబ్దాలుగా సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయని తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావుతో ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ సమావేశమయ్యారు. ఫ్రెంచ్ జాతీయులు హైదరాబాద్‌లో ఉన్నారని.. ఫ్రెంచ్ కంపెనీలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు కార్యకలాపాల్లోనూ ఫ్రెంచ్ కంపెనీ భాగస్వామిగా ఉన్నట్లు గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీహబ్‌ను ఆయన ప్రశంసించారు. ఫ్రాన్స్‌లోని బోర్డో నగరంతో హైదరాబాద్ అనుబంధాన్ని గుర్తు చేశారు.

త్వరలో తెలంగాణకు ఫ్రెంచ్ కంపెనీలు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను.. ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను రాయబారి అలెగ్జాండర్‌కు మంత్రి కేటీఆర్ వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానంతో ఇప్పటికే వివిధ దేశాల కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్, ఫార్మా రంగాల్లో ఫ్రెంచ్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే 50 ప్రముఖ ఫ్రెంచ్ కంపెనీల పెట్టుబడిదారుల బృందం నగరానికి రానున్నదని మంత్రికి అలెగ్జాండర్ జీగ్లర్ తెలిపారు. ఫ్రెంచ్ కంపెనీలకు అనుసంధానకర్తగా పనిచేసేందుకు సిద్ధంగా ఉంటానని హామీఇచ్చారు. ఫ్రెంచ్ బృందానికి ఆతిథ్యం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో ఫ్రెంచ్ కాన్సుల్ జనరల్, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్

ఉద్యోగ, ఉపాధిని కల్పించే ఏజెన్సీగా న్యాక్

• నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ అందించాలి
• రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



శుక్రవారం సచివాలయంలో న్యాక్, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో న్యాక్ కో-చైర్మన్, సీఎస్ ఎస్పీసింగ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఏజెన్సీగా న్యాక్‌ను తీర్చిదిద్దాలని ఆ సంస్థ చైర్మన్, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో న్యాక్, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాక్‌లో శిక్షణ పొందిన యువతను సుశిక్షితులుగా భావించి అన్ని సంస్థలూ వెంటనే ఉద్యోగాలు ఇచ్చేలా తీర్చిదిద్దాలని సూచించారు. దేశ, విదేశాల్లోనూ ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. జిల్లాల్లో న్యాక్ కేంద్రాలను మరింతగా బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. శిక్షణ నాణ్యతను మెరుగుపర్చుకోవడానికి న్యాక్ అనేక ప్రైవేట్ సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకున్నదని, విద్యుత్, పెయింటింగ్, సోలార్ ఎనర్జీ, ఏషియన్ పెయింట్స్ తదితర పరిశ్రమలతో చర్చలు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో న్యాక్ కో-చైర్మన్, సీఎస్ ఎస్పీ సింగ్, రోడ్లు భవనాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, న్యాక్ డైరెక్టర్ కే భిక్షపతి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ లింగారెడ్డి, ఇరిగేషన్ ఈఎన్సీ నాగేందర్‌రావు, రాష్ట్ర బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో నాణ్యమైన విద్యకు కృషి

యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ధీరేంద్ర పాల్‌సింగ్ ప్రశంస



శుక్రవారం ఢిల్లీలో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ధీరేంద్రపాల్‌సింగ్‌ను కలిసిన ఎంపీ వినోద్, ఉన్నతవిద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యకోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ధీరేంద్రపాల్‌సింగ్ ప్రశంసించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉండాలని సూచించారు. శుక్రవారం ఎంపీ వినోద్‌కుమార్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి న్యూఢిల్లీలో యూజీసీ చైర్మన్ ధీరేంద్ర పాల్‌సింగ్‌ను కలిశారు. శాతవాహన యూనివర్సిటీకి 12 బీ హోదా కల్పించి నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి సంబంధించి ఆఫ్ క్యాంపస్‌ను కరీంనగర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీ వినోద్‌కుమార్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సెక్రటరీ/ రిజిస్ట్రార్ అర్చన ముద్గల్‌ను కలిసి శాతవాహన యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కోర్సులకు అనుమతించాలని కోరారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి ఆయనతో పాటు ఉన్నారు.

నేటినుంచి ఎమ్మార్పీఎస్ శిక్షణ తరగతులు

• టీఎస్‌ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ వంగపల్లి



శుక్రవారం విద్యానగర్‌లోని టీఎస్‌ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రసిడెంట్ వంగపల్లి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు తెలుగు రాష్ట్రాల మాదిగల కోసం శని, ఆదివారాల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో రాజకీయ శిక్షణ తరగతులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్టు టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శిక్షణా కార్యక్రమాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్య, జ్ఞానం, ఓటు చైతన్యం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని, శిక్షణ పొందిన ప్రతి కార్యకర్త పల్లెల్లో సైనికుల్లా పని చేస్తారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మాదిగల ఓట్లు అమ్ముడుపోయే పరిస్థితి ఉండదని, మాదిగ ఓటు సత్తా రుచి చూపిస్తామని చెప్పారు. మాదిగ ఉద్యమం అంటే గత నాయకత్వం మాదిరిగా దాడులను ప్రోత్సహిస్తూ కార్యకర్తలను జైలుపాలు చేయడం కాదని.. విద్యా, ఉద్యోగరంగాల్లో అభివృద్ధి పథం వైపు నడిపించడమని పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. శిక్షణా తరగతుల్లో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతోపాటు ప్రజాయుద్ధనౌక గద్దర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పీ కృపాకర్ మాదిగ, ఎంబీసీ సిద్ధాంతకర్త కొప్ర, డాక్టర్ కొల్లూరి చిరంజీవి, ఆంధ్రజ్యోతి పత్రిక ఎడిటర్ కే శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది డాక్టర్ వైకే, జూపాక సుభద్ర, డాక్టర్ కళివేల ఎలిషా కుమార్, ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక డాక్టర్ సీహెచ్ రాజమౌళి, ఐపీఎస్ డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, జంబూద్వీప శక్తి పీఠాధిపతి శక్తిశ్రీ గురు భగవతి మహారాజ్ స్వామిజీ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దండు సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను కనకరాజు, ఏఎస్‌ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కొల్లూరి వెంకట్, యువసేన కో-కన్వీనర్ పొట్ట పెంజర రమేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

చేనేత పథకాలపై డబ్ల్యూడీఎఫ్ హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్(డబ్ల్యూడీఎఫ్) హర్షం వ్యక్తంచేసింది. డబ్ల్యూడీఎఫ్ అధ్యక్షుడు దాసు సురేశ్ నేతృత్వంలో ఒక బృందం శుక్రవారం బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, ఆంజనేయగౌడ్‌ను కలిశారు. పవర్‌లూమ్ కార్మికులకు ఉచిత ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేసినందుకు కమిషన్ సభ్యులకు సురేశ్ ధన్యవాదాలు తెలిపారు. ఆరులక్షల ఉచిత ఇన్సూరెన్స్ పథకాన్ని బీసీలలోని కుటుంబపెద్దలకు కూడా వర్తింపజేసేలా చూడాలని విజ్ఞప్తి చేయగా కమిషన్ సభ్యులు సానుకూలంగా స్పందించినట్టు సురేశ్ తెలిపారు.

లింగాయత్‌లను ఎంబీసీలో చేర్చాలి

రాష్ట్రంలో సుమారు 12 లక్షల నుంచి 16 లక్షల వరకున్న వీరశైవ లింగాయత్, లింగబలిజలను వెనుకబడిన తరగతిగా గుర్తించి బీసీ-డీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, అధ్యక్షుడు పట్లోళ్ళ సంగమేశ్వర్, కోశాధికారి రాజశేఖర్, కార్యదర్శులు దినేశ్ పాటిల్, రాచప్ప, శివశరణ్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది.

స్వరాష్ట్రానికి ఏపీలో ఉన్న తెలంగాణ ఉద్యోగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీలో ఉన్న తెలంగాణ నాలుగోతరగతి ఉద్యోగులను తెలంగాణకు తీసుకొచ్చే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. విభజన చట్టం నిబంధనల ప్రకారం ఏపీ సర్కార్‌తో సంప్రదింపులను మొదలుపెట్టారు. రాష్ట్రానికి చెందిన ఉద్యోగులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు తమ వంతు ప్రయత్నాలను చేస్తున్నామని, నెలలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ తెలిపారు.



తెలుగులో జేఆర్‌ఎఫ్ సాధించిన ప్రమీల

• మొదటి గిరిజన మహిళగా రికార్డు

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జాతీయస్థాయిలో నిర్వహించిన అర్హత పరీక్ష (నెట్) తెలుగువిభాగంలో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) సాధించిన మొదటి గిరిజన మహిళగా మెగావత్ ప్రమీల చరిత్ర సృష్టించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండలం ధన్సింగ్ తండాలోని సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించిన ప్రమీల ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో తెలుగులో ఎంఏ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగులో జేఆర్‌ఎఫ్ సాధించిన తొలి గిరిజన మహిళగా నిలువడం పట్ల గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

కేంద్ర ఎంవీయాక్ట్ సవరణ బిల్లుపై టీఎంయూ ధర్నా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం ప్రవేశపెట్టనున్న మోటర్ వెహికిల్ యాక్ట్ (ఎంవీయాక్ట్) సవరణ బిల్లుకు వ్యతిరేకంగా టీఎస్‌ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం టీఎంయూ శుక్రవారం బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించింది. సవరణ బిల్లు అంశంతోపాటు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ జాప్యానికి నిరసనగా శుక్రవారం టీఎంయూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు పిలుపునిచ్చింది. రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో బస్‌భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకొస్తున్న ఎంవీయాక్ట్ సవరణ బిల్లుతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్నాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారన్న, కోశాధికారి రాజలింగం, రాష్ట్ర కార్యదర్శులు వీఎస్‌రెడ్డి, వీకేరెడ్డి, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
శనివారం 6 జనవరి 2018
WWW.NTNEWS.COM



నృత్యానందప్రియులు!

ప్రదర్శనల ద్వారా కళకు ప్రాణం పోసేవాళ్లను చూశాం. కళాకారులను చేరదీసి కళను కలకాలం వర్ధిల్లేట్టు చేస్తున్న వాళ్ల గురించి ఇప్పుడు చదువబోతున్నారు. ఆ కళాభిమానులు, నృత్యానంద ప్రియులే.. ఈ ఆనంద, ప్రియ! సంప్రదాయ భారతీయ నృత్యాల్ని రేపటి తరానికి అందించాలన్నదే వీరి ఉద్దేశం. అందుకోసం 'ఆనందప్రియ' నృత్య కళాక్షేత్రం ఏర్పాటుచేసి కళాకారులను ఆదరిస్తున్నారు.



అనూహ్య స్పందన:

కొన్ని వేదికలను చూశాం. ఆలోచించాం. ఆనందప్రియ సంస్థను ఏర్పాటుచేశాం. ఒక చిన్న ఆలోచన ఈరోజు ఎంతో కొంత మార్పునైతే తీసుకొస్తున్నది. అనూహ్య స్పందన వస్తున్నది. మేం కూడా ఇంతగా ఊహించలేదు. కళాకారులు మమ్మల్ని సంప్రదిస్తున్నారు. మా వంతుగా ఉచితంగా వేదికలను ఏర్పాటు చేసి వాళ్లకు అందిస్తున్నాం.

ఆనంద

రేపటి తరం కోసం:

ఎవరి దగ్గరా రూపాయి తీసుకోకుండా ఉచితంగా సంప్రదాయ నృత్యాల్ని రేపటి తరానికి అందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరం. కళలకు తగిత ప్రాధాన్యం ఏర్పడాలనే ఉద్దేశంతోనే మేమిద్దరం కలిశాం. మంచి కార్యక్రమాలు ఏర్పాటుచేశాం. భవిష్యత్‌లో మా కార్యక్రమాలను విస్తరింపజేస్తాం.

ప్రియ

'సంగీత సాహిత్య సమలంకృతే.. స్వరరాగ పదయోగ సమభూషితే' అంటూ సంగీత ప్రియులను అలరించాలన్నా.. 'తకిట తదిమి తకిట తదిమి తందానా.. హృదయ లయల జతుల గతుల తిల్లానా' అంటూ నృత్య ప్రియులను ఆనందింపజేయాలన్నా మంచి 'వేదిక', అక్కడ ప్రదర్శించే 'అవకాశం' కలుగాలి. కానీ ఎలా?

కాత్యాయినిది అదే పరిస్థితి. వరంగల్‌కు చెందిన సంప్రదాయ నృత్యకారిణి ఆమె. హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శన ఇవ్వాలని కోరిక. కానీ వేదికలు అద్దెకు తీసుకొని.. ప్రదర్శన ఇచ్చేంత స్థోమత లేదు.

కిరణ్మయది కూడా ఇదే పరిస్థితి. మహిళలు అరుదుగా ఉండే సంగీత కచేరీలో ప్రావీణ్యురాలు ఆమె. తమిళ నేపథ్యమున్న ఆమె హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఉంటున్నారు. సంగీత కచేరీ ఎక్కడ చేయాలి? ఎప్పుడు ఎలా చేయాలో ఆమెకు తెలియదు. ఇక్కడ పరిచయాల్లేకపోవడం.. ప్రదర్శనకు అవకాశాల్లేకపోవడంతో ఆమె తన ఆలోచనను విరమించుకున్నది.

కృష్ణప్రసాద్ నైపుణ్యం గల కళాకారుడు. ఎలా అంటే.. చూడగానే ఉన్నది ఉన్నట్లు కాన్వాస్‌పై దింపగలడు. హైదరాబాద్‌లో పెయింటింగ్ ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నది అతని కల. ఎవ్వరిని సంప్రదించినా.. ఎంత ప్రయత్నించినా ఆ అవకాశం కలుగలేదు.

ఇప్పుడు వీళ్లంతా ఏం చేయాలి? చేసేందుముంది? ఆలోచనను విరమింపజేసుకొని.. తమ పని తాము చూసుకోవడమే మిన్న. వాళ్లూ అదే చేస్తున్నారు.

కాత్యాయనీ.. కిరణ్మయి.. కృష్ణప్రసాద్ లాంటి వాళ్లకోసమే 'ఆనందప్రియ' సంస్థ వేదిక కల్పిస్తున్నది. సంగీత.. సాహిత్య.. నృత కళాకారులను ప్రావీణ్యులను చేస్తూ ప్రదర్శనావకాశాలు కల్పిస్తున్నది. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ కళను కలకాలం వర్ధిల్లేట్లు చేస్తున్నది. ఈ సంస్థను నిర్వహిస్తున్న వారే.. ఆనంద, ప్రియ.

ఆలోచన ఎలా వచ్చింది? : అది ఓ సాంస్కృతిక కార్యక్రమం. ప్రముఖుల సమక్షంలో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఔత్సాహిక కళాకారులు తమ ప్రతిభను చాటేందుకు ప్రదర్శనలు ఇస్తున్నారు. వంతులవారీగా ఒకరి తర్వాత ఒకరు.. ఒకరికి మించి ఒకరు ప్రదర్శనల పరంపర కొనసాగిస్తున్నారు. ఇంతలోనే.. ఎవరో నాయకుడొచ్చారు. ఏముంది.. హఠాత్తుగా.. అర్ధాంతరంగా కళా ప్రదర్శన కార్యక్రమాలు ముగిసిపోయాయి. కళల్ని బతికించేందుకు నాయకులు చేస్తున్న కృషిని కీర్తించేందుకే కార్యక్రమం సాగినట్లయింది. వారి ప్రసంగానంతరం మళ్లీ ప్రదర్శనలు ప్రారంభం చేసుకోవచ్చని నిర్వాహకులు సూచించారు. కానీ ఎలా? కనీసం వాటిని తిలకించేందుకైనా పట్టుమని పదిమంది కూడా లేరు. ఉపన్యాసాల ఘట్టం ముగియగానే అంతా వెళ్లిపోయారు. సగటు కళాకారుడు కోరుకునేదేంటి? ఆసక్తిగా తిలకించే కళాభిమానులు.. ఉత్సాహాన్నిచ్చే నాలుగు చప్పట్లు.. ప్రశంసించే ఓ నాలుగు మంచి మాటలు. కానీ ఇవేవీ వాళ్లకు దక్కనందుకు మళ్లీ ఇలాంటి కార్యక్రమాలు అంటే ముందుకు రావడం లేదు. సినిమాల ఆడియో ఫంక్షన్ల కార్యక్రమాల్లో ఏర్పాటుచేసే డ్యాన్సులు కాదు కదా సంప్రదాయ కళా ప్రదర్శనలు అంటే? వినోదం కోసం.. కాలక్షేం కోసం చేయించే కార్యక్రమాలు అంత కన్నా కాదు. ఆనంద, ప్రియ ఈ పరిస్థితిని గమనించారు. అర్థవంతమైన నృత్య కళా ప్రదర్శనలు అందివ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అతిథులను ఆకట్టుకునేందుకు కాకుండా.. కళను బతికించేందుకు చేపట్టే కార్యక్రమాలుగా కళల్ని సరైన రీతిలో తీర్చిదిద్దాలని భావించారు. ఈ మార్పు కోసమే 'ఆనందప్రియ సంస్థ'ను ఏర్పాటు చేశారు.

ఏం చేస్తున్నారు?: గ్రామీణ ప్రాంతాలతో పాటు.. నగరంలో ఉన్న కళాకారులకు.. కళల కోసం తపన పడుతున్నవాళ్లకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగా అన్ని రకాల సంప్రదాయ కళల్ని ప్రోత్సహిస్తున్నారు. కళా వైభవాన్ని విస్తరింపజేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. కళల గురించి నిర్వహకులకు.. అభిమానులకు.. నాయకులకు అవగాహన కల్పిస్తున్నారు. తపన ఉన్న కళాకారులకు వేదిక కల్పించి వాళ్లలోని సృజనాత్మకతను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఇప్పటి వరకు 20 మంది కళాకారులకు వేదికలు కల్పించారు. ఇందుకు ప్రచార, ఇతర నిర్వహణ ఖర్చులు అన్నీ ఆనందప్రియ సంస్థే భరిస్తున్నది.

కార్పోరేట్ సంస్థల ఆహ్వానం!

ఒకవైపు కళను బతికించే ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు కళల పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలు వేస్తున్నారు ఆనంద, ప్రియ. ఆనందకు జర్నలిస్టుగా పనిచేసిన అనుభవం ఉన్నది. భరతనాట్యం, కర్ణాటక సంగీతంలో పట్టు ఉన్నది. ఆర్‌బీసీ అడ్వర్టయిజింగ్ సంస్థ బోర్డ్ డైరెక్టర్‌గా ఉన్న ప్రియ కర్ణాటక సంగీతంలో శిక్షణ పొంది.. కళాకారిణిగా పేరు సంపాదించారు. ఈ అనుభవంతో ఇరువురు ప్రణాళికతో ఈ బాధ్యత తీసుకున్నారు. ఒక్క తెలంగాణలోనే కాదు.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కళాకారులక్కూడా ఆనందప్రియ సంస్థ తోడ్పాటు అందిస్తున్నది. ఇప్పుడిప్పుడే కార్పోరేట్ సంస్థలు కూడా ఆహ్వానాలు పంపుతున్నాయట. భవిష్యత్తులో తమ పనిని మరింత వేగవంతం, విస్తృతం చేసి మరింత ఎక్కువ మంది కళాకారులకు దగ్గరయ్యేందుకు కృషి చేస్తున్నట్లు వాళ్లు చెప్పారు.

కళ నేర్పిన బాధ్యత!

ఆనందప్రియ సంస్థను స్థాపించిన ఆనంద, ప్రియ మంచి స్నేహితులు. ఇద్దరూ సంప్రదాయ నృత్యాల్లో ప్రావీణ్యులు. అనేక వేదికలపై తమ ప్రదర్శనలతో అలరించారు. ప్రముఖుల ప్రశంసలూ పొందారు. ఇద్దరి జీవన విధానం ఒకే విధంగా ఉండడం.. ఆలోచనలూ ఒకే రీతిలో ఉండడం.. కళాభిమానం ఇద్దర్నీ ఒక్కచోటుకు చేర్చింది. కళే వాళ్లకు సమాజం పట్ల.. కళ పట్ల బాధ్యత నేర్పింది. కళను బతికించేందుకు ఉపయోగపడే సంస్థను స్థాపించేట్లు చేసింది. అవకాశం రాని.. స్థోమతలేని నృత్య.. సంగీత కళాకారులకు వేదికలు కల్పిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు.

ఫ్యామిలీ ప్లానింగ్ ఎలా?



అడుగండి చెబుతా



డాక్టర్ వింధ్య
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

నా వయసు 23 సంవత్సరాలు. మాకు పెళ్లయి 3 నెలలు అవుతున్నది. మావారు, నేను ఇద్దరం కూడా కెరీర్‌లో ఇప్పుడిప్పుడే మంచి స్థాయికి వచ్చేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల మరో రెండేళ్ల వరకు పిల్లలు వద్దనుకుంటున్నాం. కానీ ఫ్యామిలీ ప్లానింగ్ గురించి పెద్దగా అవగాహన లేదు. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో దయచేసి వివరించగలరు.

రేవతి, హనుమకొండ

మీరు సొంతంగా నిర్ణయం తీసుకోకుండా డాక్టర్ సలహా కోసం ప్రయత్నించారు అందుకు మీకు అభినందనలు. మొదటి సారి గర్భం దాల్చడానికి సమయం తీసుకోవాలనుకునే దంపతులకు రకరకాల కుటుంబ నియంత్రణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. అందులో సేఫ్టీ పీరియడ్ పాటించడం. అంటే అండోత్పత్తి సమయంలో అంటే నెలసరి తర్వాత పదో రోజు నుంచి 18 రోజుల వరకు శృంగారానికి దూరంగా ఉండడం లేదా ఆ సమయంలో కండోమ్ వంటి తాత్కాలిక పద్ధతులను అవలంబించడం. కానీ ఇది పూర్తి స్థాయిలో సురక్షితమైందని చెప్పలేం. ఒక్కోసారి ఫెయిల్ అవడం వల్ల గర్భం దాల్చే ప్రమాదం ఉంటుంది. ఇక రెండోది గర్భనిరోధక మాత్రలు వాడడం. నెలసరి తర్వాత మొదటి రోజు నుంచి వేసుకోవడానికి వీలుగా 30 టాబ్లెట్లతో కూడిన ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. రోజు తప్పనిసరిగా ఒక టాబ్లెట్ వేసుకోవడం ద్వారా అవాంఛిత గర్భం రాకుండా జాగ్రత్త పడొచ్చు. ఇప్పుడు కొన్ని ఇంజెక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇందులో కొన్ని 8 వారాలు, మరికొన్ని 12, 13 వారాల వరకు పనిచేస్తాయి. టాబ్లెట్ వేసుకోవడం మరచిపోయే అలవాటు ఉన్నవారు ఇంజెక్షన్ల గురించి ఆలోచించవచ్చు. ఈ సమాచారం మీకు అవగాహన కల్పించడానికి తోడ్పడుతుంది. కానీ మీరు కుటుంబనియంత్రణ పద్ధతులను ప్రారంభించడానికి ముందు ఒకసారి గైనకాలజిస్ట్‌ను సంప్రదించి పూర్తి వివరాలు డాక్టర్‌తో చర్చించిన తర్వాత వారి సూచనల మేరకు మీరు ఏ పద్ధతిని ఎంచుకోవాలో నిర్ణయించుకోవడం మంచిది.

ఆఫీస్‌లాంటి కేఫ్!

మంచి హోటల్లో తినాలి. మంచి కేఫ్‌లో చాయ్ తాగాలి అని వెతుక్కుంటూ ఎంతదూరమైనా వెళ్తుంటాం. కానీ అంత శ్రమ.. టైమ్‌వేస్ట్ అక్కర్లేదు అంటున్నది ఈ అమ్మాయి.



అహ్మదాబాద్‌కు చెందిన 28 ఏండ్ల సంజాలీ నిర్వాణి విదేశాల్లో చదువుకున్నది. ఇండియాకు తిరిగొచ్చాక ఏదైనా మంచి కేఫ్ స్టార్ట్ చేయాలనేది ఆమె ఆలోచన. మెనూ ఎలా ఉండాలి? నిర్వహణ ఎలా ఉండాలి? అనే విషయాలపై అధ్యయనం చేసింది. అన్ని కేఫ్‌ల్లాగా కాకుండా.. ఓ ప్రత్యేకమైన లైఫ్‌స్టయిల్‌ను కస్టమర్లకు పరిచయం చేయాలనుకున్నది. అలా 2017లో అహ్మదాబాద్‌లో కేఫ్ స్టార్ట్ చేసింది. ఇక్కడకు వచ్చిన కస్టమర్లు చాలాసమయం వెచ్చించేలా థీమ్ ప్లాన్ చేసింది. కొన్ని రకాల ఆటలు, ఇంటర్నెట్ సదుపాయం ఏర్పాటు చేసింది. కాఫీ, టీ, పిజ్జా.. బర్గర్.. శాండ్‌విచ్ కోసం వచ్చి ఇక్కడ గంటల సమయం వేస్ట్ చేసుకొని పనికి అంతరాయం కలిగించకుండా వాటన్నింటినీ ఇక్కడే చేసుకునేలా అవకాశం కల్పించింది. దానికి కూడా గంట చొప్పున ఫీజు తీసుకుంటుంది. ఐటీ కంపెనీల ఉద్యోగులు ఆఫీస్‌ల్లో కంటే ఇక్కడే ఎక్కువగా ఉండడానికి ఆసక్తి కనబరుస్తున్నారట.

చలికాలం చిట్కాలు




- చలికాలంలో చర్మసమస్యలు ఎక్కువగా ఇబ్బందిపెడుతాయి. వీటిని అధిగమించాలంటే సాధ్యమైనన్ని నీళ్లు తాగడమే ఉత్తమమైన పరిష్కారం.
- పొడిబారిన చర్మానికి అవకాడో ఆయిల్, మినరల్ ఆయిల్ రాసుకుంటే కాంతివంతంగా మారుతుంది.
- చలికాలంలో హ్యుమిడిఫైయర్స్ చాలా అవసరమవుతాయి. దీనివల్ల చర్మం పొడిబారడం, పగలడం తగ్గుతుంది.
- పాదాలకు పగుళ్లు రాకుండా ఉండేందుకు పె[illegible] లియం జెల్లీ, గ్లిజరిన్ లాంటివి వాడాలి.

సిరిముగ్గు



నేతి విజయలక్ష్మి
నయానగర్,
కోదాడ



21 చుక్కలు 7 వరుసలు 7 వచ్చే వరకు

8.
నమస్తే తెలంగాణ
నిధి
[హైదరాబాద్]
శనివారం 6 జనవరి 2018

30 ఏళ్లలో రూ. కోటిన్నర..

పిన్న వయసులో ఉన్నప్పుడే పొదుపునకు అలవాటు పడటం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఆరంభంలోనే పదవీ విరమణ ప్రణాళికలను రచిస్తే కలిగే లాభం అంతాఇంతా కాదు. భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఉంటాయి. ప్రస్తుతం ఓ 28 ఏండ్లు వయసు గల వ్యక్తి కనీసం ముప్పయ్ ఏండ్ల దాకా పని చేయాల్సి ఉంటుంది. ఇది దీర్ఘకాలిక ప్రణాళిక కింద లెక్క. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో మదుపు చేస్తే మంచి లాభాలు అందుకోవచ్చు. ఏడాదికి ఒకేసారి కాకుండా నెలనెలా మదుపు చేయడానికి ప్రయత్నించండి. నెలకు రూ.3,500 చొప్పున 30 ఏండ్ల పాటు మదుపు చేస్తే...కనీసం 14 శాతం రాబడితో కోటిన్నర వరకూ ఆర్జించే వీలుంది. చిన్నా మొత్తాలు మదుపు చేయడం వల్ల ఇలా పెద్ద మొత్తంలో లాభం కలుగుతుంది. కానీ ఇప్పుడు ఇది చాలా ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ అప్పటికి పెద్ద మొత్తమేమీ కాదు. కాబట్టి ఆదాయం పెరుగుతున్న కొద్దీ పెట్టుబడిని కూడా అదే శాతంలో పెంచుకోవడం మంచిది. రాబడిని బట్టి నెలనెలా కొంత మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టుకోవాలి. దీని వల్ల ఆర్థిక క్రమశిక్షణ కూడా అలవాటు పడుతుంది. ఇటీవల కాలంలో మన దేశంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుందని భారత మ్యూచువల్ ఫండ్ల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు పెట్టేవారి కోసం పలు సంస్థలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రస్తుతం పెట్టుబడి కొసం బిర్లా సన్ లైఫ్ ఫ్రంట్ లైన్ ఈక్విటీ, ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ ఫోకస్ బ్లూ చిప్, ఐసీఐసీఐ డిస్కవరీ ఫండ్, ఫ్రాంక్లీన్ ఇండియా ప్రైమా ప్లస్ ఫండ్లను పరిశీలించవచ్చు.





ప్రత్యేక ఖాతాలను

పట్టించుకోవాలి!

రాజేష్ ఇంటి స్థలాన్ని అమ్మాడు. వచ్చిన రూ.20 లక్షలతో మరో ఇల్లు కొనాలన్నది ప్రణాళిక. వెంటనే బ్యాంకు పొదుపు ఖాతాలో సొమ్ము డిపాజిట్ చేశారు. నచ్చిన ఇల్లు దొరకడానికి ఏడాదైంది. ఆ సొమ్ము పొదుపు ఖాతాలో ఉండటం వల్ల నామమాత్రపు వడ్డీ లభించింది. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్లయితే.. ఎక్కువ సొమ్ము వచ్చేది.

రమేష్‌కు బ్యాంకులో రూ.10 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉంది. అయినా, ఇంటర్నెట్ కనెక్షన్ కోసం ఇచ్చిన రూ.5 వేల చెక్కును కనీస నిల్వలేని కారణంగా బ్యాంకు తిప్పి పంపింది. రూ. 10 లక్షల డిపాజిట్ నుంచి సొమ్ము చెల్లిస్తే పరువు దక్కేది. చెక్కు చెల్లింపులకు బ్యాంకు డిపాజిట్లను వాడుకోలేమా?

రాజేష్, రమేష్ లాంటి వారి ఖాతాదారుల కోసం బ్యాంకులు పొదుపు ఖాతాకు బదులు ప్రత్యేక పొదుపు ఖాతా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ఈ ఖాతాలో నిర్ణీత నిల్వ కంటే ఎక్కువగా ఉన్న మొత్తం.. ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని తీసేసుకోవచ్చు, ఉదాహరణకు పొదుపు ఖాతాలో కనీస నిల్వ రూ.10 వేల కంటే అధికంగా ఉన్న మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మార్చాలని బ్యాంకుకు సూచించారు. ఆ తర్వాత రూ.60 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. దీంతో ఖాతాలో నిల్వ రూ.70 వేలు అయ్యిందనుకుంటే.. అప్పుడు కనీస నిల్వ రూ.10 వేలు పోను మిగతా రూ. 60 వేలు ఉన్నట్టుగా భావించాలి.

- సేవింగ్ ప్లస్.. ఫ్రీడం ఫ్లెక్సీ డిపాజిట్ పథకం.. పేర్లు ఏవైనా.. పొదుపు ఖాతాలోని సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్టుగా మార్చుకుంటే.. కలిగే ప్రయోజనం అంతాఇంతా కాదు. ఇలాంటి అవకాశాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్లో ఈ పొదుపు పథకాన్ని సేవింగ్ ప్లస్ అంటారు. ఆంధ్రాబ్యాంకులో ఫ్రీడం ఫ్లెక్సీ డిపాజిట్ పథకంలో ఈసౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలంటే బ్యాంకుకు వెళ్లాలి. లేదా ఆన్‌లైన్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలి. మన పొదుపు ఖాతాలో డివిడెండ్ చెక్కులు, కలెక్షన్స్‌కు ఇచ్చిన చెక్కుల్లాంటివి మన ఖాతాలో ఎప్పుడూ జమైనదీ చూసుకుని ఫిక్స్‌డ్ చేసేంత తీరిక, ఓపిక లేని వారు ఈ ప్రత్యేక పొదుపు ఖాతాలను వినియోగించుకోవచ్చు.

- మన ఖాతాలో ఉన్న అధిక మొత్తాన్ని ఎన్నాళ్లకు ఫిక్స్‌డ్ చేసే నిబంధనలు బ్యాంకులను బట్టి మారుతూ ఉంటాయి. ఈ ప్రత్యేక ఖాతాలో డబ్బులు వాటంతట అవే ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మారుతాయి. కాబట్టి బ్యాంకు వడ్డీ రేటు వివరాలు పట్టించుకోకుండా ఉండొద్దు. ఉదాహరణకు ఎస్‌బీహెచ్ సేవింగ్స్ ప్లస ఖాతాలో డబ్బు ఏడాదికి ఫిక్స్‌డ్ అయ్యేలా రాసిచ్చారు. దానిపై 8.8 శాతం వడ్డీ వస్తుంది. కానీ ఎస్‌బీహెచ్ కుబేర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో 400 రోజులకు 8.85 శాతం వడ్డీ వస్తుంది. బ్యాంకులలో అధిక వడ్డీ వచ్చే కొన్ని ప్రత్యేక పథకాలు ఉంటాయి. ఈ ప్రత్యేక ఖాతాల్లో కనీస నిల్వ సాధారణ పొదుపు ఖాతాకన్న ఎక్కువ ఉంటుంది. ఇప్పటికే ఉన్న సాధారణ పొదుపు ఖాతాను ప్రత్యేక ఖాతాగా మార్చుకునే సదుపాయం ఉంటే మార్చుకోండి. మీకు సమీపంలో ఉన్న బ్యాంకులో పైన చెప్పిన ప్రత్యేక పొదుపు ఖాతా లేకుంటే మామూలు సేవింగ్ కాతా నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ ఎప్పటికప్పుడు మార్చే ఆటో స్వీప్ , రివర్స్ స్వీప్ సౌకర్యం వినియోగించవచ్చు, దీని ద్వారా కూడా పై ప్రయోజనాలన్నీ లభిస్తాయి.

ఆర్థిక పాఠాలు..

పిల్లల చదువుకు ప్రణాళిక!

నేటి చదువులు ఖరీదయ్యాయి. ప్రస్తుతం వేలల్లో ఖర్చయ్యేది.. రానున్న రోజులో లక్షల్లోకి చేరే అవకాశముంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని చాలామంది పొదుపు, మదుపులు చేస్తున్నారు. అయితే, దీనికో పద్ధతి పాటించకుండా.. తోచిన మొత్తాన్ని పక్కకు పెట్టేయకుండా.. ఏదో ఒక పథకంలో పెట్టుబడి పెట్టి.. అదే ప్రణాళిక అనుకోకూడదు. తీరా, లక్ష్యాన్ని చేరుకునే సమయానికి, తాము అనుకున్న మొత్తాన్ని సాధించలేకపోవడంతో.. చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకూడదంటే.. ముందునుంచే అంతా పక్కాగా సిద్ధం చేసుకోవాలి.



స్పష్టత ముఖ్యం..



పిల్లల చదువులకు నిధిని సిద్ధం చేసేందుకు ఇక సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలి. ఇందులో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలి. లక్ష్య సాధనకు ఒక తేదీని నిర్ణయించుకోవాలి. ఈ రోజుకు ఎంత మొత్తం కావాలి?. మీరు అనుకున్న తేదీ నాటికి కావాల్సిన మొత్తం ఎంత? మీరు మదుపు చేస్తున్న పథకంలో వచ్చే రాబడి మాటేమిటి? నెలవారీ లేదా వార్షిక పెట్టుబడి ఎంత పెట్టగలరు? ఈ అంశాలే మొత్తం ఆర్థిక ప్రణాళికలో ముఖ్య భూమిక పోషిస్తాయని మరిచిపోవద్దు.

ఖర్చులన్నీ లెక్కేయాలి..



సాధారణంగా చదువులకు అయ్యే ఖర్చు అనగానే.. మనం తొలుత కళాశాల ఫీజులు మాత్రమే లెక్కిస్తుంటాం. కానీ, అంతకుమించిన మరికొన్ని ఖర్చులుంటాయనే విషయం మర్చిపోవద్దు. ఫీజులతో పాటు రవాణా, ట్యూషన్ ఫీజులు, చేతి ఖర్చులకయ్యే మొత్తం, దుస్తులు, వైజ్ఞానిక పర్యటనలు.. ఇలా అనేక అంశాల్ని పరిగణనలోకి తీసుకోవాలి. వీటన్నింటినీ కలిపి చూసినప్పుడు ఖర్చు కాస్త అధికంగానే ఉంటుందని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం చదువులకు అవుతున్న ఖర్చు అధికంగానే ఉన్నది. చదువు నిమిత్తం ఏటా పది నుంచి పన్నెండు శాతం ఖర్చు పెరుగుతున్నది. కుటుంబ సంపాదనలో ఎక్కువ భాగం పిల్లల చదువుల కోసమే ఖర్చవుతున్న పరిస్థితుల్లో దానికి అనుగుణంగా మన ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. భవిష్యత్తులో అంతర్జాతీయ విద్యాసంస్థలు కూడా మనదేశంలోకి రావడానికి అవకాశముంది. వీటిలో చదివించాలంటే మరింత ఎక్కువ ఖర్చుకు సిద్ధ పడాల్సి ఉంటుంది. మన జీవన ప్రమాణ స్థాయి పెరుగుతున్న కొద్దీ పేరున్న పాఠశాలలు/ కళాశాలల్లోనే చదివించాలనే కోరిక పెరుగుతుంది. ఫలితంగా, రానున్న రోజుల్లో ఖర్చు పెరుగుతుందే తప్ప తగ్గే ప్రసక్తే ఉండదు. అందుకే, విద్యా ప్రణాళికల్లో కేవలం ప్రస్తుత ఖర్చులే కాకుండా భవిష్యత్తులో పెరిగే ఖర్చులకు అనుగుణంగా ప్రణాళికలు రచించాలి

పన్నులు చూడాలి..



మనమెందులో పెట్టుబడి పెట్టినా.. రాబడి వచ్చేటప్పుడైనా.. పెట్టుబడిని ఉపసంహరించుకునేటప్పుడైనా.. ఆదాయపు పన్ను లేకుండా చూసుకోవాలి. పన్ను అధికంగా ఉంటే మనం అనుకుంటున్న మొత్తంలో కొంత కోత పడవచ్చు. ఒకవేళ పన్ను వర్తించినా, రాబడి మొత్తం తీసుకునేటప్పుడు పన్ను పడేలా ఉండాలి. ఉదాహరణకు, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేస్తే ఏటా రాబడి తీసుకోకున్నా.. అంచనా రాబడిని చూపించి, వర్తించే శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే డెట్ ఫండ్ల విషయానికి వస్తే.. పెట్టుబడి పెట్టినప్పుడే మూడేండ్ల తర్వాత వచ్చిన రాబడిపై ద్రవ్యోల్బణ సూచీతో సర్దుబాటు చేసి పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో, విదేశాల్లో చదువుకయ్యే ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలి. అమెరికా, యూరప్ దేశాలకు మీ పిల్లలను పంపించే ఆలోచనలుంటే.. ముందుగానే దానికి తగ్గట్టుగా సిద్ధం కావాలి. అక్కడ అందుబాటులో ఉన్న పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. ప్రస్తుతం అనేక ఫండ్ సంస్థలు విదేశాల్లో పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ ఫండ్లలో మదుపు చేయడం వల్ల భవిష్యత్తులో రూపాయి విలువ పతనం లాంటివి జరిగినప్పుడు, అక్కడి పెట్టుబడులు మంచి లాభాలను ఆర్జిస్తాయి. ఫలితంగా, మన అంచనాలు తప్పకుండా అక్కడి చదువుల ఖర్చును తట్టుకునే వీలవుతుంది.





పెట్టుబడి పెట్టడం కన్నా ముందు చేయాల్సిన పని ఏమిటంటే.. మీ పిల్లలకు తగినంత ఆర్థిక భద్రత కల్పించాలి. ఆ తర్వాతే ఏ పెట్టుబడి పథకాన్ని అయినా ఎంచుకోవాలి. మదుపు ఎప్పుడూ వీలైనంత త్వరగా ప్రారంభించాలి. అప్పుడే చిన్న మొత్తంతోనూ ఎక్కువ నిధిని సమకూర్చుకోవడానికి వీలవుతుంది. కేవలం తొందరగా ప్రారంభించడంతోనే సరిపోదు. సరైన పథకాన్ని ఎంచుకోవడమూ ముఖ్యమే. ఏడెనిమిదేళ్ల సమయానికి మంచి ఉంటేనే ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పథకాల జోలికి మాత్రమే వెళ్లాలి. స్వల్పకాలంలో వీటిలో ఆటుపోట్లు అధికంగా ఉంటాయని మర్చిపోవద్దు. నష్టభయం భరించగలిగేవారు 70 నుంచి 75 శాతం వరకూ ఈక్విటీ ఫండ్లకు కేటాయించాలి. 25-30 శాతాన్ని పీపీఎఫ్, బ్యాంకు డిపాజిట్లు, పన్ను రహిత బాండ్లలో మదుపు చేయాలి. ముప్పయ్ శాతం పన్ను పరిధిలో ఉన్నవారు ఇన్‌కం ఫండ్ల వైపు చూడటం మంచిది. ఒకవేళ మీ పెట్టుబడి వ్యవధి ఐదేండ్ల కంటే తక్కువుంటే.. వీలైనంత వరకూ నష్టభయం తక్కువగా ఉండే పథకాలను ఎంచుకోవాలి. ప్రధానంగా, స్థిరాదాయమిచ్చే పథకాల వైపు మొగ్గు చూపాలి. వీటిలో సులభంగా నగదు వెనక్కి తీసుకునే పథకాల్లో పెట్టుబడి పెట్టాలి. ఉదాహరణకు, నాలుగేళ్ల వ్యవధి ఉన్నప్పుడు పీపీఎఫ్‌లో డబ్బు జమ చేయడం వల్ల ఫలితం ఉండదు.

సమీక్షించుకోవాలి..



మనం వేసుకున్న ప్రణాళిక ఎప్పుడూ వాస్తవ పరిస్థితులను బట్టి ఉంటుంది. భవిష్యత్తులో ఈ అంచనాలు స్వల్పంగా మారవచ్చు. అందుకే ప్రణాళికలతో పాటు పెట్టుబడి పథకాల పనితీరునూ ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. ఏదైనా పెట్టుబడి మనం అనుకుంటున్న రాబడిని ఇవ్వడం లేదా అనుకున్నప్పుడు వెంటనే దానిలో నుంచి బయటపడాలి. ఒకవేళ, మూడు నాలుగేండ్ల తర్వాత మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తే.. అప్పుడు మీ సొమ్మును వెంటనే సురక్షిత పొదుపు పథకాల్లోకి మళ్లించాలి. సొమ్ము అవసరం అయ్యే రెండు, మూడేండ్ల ముందు నుంచి క్రమానుగత బదిలీ విధానంలో ఈక్విటీల నుంచి సురక్షిత పథకాలకు సొమ్మును బదిలీ చేయాలి. దీని వల్ల పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

బ్యాంక్ రుణాలు..

సొంతింటికి రుణ సాయం!



సొంతిల్లు ఏర్పాటు చేసుకోవడమనేది ఎవరికి మాత్రం ఇష్టముండదు చెప్పండి. అందుకే, పక్కా ప్రణాళికలను రచిస్తారు. కొత్తగా ఉద్యోగంలో చేరినవారైనా.. పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారైనా.. ఇల్లు తీసుకోవడం మీదే దృష్టి పెడతారు. వీరికి అండగా పలు సంస్థలు బ్యాంకు రుణాలిస్తూ కలను సాకారం చేసుకోవటంలో తోడ్పాటునందిస్తున్నాయి. గత రెండు దశాబ్దాలలో గృహ రుణాలు తీసుకునే భారతీయులు ఆలోచన విధానంలో చాలా మార్పులు వచ్చాయి. ఇల్లు అనే ఆలోచన రాగానే బ్యాంకుల వైపు చూస్తున్నారు. అయితే ఇందుకు కారణం లేకపోలేదు. నిజానికి వయసుతో సంబంధం లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. కొన్ని షరతుల నడుమ సొంతింటి కలను సాకారం చేసేందుకు సహకారం అందిస్తున్నాయి.ఉద్యోగం చేసేందుకు యువతరానికి ఈకాలంలో అనేక అవకాశాలు ఉండటంతో చిన్న వయస్సులో డబ్బు కూడబెట్టడం ప్రారంభిస్తున్నారు. 30-35ఏళ్ల వయసులోనే ఇల్లు కొనేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఇప్పటికే ఉద్యోగాలు చేసి రిటైర్‌మెంట్ వయసు వచ్చిన వాళ్లలో చాలా మంది ఇల్లు కొనేందుకు రుణాలు తీసుకుంటున్నారు. ఈ రెండు విభిన్న తరాలకు చెందిన వారితో పాటు మధ్య వయసు గల వారికి బ్యాంకులు గృహరుణాలు ఇస్తున్నాయి. నిజానికి యువతకు, మధ్య వయసు వారు రుణాలు తీసుకోవడటం సులువే. అయితే 45ఏళ్లకు పైబడిన వారికి పలు కారణాల రీత్యా కొన్ని పరిమితులతో రుణాలు అందిస్తున్నాయి. ఆలస్యంగా ఇంటి రుణాల కోసం ప్రయత్నించే వారి కోసం నిర్దిష్ట కాలానికి తిరిగి చెల్లించే విధంగా పలు అవకాశాలున్నాయి. ఏ వయసుకు చెందిన వారైనా రుణ అర్హత పొందాలంటే బ్యాంకులు కొన్ని విషయాలను ముఖ్యంగా పరిశీలిస్తాయి. దరఖాస్తుదారుల జీవన దశ, రుణ విమోచన, తిరిగి చెల్లించే సామర్థ్యం, ఆస్తి రకం, ఉద్యోగ చరిత్ర ఇలా వీటన్నింటితో పాటు వయస్సు ప్రధానంగా రుణాలను అందజేస్తాయి. రుణ గ్రహీలను వయసు ఆధారంగా ముఖ్యంగా మూడు వర్గాలుగా వర్గీకరించారు. 45నుంచి ఆపైన, 30-45, 20 ఆ ఆపైన వయస్సు వారు.

45ఏళ్లు దాటినా రుణం సులువే..

చాలా కంపెనీలు 60 ఏళ్ల వయస్సును రిటైర్‌మెంట్ వయసుగా నిర్ధారిస్తాయి. ఇదే పరిమితిని బ్యాంకులు కూడా పరిగణలోకి తీసుకొని రుణాలు తిరిగి చెల్లించేందుకు 60ఏళ్లుగా నిర్ణయించాయి. అయితే కొన్ని మినహాయింపులు ఇక్కడ ఉన్నాయి. అన్ని బ్యాంకులు రుణాలు చెల్లించేందుకు గరిష్ఠంగా 30ఏళ్ల పాటు సమయం ఇస్తాయి. ఒక వేళ 45ఏళ్లు, ఆ పైన ఉంటే మరో 15 సంవత్సరాల కాలంలో రుణం చెల్లించాలన్నమాట. ఇది పెద్ద భారమే అవుతుంది. రుణ దరఖాస్తు దారులు ఇలాంటి పరిమితుల గురించి ముందే తెలుసుకోవడం మంచిది. 50 బీపీఎస్ (100 బేసిస్ పాయింట్స్= ఒక శాతం)లో వచ్చే చిన్న తేడా కూడా చాలా పెద్ద వ్యత్యాసాన్ని కలిగిస్తుంది. బ్యాంకుకు నమ్మకస్తుడిగా ఉంటూ ఉత్తమ క్లయింట్ కావడం వల్ల మరింత ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. రుణం చెల్లించేందుకు ఎక్కువ కాలం నిర్దిశించుకోవడమే మంచిది. 45ఏళ్ల పైబడిన వయసు గల వారికి బ్యాంకు నిబంధన ప్రకారం రుణం తిరిగి చెల్లించేందుకు మరో 15 ఏళ్ల సమయం మాత్రమే ఉంటుంది. అంటే తక్కువ కాలపరిమితి, ఎక్కువ మొత్తంలో వాయిదా చెల్లింపు డబ్బు అన్నమాట. ఇతర నెలవారి ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ కాల పరిమితిని ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే తిరిగి రుణాన్ని సౌకర్యవంతంగా చెల్లించుకోవచ్చు. మీ గతకాలపు ఆస్తుల నుంచి వస్తున్న వడ్డీని, ఇంటి రుణంపై చెల్లించాల్సిన వడ్డీతో సరిపోల్చుకోవాలి. ఇదే సమయంలో ఇంటి రుణంతో పన్ను మినహాయింపులను పొందే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడిగా రుణాలు పొందటం మంచిది. దీని వల్ల అధిక ఈఎంఐ భారం నుంచి ఉపశమనం కలగడంతో పాటు, కుటుంబానికి పన్ను ప్రయోజనాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులు ఇందులో భాగస్వామ్యం అవటం వల్ల ఇంటి పెద్దకు ఉపశమనం కలుగుతుంది.

30-45ఏళ్ల వారికి మంచి అవకాశం..

ఈ వయస్సు మధ్యగల వారు రుణాలు పొందేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. ఎంతో కొంత ఆర్థిక స్థితికి చేరుకునే దశలో ఉండటమే ఇందుకు కారణం. రుణాలు తిరిగి చెల్లించే విషయంలో వీరికి కావల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. అయితే చాలా మంది తక్కువ కాలానికి చెల్లించేందుకే ఆసిక్తి చూపిస్తుంటారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేనప్పటికీ కొన్ని విషయాల్లో జాగ్రత్తగా వ్యవహించాలి. క్రెడిట్ స్కోర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇంటి రుణం కోసం దరఖాస్తు చేసుకోగానే బ్యాంకులు ముందుగా చూసేది క్రెడిట్ స్కోర్. మీరు చేస్తున్న ఆర్థిక లావాదేవీల చరిత్ర అన్నమాట. వ్యయాలు, ఆదా చేసే అలవాటు, రుణాలు, తిరిగి చెల్లింపులు ఇలా అన్ని విషయాల ఆధారంగా క్రెడిట్ స్కోర్ ఉంటుంది. ఇది బాగుంటేనే బ్యాంకులు సులువుగా రుణాలు ఇస్తాయి. అందుకే రుణాలు పొందాలనుకునే వారు సిబిల్‌లో క్రెడిట్ స్కోర్ తనిఖీ చేసుకోవాలి. ఇక ఉమ్మడి గృహ రుణ ఖాతా తీసుకోవడం ఈ వయసు వారికి మంచిది. ఎందుకంటే ఈఎంఐ చెల్లించేందుకు ఈ వయస్సులో సిద్ధంగా ఉండరు. ఇది ఒక్కరికి భారంగా కూడా ఉండే అవకాశం ఉంటుంది. అందుకే ఉమ్మడి రుణ ఖాతా తీసుకోవాలి. రెండు రకాల ఉమ్మడి గృహ రుణాలను బ్యాంకులు అంగీకరిస్తున్నాయి. జీవిత భాగస్వాముల మధ్య, కుమారుడు-తల్లిదండ్రుల మధ్య ఈ ఉమ్మడి ఖాతా తీసుకోవటం సాధ్యమవుతుంది.

20-30 ఏళ్ల వారికి ఇంటి ఆలోచన..

ఈ వయస్సులో ఉండి ఇంటి కోసం రుణాలు తీసుకునే వారు తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే మన దేశంలో చాలా మంది ఈ దశలోనే చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం కోసం ప్రయత్నిస్తారు. ఉద్యోగం చేసున్నప్పటికీ పెద్ద మొత్తంలో ఇంటి కోసం ఖర్చు చేయాలనే ఆలోచన చాలా తక్కువ మందికి ఉంటుంది. గత నాలుగేళ్ల నుంచి ఇంటి కోసం రుణం తీసుకునే వారి సంఖ్య స్వల్పంగా పెరుగుతున్నది. చిన్న వయసులోనే పెద్ద మొత్తంలో జీతాలు రావడం, యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహికవేత్తలుగా ఎదగటం వల్ల ఇది సాధ్యమవుతున్నది. చాలా బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు కనీస వయస్సును 21గా విధించాయి. ఆక్సిస్, టాటా క్యాపిటల్ వంటి కొన్ని మాత్రం 24, 25 ఏళ్లుగా నిర్ణయించాయి. అయితే రుణం తీసుకున్నాక స్థిరత్వం చాలా ముఖ్యం. ఒకవేళ చిన్న వయసులోనే బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే మీ ప్రొఫెషనల్ చరిత్రను పరిశీలిస్తాయి. అయితే ఉద్యోగం ఎన్ని సంవత్సరాల నుంచి చేస్తున్నావు, ఎంత స్థిరత్వంతో ఉన్నావు అనేది ముఖ్యాంశంగా పరిశీలిస్తాయి. ఒకవేళ ఉద్యోగ రీత్యా తరుచూ పట్టణాలు మారే వారికి బ్యాంకులు అంతగా ప్రాధాన్యం ఇవ్వవు.

నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 6 జనవరి 2018

రూ. 1000 కోట్ల హౌజింగ్ బాండ్ విడుదల

భారత దేశపు మొట్టమొదటి సోషల్ అఫర్డబుల్ హౌసింగ్ బాండ్‌ను 1000 కోట్ల రూపాయలకు ఇండియా బుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్(ఐబీహెచ్ఎఫ్ఎల్) విడుదల చేసింది. అందుబాటు ధరలోని గృహాలకు రుణాలను అందించడానికి ఈ మొత్తాలను వినియోగించనున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన ఇష్యూను భారతదేశపు ఐదవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ ఎస్ బ్యాంకు ఏర్పాటు చేసింది. ఈ బాండ్ ఇష్యూ కాలపరిమితి 5 సంవత్సరాలు. క్రిసిల్ దీనికి క్రిసిల్ ఏఏఏ రేటింగ్ ఇవ్వగా, ఐసీఆర్ఏ దీనికి ఐసీఆర్ఏ ఏఏఏ రేటింగ్ ఇచ్చింది. ఈ బాండ్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (బీఎస్ఈ)లలో లిస్ట్ చేశారు. ఈ ఇష్యూ ద్వారా వచ్చిన మొత్తాలను అందుబాటులోని గృహ రంగ అవసరాలకు తగినట్లుగా, పీఎంఏవై పథకం కింద అమలయ్యే చట్టాలకు లోబడి రుణాలను అందించడానికి వినియోగిస్తారు. ఈ బాండ్ ట్రాన్సాక్షన్ గురించి ఐబీహెచ్ఎఫ్ఎల్ వైస్ చైర్మన్, ఎండీ అండ్ సీఈఓ గగన్ బంగా మాట్లాడుతూ.. హోమ్ లోన్ టిక్కెట్ సైజ్ 25 లక్షల రూపాయలతో, అందుబాటులోని గృహ రుణాలను అందించడంపై ఇండియా బుల్స్ దృష్టి కేంద్రీకరించిందని అన్నారు. ఎస్‌బ్యాంక్-ఎండీ అండ్ సీఈవో రానా కపూర్ మాట్లాడుతూ.. భారతదేశంలో తొలి గ్రీన్ బాండ్‌ను 2015లో విడుదల చేయడం, స్థిరమైన ఫైనాన్సింగ్ మెకానిజం ఉపయోగించి అభివృద్ధి ప్రభావాన్ని చూపడం, హౌజింగ్ బాండ్ ఇష్యూ వంటి అంశాలు తమ నాయకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయన్నారు. భారత్‌లో సోషల్ బాండ్స్ మార్కెట్‌కు ఓ ఉత్ప్రేరకంగా పనిచేయడంతో పాటు, ఓ బెంచ్ మార్క్‌ను సృష్టించనుందన్నారు. అందరికీ గృహాలు అనే భారత ప్రభుత్వ లక్ష్యం సాకారం కావడంలో అందుబాటులోని గృహరంగం కీలకపాత్ర పోషించనుందని చెప్పారు. ఒక గొప్ప లక్ష్యం కోసం ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.



రియల్ ఎస్టేట్..

అందుబాటు గృహాల సంవత్సరం!

2018లో నగర రియల్ పయనమెటు?	అభివృద్ధి చెందే ప్రాంతాలేవి?	మార్కెట్‌కు పూర్వవైభవం వస్తుందా?

పెద్దనోట్ల రద్దుతో పతనం ప్రారంభమై.. 'రెరా' పెద్దపోటుతో ఉక్కిరిబిక్కిరి అయ్యి.. జీఎస్టీ వల్ల పూర్తిగా కుంగిపోయింది.. రియల్ రంగం! దీంతో, యావత్ భారతదేశంలోనే ప్రారంభమైన కొత్త ప్రాజెక్టులను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. అయితే, అత్యంత దయనీయ పరిస్థితుల నుంచి అంతే వేగంగా మళ్లీ పైకి లేచిన మార్కెట్.. దేశంలోనే ఏదైనా ఉందా అంటే.. హైదరాబాద్ రియల్ రంగమనే చెప్పాలి. అతిపిన్న రాష్ట్రమైనప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వినూత్న పథకాలు, సరికొత్త ప్రోత్సాహకాలు, మార్కెట్లో నూతనోత్తేజాన్ని నింపే నిర్ణయాలు.. వెరసీ నిర్మాణ రంగం త్వరగా కోలుకున్నది. మరి, ఈ రంగం 2018లో ఎటువైపు పయనించనున్నది?



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి.. సుస్థిరమైన దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధియే లక్ష్యంగా.. ప్రభుత్వం పని చేస్తున్నది. ఇందుకోసం మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి పెద్దపీట వేసింది. ఔటర్ రింగ్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. 2017లో మెట్రో రైలు పూర్తయ్యింది. ఈ ఏడాది రెండో విడత కూడా నగరవాసులకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తున్నది. మెట్రో రైలును రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయం దాకా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టు కింద భారీ స్థాయిలో నిధులను కేటాయించింది. ఇందుకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇవన్నీ పూర్తయితే.. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మెరుగవుతుంది. నివాసయోగ్యమైన నగరంగా మరింత ఖ్యాతినార్జిస్తుంది. రానున్న రోజుల్లో కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 2018లో దాదాపు 22,784 కోట్లను వెచ్చించనున్నది. గత మూడేండ్ల నుంచి ఇలాంటి అభివృద్ధికారక నిర్ణయాల వల్ల.. హైదరాబాద్‌లో రియల్ రంగం గణనీయంగా వృద్ధి చెందింది. దాదాపు డెబ్బయ్ ఐదు లక్షల చదరపు అడుగుల ఆఫీసు సముదాయాన్ని 2017లో వివిధ సంస్థలు తీసుకున్నాయని పలు అధ్యయన సంస్థలు వెల్లడించాయి. ఫలితంగా, ఆఫీసు అద్దెలు దాదాపు 23 శాతం పెరిగాయని ఓ సర్వేలో తేలింది.

పాలసీలా.. మజాకా..



తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న వినూత్న నిర్ణయాల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఉదాహరణకు డేటా సెంటర్ పాలసీనే తీసుకుందాం. డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తామని ప్రకటించింది. దీంతో, సరికొత్త డేటా సెంటర్లు నగరానికి విచ్చేస్తున్నాయి. ఇక, ముచ్చర్లలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్న ఫార్మాసిటీ వల్ల అధిక స్థాయిలో భారీ ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. దీంతో, ఆయా చుట్టుపక్కల ప్రాంతాల్లో అందుబాటు, మధ్యతరహా గృహాలకు మంచి గిరాకీ పెరుగుతుంది. సివిల్ ఏవియేషన్ హబ్ వల్ల బోయింగ్‌తో టాటా ఒప్పందం కుదుర్చుకోవడం, కొత్తగా లాజిస్టిక్స్ హబ్‌లను ఏర్పాటు చేయడం, శివార్లలో సరికొత్త శాటిలైట్ టౌన్‌షిప్పులను ప్రారంభించడానికి ప్రణాళికలు రచించడం వంటి కారణాల వల్ల శంషాబాద్, ఆదిభట్ల పరిసర ప్రాంతాలకు ఈ ఏడాది చక్కటి ఆదరణ ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, రాత్రికి రాత్రే ఇక్కడి ప్రాంతాల్లో రేట్లు మాత్రం పెరగవని నిపుణులు అంటున్నారు. సుస్థిరమైన ప్రగతి దిశగా ఈ ప్రాంతాలు వృద్ధి చెందుతాయని చెబుతున్నారు.

పెట్టుబడుల ప్రవాహం..



తెలంగాణ ఆవిర్భావ సమయంలో ఉన్న అనుమానాలు, అపోహలు ఆనతికాలంలోనే పటాపంచలయ్యాయి. ఫలితంగా, అధిక శాతం మంది పెట్టుబడిదారులు, కార్పొరేట్, బహుళ జాతి సంస్థలు మళ్లీ హైదరాబాద్ వైపు దృష్టి సారిస్తున్నాయి. ఇటీవల పిరమల్ క్యాపిటల్ సంస్థ హైదరాబాద్‌లోని వివిధ ప్రాజెక్టుల నిమిత్తం రూ.5,000 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఇదే కోవలోకి దేశ, విదేశీ సంస్థలు నగరంలోకి అడుగుపెడుతున్నాయి. అమెరికా కాన్సులేట్ ఆఫీసు, టీ హబ్ రెండో దశ, కార్పొరేట్ ఐటీ, ఆర్థిక సంస్థలు వంటివి ఇక్కడే ప్రారంభం కావడం వల్ల.. 2018లో నివాస సముదాయాలకు మంచి డిమాండ్ ఏర్పడే అవకాశముంది. తెల్లాపూర్‌లో టెక్నో సిటీ వంద ఎకరాల్లో అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధమవుతున్నదని తెలిసింది. ఇందుకు సంబంధించి అతిత్వరలో ప్రకటన కూడా వెలువడే అవకాశముందని తెలుస్తోంది. 2018లో నగరానికి చెందిన నిర్మాణ సంస్థల్లో అధిక శాతం అందుబాటు గృహాలకు అధిక ప్రాధాన్యత నిచ్చే అవకాశమున్నది. శివారు ప్రాంతాల్లో నిర్మాణ సంస్థలు గేటెడ్ ప్రాజెక్టులను ప్రారంభించడానికి పూర్తి స్థాయి ఆస్కారమున్నది. మెట్రో రైలు రాకతో ఉప్పల్, ఘట్‌కేసర్, నాగోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు ఆరంభం అవుతాయి. ఇతర ప్రాంతాల డెవలపర్లు ఈ మార్గానికి అటుఇటుగా నివాస సముదాయాలను ప్రారంభిస్తారని తెలిసింది. అయితే, ఎప్పటిలాగే పశ్చిమ హైదరాబాద్‌లో చిన్న ఫ్లాట్లకు పెద్ద గిరాకీ ఉంటుంది. కోకాపేట్, నార్సింగి, అప్పా జంక్షన్, బండ్లగూడ, కొల్లూరు వంటి ప్రాంతాలకు ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వచ్చే ఐదు నుంచి పదేండ్లలో విమానాశ్రయం నుంచి గచ్చిబౌలి దాకా గల ఓఆర్ఆర్‌కి అటుఇటు వైపు ప్రాంతాల్లో వృద్ధికి ఆస్కారముంది. మొత్తానికి, 2018లో రియల్ రంగంలో నయా జోష్ నింపుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

2018 అందుబాటు గృహాలదే..

అందుబాటు గృహాలకు 2017లో సరికొత్త ట్రెండ్ ప్రారంభమైంది. కేంద్రం చౌక గృహాలకు రాయితీలను ప్రకటించడంతో.. నిర్మాణ సంస్థలు మధ్యతరగతి ప్రజానీకాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండ్లను నిర్మించడం ప్రారంభించారు. ఈ పోకడ 2018 నాటికి మరింతగా పెరుగుతుంది. దీంతో, శివారు ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలకు సరికొత్త గిరాకీ ఏర్పడుతుంది. ధరలు అధికంగా ఉన్న నగరాల్లో ఫ్లాట్ల విస్తీర్ణాన్ని తగ్గించి కొనుగోలుదారులకు ఇండ్లను మరింత అందుబాటులోకి తెచ్చే అవకాశమున్నది. కో- వర్కింగ్ స్పేసెస్‌కు ఆదరణ ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. నాణ్యమైన ఆఫీసు స్థలాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

– డా. శమంతక దాస్, చీఫ్ ఎకనామిస్ట్, నైట్‌ఫ్రాంక్

2 పడక గదుల ఫ్లాట్లకు..

నవంబరు, డిసెంబరు నుంచి హైదరాబాద్‌లో రెండు పడక గదుల ఫ్లాట్లను కొనేవారి సంఖ్య పెరిగింది. ప్రధానంగా, రెండు పడక గదుల ఫ్లాట్లను తీసుకోవడం మీదే అధిక దృష్టి సారిస్తున్నారు. పైగా, ధర చదరపు అడుక్కీ రూ.100 నుంచి 200 పెరిగింది. ఈ ట్రెండ్ 2018లో కూడా కొనసాగుతుంది. నిర్మాణం పూర్తయ్యి, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉన్న ప్రాజెక్టులను తీసుకోవడానికి బయ్యర్లు ముందుకొస్తున్నారు. వీటిని కొనుగోలు చేస్తే జీఎస్టీ కట్టే అవసరం ఉండదు.

–రవీందర్‌రెడ్డి, ఎండీ, గౌతమీ డెవలపర్స్

నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం..

స్టీల్ ధరలు గతంతో పోల్చితే ఎక్కువగా పెరిగిపోయాయి. ఇది నిర్మాణానికయ్యే ఖర్చును తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా బిల్డర్లు ధరను పెంచాల్సిన అవసరం వచ్చింది. కొన్ని నెలలుగా ఇండ్లు, ఫ్లాట్ల ధరలు తీవ్రంగా పెంచేశారు. 2018 తొలి నెలల్లోనే ఈ మార్పు మరింత కనిపించే అవకాశం ఉంది. అమ్మకాల విషయంలో సప్లై, డిమాండ్ మధ్య వ్యత్యాసం తక్కువగా ఉండటంతో కొత్త ప్రాజెక్టులకు పెద్దగా అవకాశం ఉండటం లేదు. కాని నగరానికి పశ్చిమం వైపున ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు జోరుగా కొనసాగుతున్నది. ఐటీ కారిడార్ విస్తరిస్తుండటమే ప్రధాన కారణం.

– జైదీప్ రెడ్డి, డైరెక్టర్, అశోకా బిల్డర్స్

అమ్మకాలు పుంజుకుంటాయ్..

దేశంలోనే అత్యంత ప్రాధాన్యత గల నగరాల్లో హైదరాబాద్ ప్రముఖంగా నిలుస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయ్యింది. మెట్రో ఇప్పటికే అందుబాటులోకి వచ్చేసింది. ఈ ఏడాది రెండో విడత కూడా ప్రారంభం అవుతుంది. పైగా, పలు జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు ఈ ఏడాదే హైదరాబాద్‌లో ఆరంభమవుతాయి. జీఎస్టీ, రెరాలపై పూర్తి స్థాయి అవగాహన ఈ ఏడాది వచ్చేస్తుంది. పైగా, గృహరుణాలపై వడ్డీ రేట్లు తగ్గడానికి ఆస్కారముంది. కేంద్రం చౌక గృహాల విస్తీర్ణాన్ని కూడా పెంచింది. మొత్తానికి, 2018లో రియల్ రంగానికి ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతుంది. ఫలితంగా, ఇండ్ల అమ్మకాలు పుంజుకుంటాయి.

– రవికుమార్, డైరెక్టర్, సాకేత్ ఇంజినీర్స్



'రెరా'లో 20,000 ప్రాజెక్టులు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'రెరా' (రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ యాక్ట్) కింద దేశ వ్యాప్తంగా 20,000 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు నమోదైనట్లు కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నమోదు చేసుకున్న వాటిలో దాదాపు మహారాష్ట్ర నుంచి సగం కంటే ఎక్కువ ఉన్నట్లు వెల్లడించింది. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 2,000 ప్రాజెక్టులు రెరా చట్టం కింద నమోదు చేసుకోగా, గౌతమ్‌బుద్ధనగర్, నోయిడాలో 1,000, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలోనూ చెప్పుకోదగిన సంఖ్యలో ప్రాజెక్టులు నమోదైనట్లు స్పష్టం చేసింది. కొనుగోలుదారులు, డెవలపర్లు పూర్తి స్థాయిలో రెరా అమలు గురించి ఎదురు చూస్తున్నారని, ప్రాజెక్టులు ప్రారంభించేందుకు ఆయా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. రెరా వల్ల రియల్ రంగంలో పారదర్శకత వస్తుందని, అన్ని వ్యవహారాలు చట్టం పరిధిలోకి వస్తాయని తెలిపింది. దీని వల్ల కొనుగోలు దారులకు ప్రయోజనాలు ఉంటాయని స్పష్టం చేసింది. భవిష్యత్ కొనుగోలుదారులను, వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టం రూపొందింటం జరిగిందని తెలిపింది. ''కొనసాగుతున్న ప్రాజెక్టులకు మినహాయింపు ఇచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. జనవరి 2017 వరకు ఆమోదం పొందిన అన్ని ప్రాజెక్టులకు మినహాయింపు ఇచ్చింది. ఇలాగే ఉత్తర్‌ప్రదేశ్ కూడా మినహాయింపులు ఇచ్చింది. కర్ణాటకలో రెరా కింద నమోదు చేసుకున్న ప్రాజెక్టులు దాదాపు 60శాతం పూర్తి అయ్యాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర హర్యానా రెరా అమలులో పలు మినహాయింపులు ఇచ్చాయి. మొత్తం మీద 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రెరా చట్టం నిబంధనలను నోటిఫై చేశాయి. కాని ఇప్పటి వరకు కేవలం ఆరు మాత్రమే ప్రత్యేక రెగ్యులేషన్ అథారిటీని ఏర్పాటు చేశాయి.'' అని కేంద్రం ప్రకటించింది.

సుడోకు

డైలీ సుడోకు 91 సమాధానం

9	3	5	2	6	7	4	1	8
4	2	7	1	8	9	6	3	5
8	6	1	5	3	4	9	2	7
7	9	3	6	1	2	5	8	4
5	1	8	7	4	3	2	6	9
6	4	2	8	9	5	3	7	1
2	8	4	9	7	6	1	5	3
3	7	6	4	5	1	8	9	2
1	5	9	3	2	8	7	4	6

డైలీ సుడోకు -92

	7					5	4	
			9					8
			5		1	9		
							1	6
1	6	5				4	8	7
7	4							
		3	2		9			
2					8			
	5	7					9	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ఆహ్లాదానికి ఇండోర్ ప్లాంట్స్..



ఇంటికి హంగులు తెచ్చేందుకు ఎంత శ్రమించినా ఒక్కోసారి ప్రయోజనం ఉండదు. కాని మొక్కలను పెంచుకోవటం వల్ల ఇంటి లుక్ వెంటనే మారిపోతుంది. అందంతో పాటు, వాతావరణాన్ని ఆహ్లాదంగా ఉంచుతాయి. అందుకే నగరవాసులు ఎక్కువగా ఇండోర్ ప్లాంట్స్‌ను పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎలాంటి మొక్కలు పెంచుకోవాలనే దానిపై కాస్త అవగాహన ఉంటే మంచిది. మొక్కల ఎత్తు, పెరుగుదల, వ్యాప్తి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. సూర్యరశ్మి అందకుంటే మొక్కలు బతకవు. కాని కొన్ని మొక్కలు మాత్రం జీవిస్తాయి. ఇంటి ముందు భాగంలో, హాలులో, గది మూలల్లో మొక్కలు ఏర్పాటు చేసుకోవటం వల్ల అతిథుల మెప్పు పొందవచ్చు. అన్ని పట్టణాల్లో నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ అనేక రకాల మొక్కలు వివిధ ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

టైల్స్‌తో రెట్టింపు అందం



ఇంట్లోకి అడుగుపెట్టే వారి చూపు ముందుగా పడేది టైల్స్ మీదే. వివిధ ఆకృతుల్లో, రంగుల్లో ఉండే టైల్స్ వల్ల ఇంటి అందం రెట్టింపు అవుతుంది. అందుకే ఇంటి యజమానులు వీటి ఎంపికలో జగ్రత్త వహిస్తారు. ఖర్చు ఎక్కువైనా భరించి మంచి టైల్స్‌ని ఇంట్లో ఏర్పాటు చేసుకుంటారు. లివింగ్ రూం, బెడ్ రూం, బాత్‌రూం, కిచెన్‌లకు సరిపడే విధంగా పలు రకాల టైల్స్ అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ వ్యాపారులు డిమాండ్‌కు సరిపడా సరఫరా చేస్తున్నారు. ఇతర రాష్టాలు, దేశాలకు చెందిన టైల్స్ ఇప్పుడు ఇక్కడే లభిస్తున్నాయి. మరింత విభిన్నంగా కావాలనుకునే వారి కోసం త్రీడీ టైల్స్ కూడా వచ్చేశాయి. సాధరణ రకం నుంచి అత్యున్నత రకం వరకు హైదరాబాద్ మార్కెట్‌లో ఉన్నాయి. ఖర్చు కాస్త ఎక్కువైనా సరే అనుకుంటే ఇంటి అందాన్ని సులువుగా పెంచుకోవచ్చు.



చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా రవితేజతో సెల్ఫీ తీసుకున్న నటీనటులు..

అపూర్వ కలయికలో..?



కమల్‌హాసన్

తమిళ చిత్రసీమలో మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు రంగం సిద్ధమైందా? కమల్‌హాసన్, విక్రమ్ కలయికలో ఓ సినిమా రాబోతుందా? అంటే ఔననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. విక్రమ్ కథానాయకుడిగా రాజ్‌కమల్ ఫిల్మ్స్ పతాకంపై కమల్‌హాసన్ ఓ సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజేష్.ఎం. సెల్వా ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. విభిన్న కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో విక్రమ్‌తో పాటు కమల్‌హాసన్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. తొలుత ఈ చిత్రానికి నిర్మాతగానే వ్యవహరించాలని కమల్‌హాసన్ భావించినట్లు తెలిసింది. కానీ దర్శకుడు చెప్పిన కథలోని వైవిధ్యత నచ్చడంతో ముఖ్య పాత్రలో నటించడానికి సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు సమాచారం. కమల్‌హాసన్, విక్రమ్ ఒకే ఊరికి చెందినవారు కావడం గమనార్హం. కమల్‌హాసన్ స్ఫూర్తితోనే విక్రమ్ సినిమాల్లోకి వచ్చారు. ఈ ఇద్దరి కలయికలో వస్తున్న ఈ సినిమాపై కోలీవుడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



విక్రమ్

సెల్ఫీతో మొదలైంది!

కథానాయకుడు రవితేజ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కల్యాణ్‌కృష్ణ కురసాల దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'మా సంస్థ నుంచి వస్తున్న తొలి చిత్రమిది. కల్యాణ్‌కృష్ణ చేసిన రెండు చిత్రాలు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లుగా తెరకెక్కించారు. కల్యాణ్‌కృష్ణ మార్కు ఫ్యామిలీ అంశాలతో పాటు రవితేజ మార్కు మాస్ అంశాల్ని మిళితం చేసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది. హీరో రవితేజ పాత్ర చిత్రణ కొత్తగా వుంటుంది. ఈ సినిమాతో మాళవిక శర్మను కథానాయికగా పరిచయం చేస్తున్నాం. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ముఖేష్.



మాళవిక శర్మ

రంగస్థలంపై ఆటపాట



పూజా హెగ్డే

సృజనాత్మకత మేళవించిన నవ్యమైన కథాంశాల్ని ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు దర్శకుడు సుకుమార్. అదే సమయంలో ఆయన సినిమాల్లోని ఐటెంసాంగ్స్ అంటే ప్రేక్షకులు ఎంతో ఆసక్తిని కనబరుస్తారు. ప్రత్యేక గీతాల్ని జనరంజకంగా తెరకెక్కిస్తారని సుకుమార్‌కు పేరుంది. ఆయన దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'లో కూడా హుషారెత్తించే ఐటెం సాంగ్‌ను తెరకెక్కించబోతున్నారు. ఇందులో బెంగళూరు సోయగం పూజా హెగ్డే నర్తించనుంది. ఈ గీతాన్ని ఈ నెల 8 నుంచి హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చిత్రీకరించబోతున్నారు. సుకుమార్ గత చిత్రాల తరహాలోనే 'రంగస్థలం'లోని ఐటెంసాంగ్ యువతను ఉర్రూతలూగిస్తుందని చిత్ర బృందం చెబుతున్నది. 1985 నాటి ఓ పల్లెటూరి నేపథ్యంలో వినూత్న కథ, కథనాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సమంత కథానాయిక. రామ్‌చరణ్ పాత్ర చిత్రణ మునుపెన్నడూ చూడని విధంగా నవ్య పంథాలో సాగుతుందని చిత్ర బృందం చెబుతున్నది. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన స్పందన లభించింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ సి.హెచ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జగపతిబాబు, అనసూయ, ఆది పినిశెట్టి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. సుకుమార్–రామ్‌చరణ్ కలయికలో తొలిసారి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి.



'ఏ టూ ఏ' పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

అమీర్‌పేట్ టూ అమెరికా

తేజస్, పల్లవిదొర, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఏ టూ ఏ'. 'అమీర్‌పేట్ టూ అమెరికా' ఉపశీర్షిక. రాధా మీడియా పతాకంపై కొమండూరి పద్మజ, కొమండూరి మదన్ నిర్మిస్తున్నారు. భానుకిరణ్ చల్లా దర్శకుడు. ఈ చిత్ర తొలి పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసివుద్దీన్ విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ 'సీఎం కేసీఆర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లతో కూడిన ఫస్ట్ పోస్టర్ బాగుందని అతిథులు ప్రశంసించడం ఆనందంగా ఉంది. నవతరం మనోభావాలకు అద్దంపట్టే చిత్రమిది. ఈ చిత్రానికి కర్త, కర్మ, క్రియ అన్నితానై నిలిచారు రామ్‌మోహన్ కొమండూరి. త్వరలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.

జీవితమే రంగులరాట్నం!

'నా తొలి చిత్రం 'ఉయ్యాలా జంపాలా' చేస్తున్న సమయంలో దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఆ సినిమాతో నన్ను హీరోగా పరిచయం చేసిన అన్నపూర్ణ సంస్థలో చేస్తున్న రెండవ చిత్రం 'రంగుల రాట్నం'. ఇలాంటి పెద్ద సంస్థలో పనిచేయడం ధైర్యంగా వుంటుంది. సినిమాలో నేను తప్ప అంతా కొత్తవాళ్లే అయినప్పటికీ ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకున్నారు' అన్నారు రాజ్ తరుణ్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగుల రాట్నం'. శ్రీరంజని దర్శకురాలిగా పరిచయమవుతున్నది. సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజ్ తరుణ్ హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.



రాజ్‌తరుణ్

సుప్రియ ఓ రోజు ఫోన్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు. స్క్రిప్ట్ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే అంగీకరించాను. సినిమాలో మిడిల్‌క్లాస్ అబ్బాయిగా కనిపిస్తాను. బాధ్యతలు తక్కువగా వుంటాయి. లుక్ చాలా సహజంగా కొత్తగా వుంటుంది. అందరిలాగే సరదాగా కనిపించినా ప్రత్యేకంగా వుంటాను. అబ్బాయిలకు, అమ్మాయిలకు కనెక్ట్ అవుతుంది. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశాను. జీవితం రంగుల రాట్నం లాంటిది. ఇందులో హీరో లైఫ్ కూడా అంతే. అందుకే ఈ టైటిల్ పెట్టాం. ఇదొక స్వచ్ఛమైన ప్రేమకథ. మదర్ సెంటిమెంట్‌తో పాటు ప్రేమ జంట మధ్య వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. తొలి కాపీ చూశాను. అందరిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది. బరువు, బాధ్యతలున్న ఓ అమ్మాయి అల్లరి చిల్లరగా తిరిగే ఓ యువకుడి మధ్య ప్రేమ ఎలా పుట్టింది? ఆ తరువాత వారి జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఈ చిత్ర ప్రధాన కథాంశం.

ఆ పట్టింపులు నాకు లేవు....

ఆడా, మగా అనే పట్టింపులు నాకు లేవు. ఎవరైనా దర్శకులే. స్క్రిప్ట్ రాసిన తరువాత వారి దృక్కోణంలో కొన్ని ఆలోచనలు వుంటాయి. దానికి తగ్గట్లుగా సినిమాని తెరకెక్కిస్తారు. ఈ సినిమా ద్వారా శ్రీరంజని దర్శకురాలిగా పరిచయమవుతున్నది. ఆమె ప్రముఖ దర్శకుడు సెల్వారాఘవన్ వద్ద పలు చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేసింది. సినిమాను ఎలా తీయాలో ఆమెకు బాగా తెలుసు. సినిమా అంటే చాలా పాషన్ వున్న యువతి. ఓ దర్శకురాలికి ఉండాల్సిన అర్హతలన్నీ ఆమెలో వున్నాయి. శ్రీరంజని నేను అనుకున్నదానికి మించి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించింది.

పోటీ అనుకోవడం లేదు..

ప్రతీ సంక్రాంతికి పెద్ద సినిమాలు విడుదలవుతుంటాయి. విజయాన్ని సాధిస్తుంటాయి. సినిమాల మధ్య పోటీ అనేది ఒక్క సంక్రాంతి సీజన్‌లోనే కాదు ప్రతీ శుక్రవారం ఈ పోటీ వుంటుంది. మిగతా సినిమాలకు నా సినిమా పోటీ అనుకోవడం లేదు. కుటుంబ సమేతంగా రెండున్నర గంటల పాటు హాయిగా ఎంజాయ్ చేసే చిత్రమిది. ఈ సంక్రాంతికి విడుదలవుతన్న సినిమాలన్నీ సక్సెస్ కావాలి. త్వరలో సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసి విడుదల తేదీని తెలియజేస్తాం.



నయనతార

కర్తవ్య సాధనలో

నయనతార ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'అరమ్'. గోపి నైనర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఆర్. రవీంద్రన్, శరత్‌మరార్ 'కర్తవ్యం' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'రాజకీయ అంశాలతో ముడిపడిన సందేశాత్మక చిత్రమిది. నయనతార జిల్లా కలెక్టర్ పాత్రలో కనిపిస్తుంది. ఓ ఊరి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఆమె ఎలాంటి పోరాటానికి సిద్ధపడింది? ఈ క్రమంలో ఆ కలెక్టర్‌కు ఎదురైన పరిణామాలేమిటన్నది ఈ చిత్ర ఇతివృత్తం. తమిళంలో నయనతార కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలిచిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. నిర్మాణానంతర కార్యక్రమాల్ని పూర్తిచేసి త్వరలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. విఘ్నేష్, రమేష్, వినోదిని వైద్యనాథన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, సంగీతం: జిబ్రాన్.

వారిని అస్సలు పెళ్లాడను!



తాప్సీ

క్రీడాకారులు, సినీ తారల మధ్య ప్రేమాయణాలు చిత్రసీమకు కొత్తేమీకాదు. గతంలో క్రికెట్‌తో పాటు భిన్న క్రీడల్లో ప్రసిద్ధిగాంచిన పలువురు ఆటగాళ్లు స్టార్‌హీరోయిన్స్‌తో ప్రేమాయణాల్ని కొనసాగించడమే కాకుండా పెళ్లికూడా చేసుకున్నారు. తాజాగా విరాట్‌కోహ్లి, అనుష్కశర్మ పెళ్లితో మరోమారు ఆటగాళ్లు, తారల ప్రేమ వ్యవహారాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అనుష్క శర్మ బాటలోనే తాప్సీ అడుగులు వేయబోతుందని సమాచారం. తన ప్రియుడు ఒలింపిక్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ మాథిస్ బోను తాప్సీ పెళ్లిచేసుకోబోతున్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై తాప్సీ సమాధానమిస్తూ ఏ క్రీడాకారునితో తాను ప్రేమలో లేనని, ఎవరిని పెళ్లి చేసుకోవడం లేదని చెప్పింది. ఒకవేళ స్పోర్ట్స్‌పర్సన్‌ను పెళ్లిచేసుకున్న తర్వాత అతను కెరీర్‌లో రాణించలేకపోతే ప్రియురాలే అందుకు కారణమంటూ సదరు నాయికపై విమర్శల్ని గుప్పిస్తుంటారు. ఆ పరిస్థితిలో వుండటం తనకు ఇష్టం లేదని తాప్సీ చెప్పింది. 'ప్రేమ గురించి ఏం మాట్లాడినా అందరూ దానినే హైలైట్ చేస్తూ కథనాలు ప్రచురిస్తున్నారు. అందుకే ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడటం లేదు. ఒకవేళ భవిష్యత్తులో పెళ్లాడినా.. క్రీడాకారులు, సినిమాలకు సంబంధించిన వారిని, వ్యాపారవేత్తలను మాత్రం అస్సలు వివాహమాడను' అని తెలిపింది తాప్సీ.

తారామణి సందేశం



ఆండ్రియా, వసంత్‌రవి

అంజలి, ఆండ్రియా, వసంత్‌రవి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'తారామణి'. డి.వి. సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. రామ్ దర్శకుడు. ఫిబ్రవరి నెలాఖరున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ఆధునిక యువత మనస్తత్వాలకు దర్పణంలా నిలిచే చిత్రమిది. సోషల్‌మీడియా మాయలో పడి నవతరం ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనే సందేశాత్మక కథాంశంతో రూపొందింది. రొమాన్స్, ప్రేమ అంశాలతో పాటు భావోద్వేగాలకు ప్రాధాన్యముంటుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఎ' సర్టిఫికెట్ లభించింది. తమిళంలో చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం మంచి వసూళ్లను సాధించింది. తెలుగులో పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్‌రాజా.

8 నుంచి సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్

పాల్గొననున్న ఆరు రాష్ట్రాల విద్యార్థులు

హాజరుకానున్న గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ఈ నెల 8 నుంచి 12 వరకు సౌత్ ఇండియా సైన్స్‌ఫేర్ (ఎస్ఐఎస్ఎఫ్)ను ఘనంగా నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే ఈ సైన్స్‌ఫేర్‌ను డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రారంభిస్తారని, ముగింపు కార్యక్రమానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హాజరవుతారని చెప్పారు. సైన్స్‌ఫేర్‌లో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 650 మందికి పైగా విద్యార్థులు, 200 మంది వాలంటీర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రం నుంచి దాదాపు 50 చొప్పున 300 సైన్స్ విశేషాలతో ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆరోగ్యం, ఆహారభద్రత, వ్యర్థ్యాల నిర్వహణ, జలసంరక్షణ, రవాణా, కమ్యూనికేషన్, డిజిటల్ టెక్నాలజీ సొల్యూషన్స్, మ్యాథమెటికల్ మోడలింగ్ తదితర అంశాలపై వినూత్న ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. జాతీయ స్థాయి సైంటిస్టులు కూడా హాజరవుతారన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సైన్స్ ఫేర్‌ను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ డైరెక్టర్ కిషన్ పేర్కొన్నారు.

పెద్దపులుల గణనపై నేడు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని అటవీప్రాంతాల్లో ఈ నెల 22 నుంచి జరుగనున్న పెద్దపులులు, వన్యప్రాణుల గణనలో పాల్గొంటున్నవారికి శనివారం అరణ్యభవన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. వారం పాటు జరిగే ఈ గణనలో రాష్ట్ర అటవీశాఖ అధికారులు, సిబ్బందితోపాటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొంటారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరుగుతున్న గణనకు అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని అటవీశాఖ ప్రిన్సిపల్ సీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా శుక్రవారం ఆదేశించారు.

గత ఏడాది మహారాష్ట్ర స్మగ్లర్ల నుంచి కాగజ్‌నగర్ బెజ్జూరు అడవుల్లో స్వాధీనం చేసుకున్న పెద్దపులి చర్మం మాయమైంది. దీనికి సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండగా చర్మం మాయం కావడం కలకలం రేపింది. దీనిపై ప్రాథమికంగా దర్యాప్తు జరిపిన అధికారులు సెక్షన్ ఆఫీసర్ వేణుగోపాల్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

పాతికేండ్ల తర్వాత తోబుట్టువుల చెంతకు

- లేడనుకున్న సోదరుడు తిరిగి రావడంతో సంతోషం
- చేరదీసి అప్పగించిన ఖమ్మంజిల్లా అన్నం ఫౌండేషన్



పోలీసులు, అన్నం ఫౌండేషన్ సభ్యులతో చున్నీమియా

యాచారం: చనిపోయాడనుకున్న వ్యక్తి పాతికేండ్ల తరువాత ఇంటికి తిరిగొచ్చాడు. ఖమ్మం జిల్లాలో అనాథగా చెత్తకుప్పల్లో, దుర్భరస్థితిలో జీవనం కొనసాగించి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో చివరకు తన కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు. ఏమైపోయాడో అనుకున్న అన్న తిరిగిరావడంతో ఐదుగురు చెల్లెళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. శుక్రవారం యాచారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ చంద్రకుమార్ సమక్షంలో ఖమ్మం జిల్లాకు చెందిన అన్నం ఫౌండేషన్ సభ్యులు ఆ వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. సీఐ చంద్రకుమార్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన చున్నీమియా (60) సుమారు పాతికేండ్ల క్రితం మతిస్థిమితంలేని స్థితిలో ఇంటినుంచి వెళ్లిపోయాడు. ఖమ్మం జిల్లాలో దుర్భరస్థితిలో గడుపుతున్న మియాను నాలుగు నెలల క్రితం అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ చూసి తన ఆశ్రమానికి తీసుకెళ్లారు. ఇటీవల చున్నీమియా జ్ఞాపకశక్తి మెరుగుపడడంతో తనపేరుతోపాటు స్వస్థలం నల్లవెల్లి యాచారం అని వారికి వివరించాడు. చున్నీమియా తల్లిదండ్రులు చనిపోయారని, ఐదుగురు చెల్లెండ్లు ఉన్నట్టు తెలిసింది. దాంతో వారి ఆచూకీ తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌లో చున్నీమియాను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేణుగోపాల్, ముస్తఫా పాల్గొన్నారు.



శుక్రవారం మింట్‌కంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంటెంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి. చిత్రంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి తదితరులు

24 గంటల కరంట్ ఘనత మనదే

విద్యుత్ హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం.. శాసనసభాపతి మధుసూదనాచారి ప్రశంస

తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంటెంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం 24 గంటలపాటు కరంట్ సరఫరా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని దేశంలోనే పేరుప్రతిష్ఠలను సాధించిందని శాసనసభాపతి ఎస్ మధుసూదనాచారి అన్నారు. కరంట్ ఉద్యోగులు అహోరాత్రులు శ్రమించి తెలంగాణ ప్రజలకోసం అంకితభావంతో కృషిచేసినందువల్లనే ఈ అద్భుతం సాధ్యమయిందని అన్నారు. శుక్రవారం మింట్‌కాంపౌండ్‌లో జరిగిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంటెంట్స్ స్టాఫ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో విద్యుత్తు ఉద్యోగులు ఒక్కతాటిపై నిలిచి తమ శ్రమనంతా ధారపోసి 24 గంటలపాటు విద్యుత్తును అందిస్తున్నారన్నారు. సౌరశక్తి విద్యుత్తు ఉత్పాదనలో తెలంగాణ మిగతా రాష్ట్రాలకన్నా ముందువరుసలో ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. ఇదివరకు కరంట్ ఉంటే వార్త అయ్యేదని, ఇప్పుడు కరంట్ పోతేనే వార్తగా పరిగణించాల్సిన రోజులు వచ్చాయని అన్నారు. ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల పేరు చెప్తేనే రైతులు కోపం తెచ్చుకునేవారని, ఇప్పుడు విద్యుత్ ఉద్యోగులకు గొప్ప గౌరవం లభిస్తున్నదని అన్నారు. తెలంగాణ రైతుల జీవితమంతా కరెంటు పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. వచ్చే సంవత్సరం నుంచి ఇతర రాష్ట్రాలకు కరంట్ సరఫరా చేయాలని, మొదట పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ వస్తే కరంట్ ఉండదని విమర్శించినవారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. విద్యుత్ ఉద్యోగుల శ్రమకు, పట్టుదలకు మంచి గుర్తింపు లభించనున్నదని ఆయన పేర్కొన్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో త్వరలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.



శుక్రవారం విశ్వేశ్వరయ్యభవన్‌లో తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్. చిత్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి , టీఈఈ అధ్యక్షుడు శివాజీ, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్

విద్యుత్‌శాఖపై విమర్శలను సహించం

మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్..

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందించడం ఎందుకని.. కాంగ్రెస్ నాయకులు విమర్శించడం హాస్యాస్పదమని రాష్ట్ర ఎస్సీ, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. విద్యుత్ ఇంజినీర్లు సమిష్టి కృషితో 24 గంటల విద్యుత్‌ను సాధించారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు రాష్ట్ర పరిస్థితులు, విద్యుత్ రంగం పట్ల పరిపూర్ణమైన అవగాహన ఉందన్నారు. విద్యుత్‌శాఖ మీద విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం దిశా నిర్దేశంతో విద్యుత్‌రంగం పురోభివృద్ధి సాధించిందన్నారు. శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ 2018 డైరీ ఆవిష్కరణను మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందాక కూడా సొంత రాష్ట్రానికి ఏదో ఒకటి చేయాలన్న ఉద్దేశంతో సీఎండీ ప్రభాకరరావు విద్యుత్ రంగం అభివృద్ధికి కృషి చేస్తుంటే కాంగ్రెస్ నేతలు విమర్శించడం సరికాదన్నారు. ఆర్థికశాఖమంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఇప్పుడు చర్చంతా.. తెలంగాణలో వ్యవసాయానికి 24 విద్యుత్‌పైనే జరుగుతుందన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలు కృషి చేయడం వల్లే అనూహ్యమైన విజయాలను సాధించగలుగుతున్నామన్నారు. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ శివాజీ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మధుసూదన్‌రెడ్డి, అడ్వైజర్ జానయ్య, సంపత్, రవి, పున్నా, లింగమూర్తి, విజయేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, తుల్జారాంసింగ్, రామేశ్వర్‌శెట్టి పాల్గొన్నారు.

అవును.. తప్పచేశా!

- బుల్లితెర యాంకర్ ప్రదీప్
- డ్రంక్ అండ్ డ్రైవ్ కౌన్సెలింగ్‌కు హాజరవుతానంటూ సెల్ఫీవీడియో విడుదల



బేగంపేట/బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: దురదృష్టవశాత్తు తప్పు చేశానని, తనలా మరెవరూ చేయొద్దని టీవీ యాంకర్ ప్రదీప్ చెప్పారు. నిబంధనల ప్రకారం పోలీసుల కౌన్సెలింగ్‌కు హాజరవుతానని గురువారం రాత్రి ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ నెల 1వ తేదీ తెల్లవారుజామున మోతాదుకు మించి మద్యంతాగి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో కారునడుపుతుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో యాంకర్ ప్రదీప్ పట్టుబడ్డ విషయం తెలిసిందే. అతడు గత మంగళవారం కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉండగా, నాటినుంచి ట్రాఫిక్ పోలీసులకు, మీడియాకు అందుబాటులో లేడు. ముందుగా అంగీకరించిన షూటింగ్‌లకు హాజరుకావాల్సి ఉండడంతో కౌన్సెలింగ్‌కు హాజరుకాలేదని, నిబంధనల ప్రకారం ప్రతి ప్రొసీడింగ్‌కు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని గురువారం రాత్రి విడుదలచేసిన సెల్ఫీ వీడియోలో ప్రదీప్ తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడి కౌన్సెలింగ్‌కు హాజరుకానివారిపై చార్జిషీట్ దాఖలు చేస్తామని అదనపు ట్రాఫిక్ డీసీపీ అమర్‌కాంత్‌రెడ్డి హెచ్చరించారు. యాంకర్ ప్రదీప్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ నిరాకరణ



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌కు చుక్కెదురయింది. ఆయన బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం కొట్టేసింది. ఖైరతాబాద్‌లోని సేవ్‌టెంపుల్ సంస్థకు చెందిన ఆలయవాణి రేడియోలో పనిచేసే మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో గజల్ శ్రీనివాస్‌ను ఈ నెల 2న పంజాగుట్ట పోలీసులు అరెస్ట్‌చేసిన విషయం తెలిసిందే. న్యాయస్థానం ఆయనకు ఈ నెల 12 వరకు రిమాండ్ విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు. శ్రీనివాస్‌ను కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు కస్టడీ పిటిషన్ వేయగా.. గురువారం న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో తనకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ శ్రీనివాస్ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై శుక్రవారం న్యాయస్థానం విచారణ చేపట్టింది. శ్రీనివాస్‌కు బెయిల్ ఇవ్వవద్దని, బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశమున్నదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విన్నవించారు. ఆయన వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. కేసులో నిందితురాలిగా ఉన్న పార్వతిని ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది.

ఎన్సీఎస్ షుగర్స్‌పై సీబీఐ కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని ఎన్సీఎస్ షుగర్స్ లిమిటెడ్, విశాఖపట్నంలోని సెంట్రల్ వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ)కు చెందిన కొందరు అధికారులపై సీబీఐ హైదరాబాద్‌లో కేసు నమోదు చేసింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ప్రాజెక్టు అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ (పీఈసీ) లిమిటెడ్‌ను రూ. 82.11 కోట్ల మేరకు సీడబ్ల్యూసీ సహాయంతో ఎన్సీఎస్ మోసం చేసినట్టు సీబీఐ ఆరోపించింది. పీఈసీ పలు బడావ్యాపారసంస్థలకు క్రెడిట్ ఇస్తూ సహకరిస్తుంది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన ఎన్సీఎస్ కంపెనీ 3లో సింగపూర్ నుంచి షుగర్ రామెటీరియల్ కొనుగోలుకు పీఈసీని సంప్రదించింది. పీఈసీ ఇచ్చిన క్రెడిట్ ద్వారా మెటీరియల్ కొనుగోలు చేసి విశాఖపట్నంలోని సీడబ్ల్యూసీ గోదాంలో నిల్వ చేసింది. కొద్ది రోజుల తర్వాత ఐదు చెక్కులను పీఈసీకి ఇచ్చింది. అయితే ఆ చెక్కులు చెల్లలేదు. దీనిపై పీఈజీసీ ఢిల్లీలో కోర్టులను ఆశ్రయించింది. పరిశీలించిన న్యాయస్థానం వివాదం పరిష్కారం అయ్యేంత వరకు గోదాంలోని సరుకును తరలించవద్దని ఆదేశించింది. అయినప్పటికీ 18-5-2016 నుంచి 23-5-2016 మధ్య కాలంలో సీడబ్ల్యూసీ సహాయంతో ఎన్సీఎస్ నిర్వాహకులు చక్కెరను తరలించారు. గోదాం నిల్వల్లో రూ. 82.11 కోట్ల విలువచేసే సరుకు తగ్గినట్టు అధికారులు తరువాత గుర్తించారు. దీనిపై ఢిల్లీలో ఉన్న పీఈసీ కంపెనీ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ గతనెల 28వ తేదీన సీబీఐకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ తరువాత సీబీఐ అధికారులు హైదరాబాద్‌లోని ఎన్సీఎస్ షుగర్స్ సంస్థ ఎండీ ఎన్ నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ కన్నబాబు, విశాఖపట్నంలోని సీడబ్ల్యూసీ అధికారులు లక్ష్మణ్‌రావు, రాజేంద్ర ప్రసాద్, కృష్ణామోహన్‌రావుతో పాటు పలువురిపై వివిధ సెక్షన్ల కింద కేసు (24(ఏ)/2017) నమోదు చేశారు.

రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకం

గ్రూప్-1 అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్



శుక్రవారం గ్రూప్- 1 అధికారుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంత్‌నాయక్ తదితరులు

హైదరాబాద్/ సుల్తాన్‌బజార్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ గ్రూప్-1 అధికారులు బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం డైరీని శుక్రవారం బంజారాహిల్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంత్‌నాయక్, శశికిరణాచారి, రఘుప్రసాద్, మహేందర్, అలోక్‌కుమార్, వేణుమాధవ్‌రెడ్డి, అరవిందరెడ్డి, శశిధర్, జితేందర్‌రెడ్డి, వెంకట్, శరత్‌చంద్ర, అనితాదాస్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా దేశానికే ఆదర్శం

రాష్ట్ర ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశంసలు



తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య

తెలుగుయూనివర్సిటీ: వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్ అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ప్రశంసించారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ ప్రాంగణంలో గల ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో శుక్రవారం తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రూపొందించిన క్యాలండర్, డైరీని ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహృదయంతో విద్యుత్‌రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు ఉన్నతస్థాయి కమిటీలు వేస్తే.. కొందరు కావాలనే కోర్టులో పిటిషన్లు వేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని బీసీలకు అన్యాయం జరుగకుండా ఉండాలంటే రాష్ట్రప్రభుత్వం పార్టీలకతీతంగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని కోరారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 23 లక్షల పంపుసెట్లకు నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడం వెనుక అధికారులు, సిబ్బంది కృషి ఎనలేనిదని కొనియాడారు. ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ విధానాన్ని మిగితా రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ చైర్మన్ ఏ గోపాలరావు, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు హరివర్ధన్, యాదగిరి, రాజేందర్, మధుసూదన్ పాల్గొన్నారు.



సచివాలయంలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఏజీ రమణప్రసాద్, బద్రినాథ్, మధు

వైద్యసిబ్బంది పదోన్నతులపై దృష్టి సారించండి

వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శికి ప్రభుత్వ వైద్యుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ)ల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బంది పదోన్నతులపై దృష్టిసారించాలని వైద్య ఆరోగ్యశాఖ నూతన ముఖ్యకార్యదర్శి శాంతకుమారిని ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) అధ్యక్షుడు పల్లం ప్రవీణ్‌కుమార్ కోరారు. వైద్యఆరోగ్య శాఖ నూతన ముఖ్య కార్యదర్శిగా ఆమె శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను కలిసి ప్రవీణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో టీజీజీడీఏ కోశాధికారి లల్లూప్రసాద్‌రాథోడ్, ఉపాధ్యక్షుడు నరహరి తదితరులు ఉన్నారు

విద్యుత్ అవసరాలకు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి

- అన్ని ఏరియాల జీఎంలతో సింగరేణి సీఎండీ శ్రీధర్ సమీక్ష



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న మూడు నెలల్లో అనుకున్న లక్ష్యాల మేరకు బొగ్గు ఉత్పత్తి.. రవాణా చేయడానికి సిద్ధం కావాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో ఏరియాల వారిగా జీఎంలు, వివిధ విభాగాల అధికారులు, సంస్థ డైరెక్టర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. 9 నెలల కాలంలో సాధించిన ప్రగతిని సమీక్షించిన ఆయన మిగిలిన 3 నెలల కాలంలో రోజుకు 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరిపి నిర్దేశిత వార్షిక లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. 9 నెలల్లో 420 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని.. మార్చి నాటికి మరో 200 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన మూడు నెలల్లో 193 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. డిసెంబర్ నెలాఖరుకు 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించామని మిగిలిన మూడు నెలల కాలంలో రోజుకు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీని తొలిగించి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. త్వరలో ప్రారంభించనున్న గనులపై ఆయన సంబంధిత ఏరియా జనరల్ మేనేజర్లతో సమీక్షించారు. గనుల ప్రారంభానికి సంసిద్ధంగా ఉండాలని, సంబంధిత పనులను కాల పరిమితికి లోబడి పూర్తి చేయాలని ఆదేశించారు.

కోనేరు మధుకు హైకోర్టులో ఊరట

ఎమ్మార్ కేసు నుంచి విముక్తి కల్పిస్తూ ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో కోనేరు మధుకు శుక్రవారం ఉమ్మడి హైకోర్టులో ఊరట లభించింది. అతనిపై సీబీఐ నమోదుచేసిన కేసును జస్టిస్ బీ శివశంకర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఆరోపణలకు తగిన ఆధారాలను సీబీఐ చూపలేకపోయిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కోనేరు రాజేంద్రప్రసాద్ కుమారుడు అయినంత మాత్రాన కోనేరు మధును దోషిగా భావించలేమని పేర్కొంటూ అతడిని కేసుల నుంచి విముక్తి చేసింది. కోనేరు మధుకు చెందిన బ్యాంక్ ఖాతాల్లో డబ్బు జమను ఆధారాలుగా చూపిస్తున్నారని.. అయితే డబ్బు డిపాజిట్ మధు ఆదేశాల మేరకు జరిగిందని ఆధారాలను మాత్రం సీబీఐ చూపలేకపోయిందని న్యాయస్థానం పేర్కొన్నది.

మార్కెట్ విలువను కోర్టులు నిర్ణయించవు

ఆ అధికారం ప్రభుత్వానిదేనన్న హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూముల మార్కెట్ విలువల నిర్ణయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోజాలవని ఉమ్మడి హైకోర్టు పేర్కొన్నది. నిబంధనలకు అనుగుణంగా మార్కెట్ విలువను నిర్ధారించే అధికారం కేవలం సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికే ఉంటుందని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సిద్దిపేట జిల్లా వేములఘాట్‌లో స్వచ్ఛందంగా భూములు ఇచ్చినవారికి ఎకరాకు రూ.6 లక్షలు చెల్లిస్తూ, 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరణకు మాత్రం కేవలం రూ.85 వేలుగా నిర్ధారిస్తూ జిల్లా కలెక్టర్ జారీచేసిన సవరణలను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సింగిల్‌జడ్జి న్యాయస్థానం జారీచేసిన ఆదేశాలను ద్విసభ్య ధర్మాసనం నిలిపివేసింది. ఈ ఆదేశాలతో మార్కెట్ విలువను రూ.6 లక్షలుగా నిర్ధారించినట్టు అవుతుందని, ఈ వ్యవహారంలో కోర్టు నిర్ణయాలు చేయడం సరికాదని తెలిపింది.అభ్యంతరాలుంటే సింగిల్‌జడ్జి వద్దే స్టేవెకేట్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

ఆయుత ధర్మదీక్షకు హైకోర్టు అనుమతి

షరతులు విధించే అవకాశం పోలీసులకు ఉన్నదని స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించతలపెట్టిన ఆయుత ధర్మదీక్షకు అనుమతి ఇవ్వాలని జిల్లా పోలీసులకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అయితే దీక్ష నిర్వహించే విషయంలో నిర్వాహకులకు షరతులు విధించే అధికారం పోలీసులకు ఉంటుందని న్యాయస్థానం స్పష్టంచేసింది. ఆయుత ధర్మదీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై సీపీఎస్ ఉద్యోగుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ ఎస్వీ భట్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ దొంగల పట్టివేత

- స్పందించిన కమిషనర్ సీవీ ఆనంద్.. గోదాం ఇంచార్జిపై వేటు
- నాగర్‌కర్నూలు జిల్లాలో మిల్లర్ల నుంచి కొనుగోళ్లు బంద్

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: రేషన్ బియ్యాన్ని కొంతమంది మిల్లర్లు తిరిగి పౌరసరఫరాల శాఖకే అమ్మిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. రేషన్‌బియ్యం రీసైక్లింగ్‌పై పౌరసరఫరాలశాఖ నిఘా బృందం ద్వారా సమాచారం అందుకున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ నేరుగా రంగంలోకి దిగి బియ్యం దొంగలను రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గోదాం ఇంచార్జిపై వేటువేశారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులైన నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మిల్లర్ల నుంచి దొడ్డుబియ్యం (స్టేట్ పూల్ రైస్), సన్న బియ్యం కొనుగోలును నిలిపివేశారు. సన్నబియ్యం నాణ్యతపై తనిఖీలు చేపట్టగా సిరిసిల్ల జిల్లాలో నాణ్యత లేని సన్నబియ్యాన్ని అప్పగిస్తున్నారనే విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 10 శాతానికి మించి బ్రోకెన్‌రైస్ ఉండకూడదు. కానీ ఇక్కడ 35 శాతం వరకు ఉంది. ఈ విధంగా 11 వేల బస్తాలలో 35 శాతం మేరకు బ్రోకెన్‌రైస్ ఉందని గుర్తించారు. ఈ బియ్యాన్ని సరఫరా చేసిన మిల్లర్లను కమిషనర్ గట్టిగా మందలించారు. అలాగే 11 వేల బియ్యం బస్తాల స్థానంలో నాణ్యత కలిగిన బియ్యాన్ని అందజేయాలని ఆదేశించారు. రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ తమ సభ్యులపై నిఘా వేయకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. పేదల బియ్యాన్ని దిగమింగడానికి ప్రయత్నం చేస్తే సహించబోమని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లర్ల మిల్లింగ్, తదితర చార్జీలు నిలిపివేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టడంతోపాటు మిల్లులను సీజ్ చేయడానికి ఏమాత్రం వెనుకాడబోమని సీవీ ఆనంద్ హెచ్చరించారు.

టీఆర్టీ దరఖాస్తుల సవరణకు తుదిగడువు 11

రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)కి దరఖాస్తుచేసిన అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సవరించుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ వెల్లడించారు. దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పీడీఎఫ్ సవరించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గడువుతీరిన తర్వాత అభ్యంతరాలు స్వీకరించబోమని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు తుదిగడువు ఆదివారంతో ముగుస్తున్న సంగతి తెలిసిందే.

రిపబ్లిక్ డే సందర్భంగా ఖైదీలకు క్షమాభిక్ష!

- విధివిధానాలు, మార్గదర్శకాలపై ఉన్నతాధికారుల సమావేశం
- 250 మంది ఖైదీల విడుదలకు అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని రాష్ట్రంలో ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే అంశంపై కసరత్తు కొనసాగుతున్నది. ఈ అంశంపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది శుక్రవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. మూడుగంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో జైళ్లశాఖ డీజీ వీకే సింగ్, ఐజీ ఆకుల నరసింహ, న్యాయ నిపుణులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను నెల కిందటే జైలుశాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. గత ఏడాది క్షమాభిక్ష ద్వారా 261 మంది విడుదలయ్యారు. ఈసారి కూడా 250 మంది ఖైదీలకు క్షమాభిక్ష లభించే అవకాశం ఉన్నదని విశ్వసనీయంగా తెలిసింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులైన ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. వారంలో ఈ అంశానికి సంబంధించిన కసరత్తు పూర్తిచేసి మార్గదర్శకాలను జీవో రూపంలో విడుదల చేయనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఉన్న జైళ్లల్లో ప్రస్తుతం 5,500 మంది ఖైదీలు ఉన్నారు. ఖైదీల ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అర్హులైన ఖైదీలకు క్షమాభిక్ష పెడుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో క్షమాభిక్ష అంశంలో అప్పటి ప్రభుత్వాలు అనేక విమర్శలను ఎదుర్కొన్నాయి. రాష్ట్రప్రభుత్వం గత ఏడాది విమర్శలకు తావివ్వకుండా ఉత్తర్వులు జారీచేసింది.

భరత్‌భూషణ్‌కు తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారం



తెలుగు యూనివర్సిటీ: మూడు దశాబ్దాలుగా ఫొటోగ్రఫీ, పెయింటింగ్‌లో తెలంగాణ ముద్రను ప్రదర్శిస్తున్న జీ భరత్‌భూషణ్‌కు తెలుగు విశ్వవిద్యాలయం 2016 ఏడాదికిగాను విశిష్ట పురస్కారం ప్రకటించింది. సాహిత్యం, లలితకళలు, సాంస్కృతికరంగాల్లో ప్రతిభ కనబర్చినవారికి ఈ అవార్డు ఇస్తారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జాతర్లు, ఆచార వ్యవహారాలను ఊరూరా తిరిగి తన కెమెరాలో బంధించిన భరత్‌భూషణ్ ఏడు వ్యక్తిగత ఫొటో ప్రదర్శనలు నిర్వహించారు. ఆయన తీసిన బతుకమ్మ ఫొటోలు ప్రపంచఖ్యాతిని సంపాదించాయి. రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డు ఇచ్చింది. 1953లో వరంగల్ జిల్లాలో జన్మించిన భరత్‌భూషణ్ హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ టెక్నాలజీ వర్సిటీ నుంచి ఫొటోగ్రఫీలో డిప్లొమా పొందారు. తన తొలి సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ని 1973లో వరంగల్‌లో నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిపై పలు వ్యాసాలు రాశారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న చాకలి ఐలమ్మ ఏకైక ఫొటో, కాళోజీ ప్రసిద్ధమైన ఫొటో తీసింది భరత్ భూషణే. ఈ అవార్డుతోపాటు రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం అందజేయనున్నట్టు తెలుగువర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ తెలిపారు.

నీటిపారుదలశాఖలో పదోన్నతులు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నీటిపారుదలశాఖలో పదోన్నతుల జాబితాకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, నీటిపారుదలశాఖ ఈఎన్సీ (పరిపాలన)కు లిఖితపూర్వక ఆదేశాలు ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతుల జాబితాను విడుదల చేయగా దీనిపై కొందరు ఇంజినీర్లు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు దీనిపై తాత్కాలిక నిలుపుదలకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. పునర్విభజన చట్టం ప్రకారం పదోన్నతుల జాబితాను ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ రూపొందించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో జోన్-5, 6కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల జాబితా, ఆయా అధికారులకు సంబంధించిన వివరాలు పంపితే తాము పదోన్నతుల జాబితాను రూపొందిస్తామని ఏపీ జలవనరులశాఖ కార్యదర్శి.. తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎస్కే జోషికి ఇటీవల లేఖ రాశారు. 1978 పీఎస్సీ (పబ్లిక్ సర్వీస్ కమిషన్) నుంచి 2007 పీఎస్సీ వరకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, సాంకేతిక అధికారుల పదోన్నతుల జాబితాను రూపొందించేందుకు ఏపీ జలవనరులశాఖ సుముఖత వ్యక్తం చేయడంతో ప్రభుత్వం పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పదోన్నతుల జాబితాను రూపొందించేందుకుగాను ఈ అంశాలపై అవగాహన ఉన్న ఒక అధికారిని రాష్ట్ర నీటిపారుదలశాఖలో డిప్యూటేషన్‌పై నియమించి.. జోన్-5, 6లోని ఏఈఈ, ఏఈ, టీవోలకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్, చార్జి వెరిఫికేషన్ నివేదికలు తయారుచేసి ఏపీ జలవనరులశాఖకు సమర్పించాలని సూచించింది. ఆ నివేదికను ప్రభుత్వానికి కూడా ఇవ్వాలని కోరింది.



శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనార్టీ కమిషన్ చైర్మన్ మహమ్మద్ కమరుద్దీన్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కూడా ఉన్నారు.

చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో భారీ ఊరట

- పౌరసత్వంపై కేంద్రహోంశాఖ జారీచేసిన ఉత్తర్వులు ఆరువారాలపాటు నిలిపివేత
- పూర్తి వివరాలు కేంద్రానికి సమర్పించాలని ఆదేశం
- కేసు విచారణ ఈ నెల 24కు వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత పౌరసత్వం వ్యవహారంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు ఉమ్మడి హైకోర్టులో భారీ ఊరట లభించింది. పౌరసత్వం రద్దుపై కేంద్రప్రభుత్వం ఉత్తర్వులను ఆరువారాలపాటు హైకోర్టు జస్టిస్ ఎస్వీ భట్ నేతృత్వంలోని ధర్మాసనం నిలిపివేసి మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ అంశంపై మళ్లీ ఈనెల 24న వాదనలు వింటామని స్పష్టంచేసింది. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన తర్వాత ఈ వ్యవహారంపై లోతైన విచారణ చేపట్టాల్సి ఉన్నదని భావిస్తున్నట్టు పేర్కొంటూ తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదావేసింది. ఈలోగా పూర్తి వివరాలను, రికార్డులను సమర్పించాలని కేంద్రప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. 365 రోజులు దేశంలో ఉండి పౌరసత్వం పొందాలన్న హోంశాఖ వాదనలకు ప్రతివాదనలు వినిపించిన చెన్నమనేని రమేశ్ తరుపు న్యాయవాదులు.. 2008లో రమేశ్‌కు వర్తించిన 1955 పౌరసత్వ చట్టంలో 365 రోజులు 'నిరంతరం' భారతదేశంలో ఉండాలన్న నిబంధన లేదని, ఆ నిబంధన 2009లో చట్టం మార్పులలో మాత్రమే ఉందని వివరించారు. దీనిపై ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. చెన్నమనేని రమేశ్ భారత పౌరసత్వాన్ని గతేడాది డిసెంబర్ నెలలో కేంద్రం రద్దు చేసింది. పౌరసత్వం రద్దుపై గత ఆగస్టు 31న హోంశాఖ తీర్పునిచ్చినా డిసెంబర్ నెలలో రమేశ్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దానిని హోంశాఖ అప్పుడు కొట్టివేసింది. ఏడాదిపాటు వరుసగా దేశంలో ఉండాలనే నిబంధనను రమేశ్ పాటించలేదని తమ విచారణలో తేలిందని, అందుకని ఆయన పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నామని హోంశాఖ ప్రకటించింది. అయితే కేంద్ర హోంశాఖ ఇచ్చిన తీర్పు లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉందని రమేశ్ వ్యాఖ్యానించారు. హోంశాఖ తీర్పుపై తాజాగా హైకోర్టులో వ్యాజ్యం దాఖలుచేశారు. దీనిపై కేంద్రప్రభుత్వం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్, ఆది శ్రీనివాస్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. కేంద్రహోంశాఖ ఉత్తర్వులను ఆరువారాలపాటు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.



హోంశాఖ నియమించిన విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే కేంద్రం తుది నిర్ణయం తీసుకున్నదని, అసలు ఆ నివేదిక తప్పుల తడక అని న్యాయ నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారని రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసత్వ చట్టంలో ఉన్న విషయాలను సమగ్రంగా చూడాలే కానీ సాంకేతికంగా చూడటం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఏడాదిపాటు దేశంలో ఉండాలనే నిబంధన 2009 ఫిబ్రవరి 25 నుంచి అమల్లోకి వచ్చిందని, కానీ తనకు 2009 ఫిబ్రవరి 3నే పౌరసత్వం వచ్చిందని రమేశ్ పేర్కొన్నారు. తనకు పౌరసత్వం ఇచ్చిన తరువాత విధించిన నిబంధన తనకు వర్తించదన్నారు. రివ్యూపిటిషన్‌లో తాను సమగ్ర సమాచారం ఇచ్చినా కేంద్రం మరోసారి పొరపాటు అవగాహనకు వచ్చిందని, న్యాయం కోసం తాను మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తానని రమేశ్ గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

బడిపిల్లలకు బ్యాగులేని రోజు

మొదటిపేజీ తరువాయి...

విజయవంతంగా అమలవుతున్నదని, ఆ పద్ధతిలోనే తెలంగాణలో కూడా అమలుచేసే అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లతోపాటు ఇతర బోర్డుల నుంచి అఫిలియేషన్ పొందిన ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధంచేస్తామని చెప్పారు. స్కూల్ బ్యాగ్‌ల మోత బరువును శాశ్వతంగా నివారించేందుకు మరో కీలక అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను ప్రతిరోజూ ఇంటికి తీసుకెళ్లకుండా.. పాఠశాలలోనే భద్రపరిచే విధంగా ర్యాక్‌లను ఏర్పాటుచేసే ఆలోచన కూడా ఉన్నదని కిషన్ వెల్లడించారు. అవసరమైతే ఈ విషయంపై ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, బ్యాగ్‌ల మోత తగ్గించటంపై అందరి సహకారం కోరుతామని పేర్కొన్నారు. అయితే ఇప్పటికే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ర్యాకులు/లాకర్లు/బీరువాల విధానం అమలుచేస్తున్నాయి. అన్ని పాఠశాలల్లో కూడా ఇలాంటి విధానం అమలుచేయటం వల్ల చిన్నపిల్లలకు స్కూల్ బ్యాగ్‌లను మోసేభారం తగ్గుతుందన్న అభిప్రాయంతో విద్యాశాఖ అధికారులున్నారు.

స్కూల్ బ్యాగు విరామాన్ని స్వాగతిస్తాం

రాష్ట్రంలోని అన్నిరకాల పాఠశాలల్లో వారంలో ఒకరోజు స్కూల్ బ్యాగ్ విరామం ప్రతిపాదనను తాము స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఈ విధానం అన్ని స్కూళ్లల్లో కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థుల శారీరక పరిస్థితి కొంత మెరుగుపడే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో స్కూల్ బ్యాగ్‌ల కోసం ర్యాకులు లేదా బీరువాలను ఏర్పాటుచేయడం సాధ్యంకాదని చెప్పారు. దీనివల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ధనికవర్గానికి చెందిన తల్లితండ్రులు ఈ విధానాన్ని స్వాగతించినప్పటికీ, పేదలు తమ పిల్లలను బ్యాగు, పుస్తకాలు లేకుండా స్కూల్‌కు పంపే విధానంపై ఆలోచన చేస్తారని పేర్కొన్నారు.



బీసీ సంక్షేమంపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జోగురామన్న, చందూలాల్

ఇది సంక్షేమనామ సంవత్సరం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- విద్యాపరంగా సీఎం ఇప్పటికే అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు
- బీసీ సంక్షేమంపై సమీక్షలో మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అందరికి సంక్షేమపథకాలు అందిస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. 2018-19 సంక్షేమ నామ సంవత్సరమని, కులవృత్తుల, అణగారినవర్గాల సంవత్సరమని ఆయన పేర్కొన్నారు. విద్యాపరంగా విప్లవాత్మకమైన మార్పులను సీఎం కేసీఆర్ ఇప్పటికే తీసుకొచ్చారని చెప్పారు. పేదపిల్లలకు ఒక్క రూపాయి ఖర్చులేకుండా నాణ్యమైనవిద్యను, ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడేవిధంగా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. సచివాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమంపై మంత్రుల సమావేశం జరిగింది. మంత్రులు జోగు రామన్న, జగదీశ్‌రెడ్డి, చందూలాల్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ గతంలో పేదలకిచ్చే స్కీమ్స్ బ్యాంకుల సహకారం లేకపోవడం వల్ల కాగితాలకే పరిమితమయ్యేవని, సొమ్ము మధ్యదళారులకు తప్ప అసలైన లబ్ధిదారులకు చేరేది కాదని చెప్పారు. అందుకే బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా అర్హులకు డబ్బులు అందించేందుకు కేసీఆర్ ప్రణాళికలు తయారుచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే గొల్లకురుమలు, మత్స్యకారులకు పెద్దఎత్తున ప్రభుత్వ సహాయం అందుతున్నదని, అదేవిధంగా బీసీలలో ఉన్న అనేక కులాలకు ఏంచేస్తే బాగుపడుతారనే అంశంపై ఇప్పటికే 50 సార్లు మంత్రి జోగు రామన్న అధ్యక్షతన సమావేశం జరిపామని చెప్పారు. అసెంబ్లీ స్పీకర్ కూడా అన్నికులాలతో అసెంబ్లీ వేదికగా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకున్న విషయాన్ని ఆయన ఇక్కడ గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితోనే బంగారు తెలంగాణ సాధ్యమనేది కేసీఆర్ ఆలోచన అంటూ, వెనుకబడిన తరగతులకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో సీఎం చాలా ఉద్వేగంగా మాట్లాడారని గుర్తుచేశారు. ఒకరోజు కాకపోతే పదిరోజులైనా చర్చించి ఈ వర్గాల బాగుకోసం జీవోలు ఇస్తామని సీఎం చెప్పారన్నారు. కేసీఆర్ ఆదేశాలతో జోగు రామన్న నాయకత్వంలో అన్ని కులసంఘాలతో, అధికారులతో సమావేశం నిర్వహించి నివేదిక సిద్ధం చేశామని, దీన్ని సీఎంకు సమర్పిస్తామని తెలిపారు. సంచారజాతులవారికి లక్ష రూపాయల రుణం అందిస్తామని చెప్పారు. నాయీ బ్రాహ్మణులు కొత్తగా దుకాణాలు పెట్టుకోవడానికి, ఉన్న షాపులను ఆధునీకరించడానికి నిధులు ఇస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు చాకిరీ చేసేదగ్గర మనవాళ్ళు ఉంటున్నారని, డబ్బులు వచ్చేదగ్గర బడాబాబులు ఉంటున్నారని అన్నారు. ఇకమీదట పనిచేసేవారికి పూర్తి ఆదాయం అందాలి అనేదే తమ లక్ష్యమని మంత్రి ఈటల నొక్కిచెప్పారు. ముందుగా సంచార జాతులు, ఆ తరువాత రజక, నాయీబ్రాహ్మణ, విశ్వకర్మలకు వృత్తులవారీగా నిధులు కేటాయించేందుకు నివేదిక సిద్ధం అయ్యిందన్నారు. సీఎం ఆమోదం తెలిపిన వెంటనే ఈ నెలలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు.



తెలంగాణ సినిమా దశ దిశ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు

సినిమా అద్భుత మాధ్యమం

'తెలంగాణ సినిమా దశదిశ' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: సినిమా అద్భుతమైన, ప్రభావంతమైన మాధ్యమమని రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రముఖ కవి, సినీ విమర్శకుడు వారాల ఆనంద్ రచించిన 'తెలంగాణ సినిమా దశ దిశ' పుస్తకాన్ని మంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ రంగంలో వారాల ఆనంద్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ప్రముఖ కవి వఝుల శివకుమార్, జీవీ రామకృష్ణారావు, ఉప్పుల బాలరాజు, అన్వేశ్, ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు కృపాదానం, జడ్పీటీసీ సిద్ధం వేణు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16 నుంచి ఎస్సెస్సీ ప్రీఫైనల్స్

- ఏప్రిల్ 2 నుంచి 9 వరకు సమ్మెటివ్-2 పరీక్షలు ..షెడ్యూళ్లు విడుదల చేసిన ఎస్సీఈఆర్టీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పరీక్షల సీజన్ వచ్చేస్తున్నది. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ నిర్ణయించింది. ఏప్రిల్ 2 నుంచి 9 వరకు (1వ తరగతి నుంచి 9వ తరగతి) సమ్మెటివ్-2 పరీక్షలు జరుగనున్నాయి. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బీ శేషుకుమారి శుక్రవారం షెడ్యూళ్లను విడుదల చేశారు. విద్యాక్యాలండర్ ప్రకారం పరీక్షల తేదీలను ప్రకటించామని ఉన్నతాధికారులు తెలిపారు.

రాబడిని పెంచి ప్రోత్సాహకాలు పొందండి

- ఉద్యోగులతో వాణిజ్యపన్నులశాఖ కార్యదర్శి సోమేశ్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీఎస్టీ, వ్యాట్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి రూ.42 వేల కోట్లకు పైగా రాబడిని సాధించాలని వాణిజ్యపన్నులు, ఆబ్కారీశాఖల ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఖజానాకు రాబడిని పెంచి ప్రోత్సాహకాలు పొందాలని సూచించారు. వాణిజ్యపన్నులశాఖ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవానికి జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్ర రాబడి స్థిరంగా ఉన్నదని చెప్పారు. ఇంకా రాబడిని పెంచడానికి అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరమున్నదని తెలిపారు. ఈ సందర్భంగా సోమేశ్‌కుమార్ వాణిజ్యపన్నులశాఖ టీజీవో డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అనిల్‌కుమార్, అడిషనల్ కమిషనర్లు అమృతలక్ష్మీ, లక్ష్మీనారాయణ, వాణిజ్యపన్నులశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు టీ వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి సంధ్యారాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రౌతు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

తెలంగాణలో హెల్త్ వర్సిటీ ఏర్పాటు చేయండి

- కేంద్రానికి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ వినతి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రానికి ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని కేటాయించాలని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కేంద్రాన్ని కోరారు. శుక్రవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని ఆయన లేవనెత్తారు. ప్రపంచంలోనే తొలిసారి అనస్తీషియా ఇచ్చింది హైదరాబాద్‌లోనేనని ఆయన గుర్తుచేశారు. సర్వ రోగాలను నియంత్రణలో ఉంచే శక్తి యోగాకు ఉందని, అందుకే యోగాను తప్పనిసరి చేయాలని కోరారు. యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన కృషిని ఎంపీ కొనియాడారు. బూర నర్సయ్యగౌడ్ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని ఆయుష్ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి.. వేతనాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమలో మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ , ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సిలివేరు ప్రభాకర్, టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, రాష్ట్ర నాయకులు కేవీ నారాయణ, సంఘకో కన్వీనర్ మందుల వెంకటయ్య, శారద, ఐలయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇండ్లలోని చెత్తను ఆటో ట్రాలీల ద్వారా తరలించే ఆటో డ్రైవర్ల నుంచి రూ.1,80,000 లంచాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కురుకుల కొండప్పతోపాటు మరో ఇద్దరు జీహెచ్ఎంసీ తరఫున మోతీనగర్‌లో ఆటో ట్రాలీలు నడిపిస్తారు. చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. వీరు మోతీనగర్ పరిధిలో చాలాకాలంగా పనిచేస్తున్నారు. వీరిని ఇతర ప్రాంతాలకు మార్చాలంటూ శానిటరీ రిసోర్స్ పర్సన్ (ఎస్ఎఫ్‌ఏ) లింగయ్య పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వీరు ప్రస్తుతం పనిచేస్తున్న ఏరియాలోనే కొనసాగించేందుకు లింగయ్య రూ.1,80,000 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ డబ్బును లింగయ్య శుక్రవారం సాయంత్రం బోరబండలోని ఓ హోటల్‌లో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

సిరిసిల్లలో డబుల్ స్పీడ్‌తో నిర్మాణం

- రాజన్న సిరిసిల్ల జిల్లాకు 6,616 ఇండ్లు మంజూరు
- మోడల్ విలేజ్‌గా రూపుదిద్దుకోనున్న మండెపల్లి
- 27 ఎకరాల్లో జీ+2 పద్ధతిలో 1,260 ఇండ్ల నిర్మాణం
- మంత్రి కేటీఆర్ చొరువతో శరవేగంగా పనులు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు పట్టణాభివృద్ధి, మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న ఇండ్లను వచ్చే జూన్‌లోగా పూర్తి చేసేందుకు అధికారులు టార్గెట్ పెట్టుకోగా అంతకంటే ముందుగానే అందుబాటులోకి తేవాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. జిల్లా మొత్తానికి 6,616 ఇండ్లు మంజూరు కాగా ఇందులో 13 మండలాల్లోని 211 గ్రామ పంచాయతీలకుగాను 5,356 ఇండ్లు, సిరిసిల్ల అర్బన్‌కు 1,260 ఇండ్లను కేటాయించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి వద్ద 27 ఎకరాల్లో జీ+2 పద్ధతిలో నిర్మిస్తున్నారు. ఇక్కడ పనులు స్లాబ్‌ల వరకు పూర్తికావచ్చాయి. మండెపల్లిని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు.

రూ.76.23 కోట్లతో జీ+2 భవనాలు

సిరిసిల్ల అర్బన్‌లో గూడులేని పేదల కోసం 1,260 ఇండ్లు మంజూరు చేయించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి వద్ద విశాలమైన ప్రభుత్వ భూమిలో 27 ఎకరాలు కేటాయించారు. హైదరాబాద్ తరహాలో అపార్టుమెంట్ల మాదిరిగా జీ ప్లస్‌టూ పద్ధతిలో నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో ఒక్కో ఫ్లాట్‌కు రూ.5.60 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మొత్తం ఇండ్లకు రూ.76.23 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 60 శాతం నిర్మాణాలు పూర్తి కావచ్చాయి.

ఇండ్లన్నీ ఒకేచోట ఉండేలా..

సిరిసిల్ల అర్బన్‌కు మంజూరైన ఇండ్ల నిర్మాణాలకు తంగళ్లపల్లి మండలం మండెపల్లి వద్ద సర్వే నంబర్ 377లో 27 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంపిక చేశారు. వేములవాడ నియోజకవర్గ ప్రజల కోసం మండలంలోని నాంపల్లి వద్ద సర్వే నంబర్లు 504, 367లలో ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. పేదల కోసం కేటాయించే డబుల్ బెడ్‌రూం ఇండ్లన్నీ ఒకేచోట నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. నవతేజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ నిర్మాణ పనులు చేపట్టింది.

మోడల్ విలేజ్‌గా మండెపల్లి..

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంతో తంగళ్లపల్లి మండలం మండెపల్లి ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకోనున్నది. మొదటగా సిరిసిల్ల అర్బన్ ప్రజల కోసం మండెపల్లి వద్ద జీప్లస్‌టూ పద్ధతిలో నిర్మిస్తున్నారు. ఇక్కడ 1260 ఇండ్లు నిర్మిస్తున్నందున దాదాపు ఐదువేల పైచిలుకు జనాభా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇది పెద్ద గ్రామంగా మారనున్నందున ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకుగాను అంగన్‌వాడీ, ప్రాథమిక, వెటర్నరీ దవాఖానలు, ప్రాథమిక పాఠశాల, పార్కులు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన రహదారులను నిర్మిస్తున్నారు. గురువారం మంత్రి మండెపల్లిలో ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఆకర్షణీయంగా నిర్మించాలని సూచించారు. నాణ్యతలో రాజీపడొద్దని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ ఏడాది జూన్‌లోగా ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అందించాలన్నది లక్ష్యం కాగా అంతకుముందే పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఆ దిశగా అధికారులు కూడా ముందుకుసాగుతున్నారు.





రాజన్న సిరిసిల్లజిల్లాకు మంజూరైన మొత్తం డబుల్ బెడ్‌రూం ఇండ్లు 6,616

13 మండలాల్లోని 211 గ్రామ పంచాయతీలకుగాను	5,356
సిరిసిల్ల అర్బన్‌కు	1,260

తంగళ్లపల్లి మండలం మండెపల్లి వద్ద విశాలమైన ప్రభుత్వ భూమిలో 27 ఎకరాల్లో అపార్టుమెంట్ల మాదిరిగా జీ ప్లస్‌టూ పద్ధతిలో నిర్మాణం

60% ఇప్పటి వరకు పూర్తయిన పనులు

ఒక్కో ఫ్లాట్‌కు ఖర్చు 5.60 లక్షలు

మొత్తం ఇండ్లకు ఖర్చు 76.23 కోట్లు

మోడల్ విలేజ్‌గా మండెపల్లి

అంగన్‌వాడీ, ప్రాథమిక, వెటర్నరీ దవాఖానలు, ప్రాథమిక పాఠశాల, పార్కులు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు.

వాణిజ్య

సెన్సెక్స్	నిఫ్టీ
34,154	10,559
184	54

ముడి చమురు (బ్రెంట్) 67.52 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)

24 క్యారెట్లు	29,575
22 క్యారెట్లు	29,425
వెండి (కిలో)	38,725

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	57.64	66.83
బహ్రెయిన్ దినార్	156.09	178.87
కువైట్ దినార్	173.71	216.25
సౌదీ రియాల్	15.32	18.17
యూఏఈ దిర్హామ్	15.69	18.34

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	86.00
రిటైల్ లైవ్	108.00
డ్రెస్డ్	157.00
స్కిన్‌లెస్	178.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	395-00
రంగారెడ్డి	395-00
మెదక్	395-00
కరీంనగర్	397-00
వరంగల్	397-00
రిటైల్ ప్రైస్	4-55

WWW.NTNEWS.COM నమస్తే తెలంగాణ శనివారం 6 జనవరి 2018 [హైదరాబాద్] 13

రూ.4కే 1జీబీ డాటా

■ నెలవారీ టారిఫ్‌లు రూ.50 తగ్గించి, డాటా పరిమితి పెంచిన జియో

న్యూఢిల్లీ, జనవరి 5: దేశీయ టెలికం మార్కెట్లో సునామీలా దూసుకెళ్తున్న రిలయన్స్ జియో ఇప్పుడు మరో పెను సంచలనానికి తెర లేపింది. రోజుకు 1 జీబీ 4జీ డాటా పరిమితితో ఖాతాదారులకు ఆఫర్ చేస్తున్న అన్ని నెలవారీ పథకాల టారిఫ్‌లను ఈ నెల 9వ నుంచి రూ.50 చొప్పున తగ్గిస్తున్నామని, అలాగే ఈ డాటా పరిమితిని 1 జీబీ నుంచి 1.5 జీబీకి పెంచుతున్నామని ప్రకటించిన రిలయన్స్ జియో.. పనిలో పనిగా ఒక రోజు వ్యాలిడిటీ ప్లాన్ కింద అందజేస్తున్న 1 జీబీ డాటా రేటును 4 రూపాయలకు తగ్గిస్తున్నట్లు స్పష్టం చేసింది. అలాగే హ్యాపీ న్యూ ఇయర్-2018 ఆఫర్ కింద రూ.399 ప్లాన్ వినియోగదారులకు మరో 20 శాతం ఎక్కువ డాటాను అందజేయనున్నట్లు ప్రకటించింది. జియో ప్రకటించిన ఈ తాజా ఆఫర్లతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.199, రూ.399, రూ.459 ప్లాన్ల ధరలు 50 రూపాయల చొప్పున తగ్గుతాయి. అలాగే రూ.198, రూ.398, రూ.448, రూ.498 ప్లాన్ల వినియోగదారులకు వరుసగా 28, 70, 84, 91 రోజుల పాటు రోజుకు 1.5 జీబీ చొప్పున డాటా లభిస్తుంది. గత నెలలో రూ.199, రూ.299తో 28 రోజుల పాటు చెల్లుబాటయ్యే రెండు ప్లాన్లను ప్రకటించిన రిలయన్స్ జియో.. ఈ ప్లాన్ల కింద వినియోగదారులకు వరుసగా రోజుకు 1.2 జీబీ, 2 జీబీ చొప్పున డాటాను అందజేయనున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

బిల్డర్ల కోసం ప్రత్యేక బీమా

■ న్యూ ఇండియా అస్యూరెన్స్ నుంచి సరికొత్త పథకం

కోయంబత్తూర్, జనవరి 5: రియల్ ఎస్టేట్ బిల్డర్లు, డెవలపర్లకోసం ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టేయోచనలో న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీ) ఉన్నది. ఈ విషయాన్ని కంపెనీ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. సెంట్రల్ రియలెస్టేట్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ (రెరా) చట్టానికి లోబడి ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్లు, తద్వారా బిల్డర్లు/డెవలపర్లు నిర్మిస్తున్న ప్రాజెక్టులకు బీమా కవరేజి లభిస్తుందని ఎన్ఐఏసీ సీఎండీ జీ శ్రీనివాసన్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రాపర్టీకి సంబంధించి తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న బిల్డర్లకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వెల్లడించారు. మిగతా ఉత్పత్తులకు సంబంధించి ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడి కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా పాలసీని మరింత సరళతరం చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి పాలసీదారుడు తన పాలసీని ఆధార్‌తో లింక్ చేయాలనే ప్రశ్నపై ఆయన స్పందిస్తూ.. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ కాలపరిమితిని మార్చి 31 వరకు పొడిగించాలని సూచించినట్లు చెప్పారు. ఆధార్‌తో లింక్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అలాగే పాలసీదారుల మొబైల్ నంబర్లు కూడా లేవని ఈ నేపథ్యంలో లింక్ చేయడం కష్టతరంకానున్నదన్నారు.

2 లక్షల కోట్లు దాటనున్న ఐటీ ఖర్చు

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రస్తుత సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఐటీ అనుబంధ ఖర్చు రూ.2,33,273 కోట్లకు చేరుకోనున్నదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. అంతక్రితం ఏడాది ఖర్చుతో పోలిస్తే 11.6 శాతం ఎగబాకనున్నదని సోయిస్ ఏజ్ కన్సల్టింగ్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం ఇందుకు పరోక్షంగా కారణమవుతున్నదని తెలిపింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలులోకి రావడంతో అంతక్రితం ఏడాదితో పోలిస్తే 2017లో ఖర్చు 10.3 శాతానికి పరిమితమైందని కంపెనీ వ్యవస్థాపక సీఈవో కపిల్ దేవ్ సింగ్ తెలిపారు. ఐటీ రంగం భారీ వృద్ధిని నమోదు చేసుకోవడానికి మొబిలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, మౌలిక సదుపాయాల రంగాలు నూతన పుంతలు తొక్కడం కారణమవుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 100 అతిపెద్ద, మధ్యస్థాయి సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా కంపెనీ ఈ నివేదికను రూపొందించింది.

2018 ఎడిషన్‌గా రెనో క్విడ్

■ గరిష్ఠ ధర రూ.3.87 లక్షలు



న్యూఢిల్లీ, జనవరి 5: ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో..2018 ఎడిషన్‌గా క్విడ్‌ను ప్రవేశపెట్టింది. ఢిల్లీ షోరూంలో ఈ కారు రూ.2.67 లక్షల నుంచి రూ.3.87 లక్షల మధ్యలో లభించనున్నది. గతంలో విడుదల చేసిన దాంతో పోలిస్తే ఈ నూతన వెర్షన్‌లో రివర్స్ పార్కింగ్ సెన్సార్, టచ్‌స్క్రీన్ మీడియా ఎన్ఏవీ సిస్టమ్, డిజిటల్ పరికరాల క్లస్టర్, ఒకే టచ్‌తో ఇండికేటర్‌ను మార్చుకోవడంతోపాటు 10 అధునాతన ఫీచర్స్ ఉన్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి, క్రెడాయ్ ప్రతినిధులు

మార్చి 2నుంచి క్రెడాయ్ ప్రాపర్టీషో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అపెక్స్ బాడీ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) 6వ ఎడిషన్ ప్రాపర్టీషోను హైదరాబాద్‌లో నిర్వహించనున్నది. మార్చి 2నుంచి 4వరకు జరిగే హైటెక్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో రియల్టర్లు, బిల్డింగ్ మెటీరియల్ తయారీదారులు, కన్సల్టెంట్స్ పాల్గొననున్నారు. ప్రతి ఒక్కరి అవసరాలు, బడ్జెట్‌కు తగినట్టుగా డెవలపర్లు ప్రాపర్టీలను ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది షోకు లక్ష మంది సందర్శకులు రానున్నారని అంచనా వేస్తున్నారు.


ఎస్‌బీఐ ఖాతాదారులకు శుభవార్త!

కనీస నగదు నిల్వ, పెనాల్టీ చార్జీల తగ్గించేయోచనలో బ్యాంకు

ముంబై, జనవరి 5: పొదుపు ఖాతాల్లో ఉంచాల్సిన కనీస నగదు నిల్వ (మినిమమ్ బ్యాలెన్స్) పరిమితితో పాటు సంబంధిత జరిమానా చార్జీలను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. నెలవారీ సగటు నగదు నిల్వ (ఎంఏబీ) పరిమితిని పాటించని ఖాతాదారుల నుంచి పెనాల్టీ చార్జీల రూపంలో ఎస్‌బీఐ భారీగా రూ.1,771 కోట్ల లాభాన్ని దండుకోవడంపై విమర్శలు వెల్లువెత్తడంతో బ్యాంకు ఈ ప్రకటన చేసింది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతిపెద్దదైన ఎస్‌బీఐకి 40.2 కోట్ల మంది పొదుపు ఖాతాదారులు ఉన్నారు. ఐదేళ్ల విరామం తర్వాత గత ఏడాది ఏప్రిల్ నుంచి నెలవారీ సగటు నగదు నిల్వ చార్జీలను అమల్లోకి తీసుకొచ్చిన ఎస్‌బీఐ.. మెట్రో నగరాల్లోని ఖాతాల్లో కనీసం రూ.5 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాల్లో కనీసం వెయ్యి రూపాయలు నిల్వ ఉంచాలని, లేదంటే ఖాతాదారులకు జరిమానా విధిస్తామని అప్పట్లో స్పష్టం చేసింది. ఆ విధంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య కాలంలో ఖాతాదారుల నుంచి పెనాల్టీ చార్జీల రూపంలో భారీగా వసూలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఎస్‌బీఐ ఆర్జించిన నికర లాభం కంటే పొదుపు ఖాతాల్లో కనీస నగదు నిల్వ పరిమితిని పాటించని ఖాతాదారుల నుంచి అపరాధ రుసుము రూపంలో వసూలు చేసిన మొత్తమే ఎక్కువగా ఉన్నట్లు ఆర్థిక శాఖ విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేయడంతో ఆ బ్యాంకుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన ఎస్‌బీఐ.. పొదుపు ఖాతాల్లో ఉంచాల్సిన నెలవారీ సగటు నగదు నిల్వ పరిమితిని తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. 'పొదుపు ఖాతాల్లో ఉంచాల్సిన కనీస నగదు నిల్వపై గత ఏడాది ఏప్రిల్‌లో పరిమితి విధించిన మేము అప్పటి నుంచే ఈ అంశంపై తరచుగా పరిశీలన జరుపుతున్నాం. గత ఏడాది అక్టోబర్‌లో ఈ పరిమితిని కొంత మేరకు (మెట్రో నగరాల్లో రూ.3 వేలకు) తగ్గించిన మేము ఇప్పుడు మళ్లీ దీనిపై పునస్సమీక్ష జరుపుతున్నాం' అని ఎస్‌బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పీకే గుప్తా శుక్రవారం ముంబైలో విలేకరులకు వివరించారు. నెలవారీ సగటు నగదు నిల్వ పరిమితితో పాటు దానిని పాటించని వారిపై విధించే పెనాల్టీ చార్జీలపై విస్తృత సమీక్ష జరుపుతున్నామని, ఈ అంశాలపై తీసుకునే నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

వృద్ధి 6.5 శాతమే!

■ నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి జీడీపీ ■ మోదీ హయాంలో ఇదే అతితక్కువ
■ గణాంకాల సంస్థ అంచనా ■ వ్యవసాయ, తయారీ రంగాల్లో మందగమనమే కారణం



న్యూఢిల్లీ, జనవరి 5: వ్యవసాయ, తయారీ రంగాల పనితీరు పేలవంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధిరేటు నాలుగేండ్ల కనిష్ఠ స్థాయికి పతనమై 6.5 శాతంగా నమోదవుతుందని కేంద్ర గణాంకాల సంస్థ (సీఎస్ఓ) అంచనా వేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అతి తక్కువ వృద్ధిరేటు ఇదే. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 2014 మే నెలలో అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆ ఆర్థిక సంవత్సరం (2014-15)లో 7.5 శాతంగా నమోదైన స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 2015-16లో 8 శాతానికి పెరిగినప్పటికీ, గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో 7.1 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. దీనితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతానికి పతనమవుతుందని భావిస్తున్నట్లు సీఎస్ఓ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఆదాయానికి సంబంధించిన తొలి ముందస్తు అంచనాలను ప్రకటిస్తూ సీఎస్ఓ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో 6.6 శాతంగా నమోదైన వాస్తవిక స్థూల విలువ పెరుగుదల (జీవీఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.1 శాతానికి పతనమవుతుందని అంచనా వేస్తున్నట్లు సీఎస్ఓ తెలిపింది. మోదీ ప్రభుత్వం 2016 నవంబర్ 8వ తేదీన పెద్ద నోట్ల చలామణిని రద్దు చేయడం, గత ఏడాది జూలై 1వ తేదీ నుంచి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను అమలులోకి తీసుకురావడంతో దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగిన విషయం విదితమే. అయితే గత ఆర్థిక సంవత్సరం వ్యవసాయ, అటవీ, మత్స్య రంగాల్లో 4.9 శాతంగా నమోదైన వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.1 శాతానికి, తయారీ రంగంలో వృద్ధిరేటు 7.9 శాతం నుంచి 4.6 శాతానికి క్షీణించే అవకాశాలు ఉన్నాయని, అయితే ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తి సేవల రంగాల్లో గత ఏడాది 5.7 శాతంగా నమోదైన వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతానికి పెరుగుతుందని భావిస్తున్నామని సీఎస్ఓ స్పష్టం చేసింది.

తగ్గనున్న తలసరి ఆదాయ వృద్ధిరేటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీతో పాటు ప్రజల జీవన ప్రమాణాలకు కొలమానంగా పరిగణించే దేశ తలసరి ఆదాయ వృద్ధిరేటు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, 2016-17లో రూ.1,03,291 వద్ద 9.7 శాతంగా ఉన్న తలసరి ఆదాయ వృద్ధిరేటు 2017-18లో రూ.1,11,782కి చేరుకుని 8.3 శాతానికి క్షీణిస్తుందని అంచనా వేస్తున్నామని కేంద్ర గణాంకాల సంస్థ వెల్లడించింది. వాస్తవానికి 2011-12 ధరల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో రూ.82,269లుగా ఉన్న తలసరి ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.86,660 స్థాయికి చేరుకుంటుందని, అయితే 2016-17లో 5.7 శాతంగా నమోదైన వాస్తవ తలసరి ఆదాయ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతానికి క్షీణిస్తుందని భావిస్తున్నామని సీఎస్ఓ పేర్కొంది.

ఆర్‌కామ్‌కు భారీ ఉపశమనం

■ దివాలా పిటీషన్‌ను ఉపసంహరించుకున్న చైనా బ్యాంక్

ముంబై, జనవరి 5: అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్)కు భారీ ఉపశమనం లభించింది. ఆర్‌కామ్‌కు అతిపెద్ద విదేశీ రుణదాతగా ఉన్న చైనా డెవలప్‌మెంట్ బ్యాంక్ (సీడీబీ) ఆ సంస్థపై దాఖలు చేసిన దివాలా పిటిషన్‌ను శుక్రవారం ఉపసంహరించుకున్నది. ఈ పిటీషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీడీబీ తరపు న్యాయవాది ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)కు తెలియజేయడంతో అందుకు ట్రిబ్యునల్ అనుమతించింది. చైనాకు చెందిన మరో రెండు బ్యాంకులతో కలసి ఆర్‌కామ్‌కు దాదాపు 200 కోట్ల డాలర్ల రుణమిచ్చిన సీడీబీ.. తమకు ఆర్‌కామ్ పెద్ద మొత్తంలో బకాయి పడిందని, కనుక ఆ సంస్థపై దివాలా ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ గత ఏడాది నవంబర్‌లో ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. అయితే ఈ విషయమై సదరు బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్న ఆర్‌కామ్ గత వారం రుణ పునర్ వ్యవస్థీకరణ ప్రణాళికను ప్రకటించిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రమ్‌తో పాటు టెలికం టవర్లను కొనుగోలు చేసేందుకు అనిల్ అంబానీ అన్న ముఖేష్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ ముందుకు రావడంతో సీడీబీ తన దివాలా పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.

రూ.300 కోట్ల నిధుల సేకరణలో ఎన్ఏసీఎల్

హైదరాబాద్, జనవరి 5: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(గతంలో నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్) వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి రూ.300 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నది. ఇందుకు సంబంధించి ఈ నెల 2న జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఫిబ్రవరి 3న జరుగనున్న వాటాదారుల సమావేశంలో వారి అనుమతి తీసుకోనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, కంపెనీకి చెందిన శ్రీకాకుళం యూనిట్‌కు 2017 సంవత్సరానికిగాను 'సురక్ష పురస్కార్' అవార్డు వరించింది. ఈ అవార్డును కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

సెన్సెక్స్ దూకుడు

■ చారిత్రక గరిష్ఠ స్థాయికి సూచీలు
■ బ్యాంకింగ్ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లు
■ 1.13 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై, జనవరి 5:

దేశీయ స్టాక్ మార్కెట్ల పరుగుపందెం ఇప్పట్లో ఆగేటట్లు కనిపించడం లేదు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలకు తోడు బ్యాంకింగ్ రంగ సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.80 వేల కోట్లను కేటాయించనున్నట్లు ప్రకటించడంతో ఈ రంగ సూచీల్లో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. ఫలితంగా సూచీలు మరో రికార్డును సాధించాయి. వాల్‌స్ట్రీట్‌లో డౌవ్ జోన్స్ సూచీ తొలిసారిగా 25 వేల మార్క్‌ను చేరుకోవడం దేశీయ సూచీలు కదం తొక్కడానికి పరోక్షంగా కారణమయ్యాయి. ప్రారంభం నుంచే టాప్‌గేర్‌లో దూసుకుపోతున్న సూచీకి మధ్యాహ్నం తర్వాత ప్రారంభమైన ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలు మరింత జోష్‌నిచ్చాయి. దీంతో ఇంట్రాడేలో 34,188.85 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ వారాంతం ట్రేడింగ్ ముగిసే సమయానికి 184 పాయింట్ల లాభంతో 34,153.85 వద్ద స్థిరపడింది. సూచీలకు ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి ముగింపు. డిసెంబర్ 27న సాధించిన 34,137.97 రికార్డు కనుమరుగైపోయింది. అలాగే 10,566.10 పాయింట్ల ఆల్‌టైం హైని తాకిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 10,558.85 వద్ద ముగిసింది. గురువారం ముగింపుతో పోలిస్తే 54.05 పాయింట్లు ఎగబాకింది. దీంతో మదుపరుల సంపద మరో రూ.1.13 లక్షల కోట్లు పెరిగింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.1,13,924.97 కోట్లు లాభపడి రూ.1,53,77,070 కోట్ల (2.4 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకుంది. వరుసగా ఐదు వారాలుగా పెరుగుతున్న సూచీలు ఈ వారంలోనూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 97.02 పాయింట్లు, నిఫ్టీ 28.15 పాయింట్లు చొప్పున పెరిగాయి. 30 షేర్ల ఇండెక్స్‌లో 23 లాభపడగా, ఏడు మాత్రమే నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే టెలికం అత్యధికంగా 2.75 శాతం లాభపడగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.25 శాతం బలపడింది. వరుసగా రెండో రోజు ఐడియా 10 శాతానికి పైగా లాభపడింది. యెస్ బ్యాంక్ 5.03 శాతం, అదానీ పోర్ట్స్ 3.71 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 3.36 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 3.17 శాతం, డాక్టర్ రెడ్డీస్‌తోపాటు టీసీఎస్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, మారుతి, బజాజ్, కోల్ ఇండియా, హెచ్‌యూఎల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, టాటా మోటార్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటోకార్ప్‌ల షేర్లు పెరిగాయి.

రూపాయి జిగేల్

32 నెలల గరిష్ఠానికి మారకం



స్టాక్ మార్కెట్లతోపాటు రూపాయి కూడా జిగేల్ మన్నది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ నాలుగు పైసలు పెరిగి 63.37 వద్ద స్థిరపడింది. దీంతో కరెన్సీ 32 నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. 2018 ప్రారంభమైన నాటి నుంచి రూపాయి విలువ 55 పైసలు లాభపడటం విశేషం. ఏప్రిల్ 29, 2015ను ముగిసిన 63.30 స్థాయికి ఇంచుమించు చేరుకున్నట్లు అయింది.

ఐదింతలవనున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులు

ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు(ఎఫ్‌పీఐ) భారీగా నిధులను కుమ్మరిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 28-35 బిలియన్ డాలర్ల వరకు నిధులను చొప్పించే అవకాశం ఉందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నది. మన కరెన్సీలో రూ.1.8-2.2 లక్షల కోట్లు. అంతక్రితం ఏడాది చొప్పించిన రూ.48,400 కోట్ల (7 బిలియన్ డాలర్ల)తో పోలిస్తే ఐదు రెట్లు పెరుగనున్నదని తెలిపింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌పై విదేశీ పెట్టుబడిదారులు గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేస్తున్నారని ఇక్రా తన నివేదికలో పేర్కొంది. 2017 సంవత్సరంలో స్టాక్ మార్కెట్లు(సెన్సెక్స్, నిఫ్టీలు) 28 శాతం మేర లాభపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలానికి ఎఫ్‌పీఐలు రూ.95,600 కోట్లు (15 బిలియన్ డాలర్లు) నిధులను కేటాయించారు. డిసెంబర్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పెంచినప్పటికీ ఎఫ్‌పీఐలు వీటిని పట్టించుకోలేదు. అలాగే డెబిట్ మార్కెట్లలోకి ఎఫ్‌పీఐలు 24-26 బిలియన్ డాలర్ల మేర నిధులు చొప్పించనున్నట్లు ఇక్రా అంచనా వేస్తున్నది.

బీఎస్ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 346.55(332.45)72438
Ace Software Exports 29.0(29.0)2500
Aditya Ispat 7.6(7.66)60
Aditya Spin 8.31(8.13)2547
Agro Tech Foods 747.95(727.5)3333
Aishwarya Telcom Ltd 9.25(7.71)188418
Alphageo 931.9(928.85)5685
Alufluoride 140.7(139.4)22803
Amara Raja 862.3(839.85)40063
Andhra Bank 58.65(59.45)209443
Andhra Cements 14.54(13.98)252011
Andhra Petroch 64.25(61.2)156981
Andhra Sugars 551.25(521.3)8760
Anjani Portl 266.05(247.8)14970
Astra Micro 121.3(118.9)81318
Aurobindo Phar 671.1(668.65)94188
Avantel 530.0(509.05)25259
Avanti Feeds 2694.1(2547.85)24922
Avon Organics 17.1(17.1)46608
B N Rathi Securities 53.0(54.05)18281
B2b Software 16.03(15.5)2706
Balaji Amines 660.45(618.85)39958
Bambino Agro 321.5(317.65)3784
Bartronics India 16.71(15.92)120120
Bgr Energy Systems 140.1(140.95)19254
Bhagiradha Chem 357.85(345.95)16381

Bhagyaind 50.7(51.85)23896
Bhagyanagar W. 30.0(29.55)7630
Bnr Udyog 30.2(30.85)90
Brilliant Securities 13.46(12.82)809325
Cambridge Tech86.3(84.65)425
Cat Tech 1.24(1.22)7704
Ccl Products 302.75(299.8)8619
Celestial Labs 21.5(21.6)34064
Cil Securities 39.45(37.65)5165
Color Chips 49.3(50.65)19036
Coromandel Fert 568.0(576.1)7436
Country Club 19.05(20.05)192560
Cubex Tubings 28.8(28.15)2673
Cybermate Inf. 3.62(3.45)108487
Danlaw Tech. 84.65(80.65)27877
Deccan Cements 644.45(602.65)14391
Denisons Hyd 1245.7(1260.05)194
Dhan Roto Sp 44.4(44.95)1211
Diamond Power Infra21.1(22.25)182059
Divi's Lab 1105.15(1103.15)19494
Divyashakti Gr 111.45(106.15)3305
Dolphin Med 2.0(2.0)19675
Dr Reddy`s Lab 2467.35(2409.5)70815
Empee Sugars 5.4(5.5)38394
Everest Org 149.1(138.05)31804
Facor Alloys 4.28(4.15)1206000

Fenoplast 65.2(62.1)1
Firstobj 15.35(15.6)5443
Fortune Info 123.55(117.75)54420
Four Soft 91.5(92.4)5717
Fourth Gen Info 1.7(1.62)2340
Galada Power 5.17(5.4)2455
Gati 138.85(137.1)302838
Gayatri 11.93(12.26)130526
Gayatri Projects 214.95(212.75)67975
Gennex 6.1(6.04)536901
Gmr Infra 21.25(21.15)3360277
Godavari Drugs 43.4(42.25)3915
Goldinfra 209.05(205.85)44704
Goldstone Tech 14.1(14.65)29436
Gowra Lea & Fin25.5(24.4)2080
Granules Ind 139.35(134.9)234268
Gss America Info32.85(34.95)1444048
Gulf Oil Corp 587.75(603.35)1636
Gvk Pwr 20.1(20.1)1148405
Hbl Power 73.5(72.8)194685
Heritage Food 830.95(825.2)2066
Hifco Marwel 37.2(35.45)110
Hindustan Bio Sciences 0.42(0.4)2435
Hyderabad Ind 1608.05(1594.3)2855
I V R Cons 6.19(6.51)785335
I.c.s.a. 4.98(4.9)265929

Incap 128.95(124.85)6364
Incon Engineers 5.42(5.42)100
Infotech Ent 576.4(575.9)122639
Innocorp 1.3(1.35)2700
Invinex Lab 91.0(89.25)2100
Ivrcl Infrastruc 6.19(6.51)785335
K C P 157.95(161.35)107166
Kabsons Ind 8.86(8.69)1959
Kakatiya Cement 413.25(402.1)38991
Kallam Spinning Mills 26.15(26.8)40494
Karan Woosin 1.1(1.05)2750
Kaveri Seed 538.85(534.55)82234
Kernex Mic. 46.0(46.85)14514
Knr Const313.3(309.2)20314
Krebsbio 157.0(160.05)3271
Lanco Ind 401.3(403.25)28501
Lanco Infratech 1.7(1.62)1800985
Livewell Home Fin 86.2(83.35)8325

Lokesh Mach 78.7(78.7)136806
Madhucon Projects 36.85(36.85)45733
Maytas Infra 55.5(57.65)34920
Mhril 359.15(341.55)24883
Mic Electronics 9.38(9.41)109955
Moldtek 76.65(74.5)6354
Moschip Semi 42.2(39.65)478987
Msr India Ltd 35.2(36.25)25626
N C L Ind 278.0(282.05)26555
Nagarjuna Agri 63.9(64.0)103163
Nagarjuna Agri Tech 7.9(7.98)2947
Nagarjuna Con 131.9(132.6)405370
Natco Pharma 998.9(974.15)35668
National Min 158.5(154.4)743655
Nbventure 172.8(171.7)247919
Neha Inter10.56(10.81)85315
Neha Inter10.56(10.81)85315
Neocure Thera 4.09(4.2)24014

Nettlinx 88.55(84.25)29862
Neuland Lab 845.4(869.55)12436
Niharinf 13.6(14.01)560
Nile 927.95(931.25)6593
Oil Country 62.25(62.3)73747
Online Media Solutions 0.45(0.47)200
P L Enterprise 3.07(3.13)559
P.m. Telelinnks 2.86(3.0)86
Padmalaya Tel 5.8(5.8)25104
Pankaj Polymers 24.1(25.35)40137
Panyam Cem 65.6(62.75)128707
Pennar Ind 76.7(68.45)1551380
Pflinfotc 9.25(8.82)3491
Phaarmasia 27.1(27.2)142
Phyto Chem 73.75(74.9)15159
Pitti Lamin 103.75(103.55)19891
Pokarna 247.6(221.65)121127
Prajay Eng 17.59(16.76)112767

Premier Expl 446.9(462.8)1864
Prism Cement 135.4(120.95)505502
Rain 421.2(431.85)555425
Raj Packaging 39.0(37.8)2550
Ram Informatics 38.3(39.2)3421
Range Apparels 71.0(71.0)100
Ras Finance 26.9(25.85)283
Regency Ceramic 8.93(9.4)11939
Restile Ceramics 10.4(10.03)24167
Roopa Industries 13.05(13.5)2000
Rubra Medicaments 6.0(5.78)3936
S S Organics 6.75(6.65)100
Sagar Cements 1095.8(1104.5)18847
Sai Wires India 2.37(2.41)2770
Salguti Plast 11.51(12.09)169
Samkrg Pistons 354.1(348.65)8743
Sampre Nutritions 87.6(87.45)43284
Sanghi Ind 138.75(137.5)168913
Sanjeevni Industries 27.25(27.4)10380
Sark Sys 71.0(72.55)47537
Sathavahana Ispat 37.25(35.35)132393
Saven Tech24.0(24.55)4566
Sks Microfin1034.35(1001.3)51878
Sms Pharma100.2(101.4)23695
Softpro Sys 5.79(5.52)3496
Softsol India 48.0(48.0)486

Southern Magn& Chem34.1(35.45)1100
Southern Online Bio Tech 3.52(3.42)47242
Sr Ray Alkalies 82.45(80.6)635800
Sree Rayalaseema 227.15(225.15)6671
Srinivasa Shipp 92.5(93.65)57470
Starchik Sp 25.0(25.0)931
Steel Exchange India 43.95(46.25)17095
Sujana 0.93(0.89)703603
Sujana Towers 5.37(5.12)37035
Sujanametal 1.69(1.73)36810
Surana Telecom 6.43(6.28)27789
Suryaamba 75.05(74.0)5756
Suryachakra Power Corp1.49(1.42)283993
Suryalak Cott 107.5(97.15)106824
Suryalata Spin 165.8(167.85)4806
Suryavanshi Spin 8.91(8.49)2699
Suvarna Cem 180.0(171.8)4435
Suven 215.1(215.3)134016
Taj Gvk 181.35(180.5)6970
Tanla Solutions 41.2(41.2)192706
Tci Fin 29.8(27.15)333468
Tirumala Seu 1.05(1.1)100
Transcorp Inter56.65(59.55)34780
Transgene Biotek 2.44(2.36)53105
Transport Co 294.55(289.9)4878

Trendy Knitwear 0.21(0.2)50251
Tyche 142.7(142.15)15262
Unisocks 3.33(3.39)50405
Usher 8.75(9.0)22852
V & K Softech 4.99(4.99)100
V B C Ferro 45.05(46.5)4350
V S T Ind 3177.55(3149.2)198
Vamshi Rubber 52.35(53.25)1768
Viceroy Hotels 20.4(19.75)319115
Vijay Growth Fin 15.0(15.0)25
Vijay Textiles 44.8(44.2)8153
Vimta Labs 173.25(172.8)5127
Virat Crane 47.4(45.15)16496
Virnichiq 139.25(132.65)79136
Visaka Ind 755.7(774.4)60685
Vista Pharma 45.7(43.55)19319
Vivmed Labs 105.95(104.45)202556
Vivo Bio Tech 50.0(50.75)7470
Vjil Consulting 19.0(20.0)320
Vmf Softech 102.4(102.05)8689
Waterbase 386.35(381.85)432467
Xl Energy Ltd 3.81(3.85)15995
Ybrant Digital 5.99(5.84)2513738
Zen Tech153.6(152.15)114668
Zenotech 51.25(48.9)35549



'నమస్తే' రంగవల్లుల పోటీకి విశేష స్పందన

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో శుక్రవారం ఆసిఫాబాద్‌లోని సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీకి విశేష స్పందన లభించింది. అతివలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముగ్గులు వేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. **- కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

కలమడుగురేవులో మెస్రం వంశీయుల పూజలు

- వైభవంగా నాగోబా జాతర



కాలినడకన గోదావరికి చేరుకున్న మెస్రం వంశీయులు (ఇన్‌సెట్‌లో) గోదావరికి నైవేద్యం సమర్పిస్తున్న మెస్రం వంశీయులు

జన్నారం రూరల్ : గిరిజనుల ఆరాధ్యదైవం నాగోబా జాతరలో తొలి అంకం మొదలైంది. మంచిర్యాల జిల్లా కేంద్రం సమీపంలోని కలమడుగు గోదావరిలోని హస్తినమడుగు నుంచి మెస్రం వంశీయులు నీటిని తీసుకెళ్లారు. గత నెల 25న కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం నుంచి బయలుదేరిన మెస్రం వంశంలోని 22 కుటుంబాలకు చెందిన 125 మంది కాలినడకన శుక్రవారం కలమడుగు గ్రామానికి చేరుకున్నారు. గోదావరిలో పవిత్ర స్నానాలు చేసి పితృదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సహపంక్తి భోజనాలు చేసి హస్తినమడుగు నుంచి నీటిని తీసుకొని కేస్లాపూర్‌కు బయల్దేరారు. ఈ నెల 12న నాగోబాను పవిత్ర జలాలతో అభిషేకించిన తర్వాత జాతర ప్రారంభం అవుతుంది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	31.0	6.0
నిర్మల్	31.0	6.0
మంచిర్యాల	31.0	6.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	31.0	6.0
జగిత్యాల	29.5	10.0
ఖమ్మం	31.0	10.0
వరంగల్ రూరల్	31.0	11.0
వికారాబాద్	29.3	11.3
పెద్దపల్లి	29.6	12.0
కరీంనగర్	32.9	12.3
యాదాద్రి భువనగిరి	28.0	13.0
వరంగల్ అర్బన్	30.0	13.0
జనగామ	31.0	13.0
సూర్యాపేట	28.0	14.0
నాగర్‌కర్నూల్	29.0	14.0
మహబూబాబాద్	30.0	14.0
భద్రాద్రి కొత్తగూడెం	30.0	14.0
హైదరాబాద్	28.0	15.0
రంగారెడ్డి	28.0	15.0
మేడ్చల్	28.0	15.0
రాజన్న సిరిసిల్ల	29.0	15.0
నల్లగొండ	28.8	15.2
మెదక్	30.1	15.3
సంగారెడ్డి	30.1	15.3
సిద్దిపేట	30.1	15.3
మహబూబ్‌నగర్	31.2	15.6
వనపర్తి	30.1	15.8
జయశంకర్ భూపాలపల్లి	28.0	16.0
నిజామాబాద్	30.0	16.5
కామారెడ్డి	30.0	16.5
జోగుళాంబ గద్వాల	31.0	17.0

హృదయ 'భద్ర' విహారం!



జియో బయోడైవర్సిటీ, కల్చరల్ పార్క్ నమూనా చిత్రం



భద్రకాళి షోర్‌బండ్‌లో కొనసాగుతున్న పనులు

- ఆధునిక పర్యాటక కేంద్రంగా భద్రకాళి చెరువు
- చుట్టూ జియో బయో డైవర్సిటీ, కల్చరల్ పార్క్
- దేశంలోనే తొలి థీమ్ పార్క్
- రూ.68 కోట్లతో 4.5 కి.మీ. సరికొత్త టూరిజం సర్క్యూట్
- హృదయ్, స్మార్ట్ సిటీ పథకాల కింద సాగుతున్న పనులు

నూర శ్రీనివాస్/నమస్తే తెలంగాణ-వరంగల్ ప్రధాన ప్రతినిధి: ఓరుగల్లుకు ఆధునిక సొబగులు అద్ది కాకతీయుల కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలన్న సర్కార్ సంకల్పానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇన్నాళ్లూ కబ్జాలకు గురై కుంచించుకుపోయిన భద్రకాళి చెరువును దేశంలోనే తొలి థీమ్ పార్క్‌గా సర్కారు తీర్చిదిద్దుతున్నది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రూపొందిస్తున్నారు. కేంద్రప్రభుత్వ నిధులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం రెట్టింపు వాటాను వెచ్చించి అత్యాధునిక హంగులతో దీన్ని తీర్చిదిద్దుతున్నది. హృదయ్, స్మార్ట్ సిటీల కింద ఎంపికైన ఓరుగల్లు మహానగరం చారిత్రక కళా సంపదకు తోడు ఆధునికత మేళవింపుగా నిలువబోతున్నది. భద్రకాళి, పద్మాక్షి గుట్టల వరుసల నడుమ, జైనులు తిరగాడిన తావుల నడుమ తొలి కాకతీయ దుర్గం ఆధునిక హంగులతో కనువిందు చేయబోతున్నది. జియో, బయోడైవర్సిటీ, కల్చరల్ పార్క్‌గా మ్యూజికల్ గార్డెన్స్ నుంచి భద్రకాళి, భద్రకాళి నుంచి పద్మాక్షి అటు నుంచి పద్మాక్షి మొత్తం 4.5 కి.మీటర్ల దూరంలో భద్రకాళి షోర్‌బండ్ చుట్టూ 30 మీటర్ల వెడల్పుతో ఈ సాంస్కృతిక పార్క్ పనులు కొనసాగుతున్నాయి.

ఇదీ నేపథ్యం..

పూర్వ వరంగల్ జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలైన ఖిలా వరంగల్‌కోట, వేయిస్తంభాల గుడి, రామప్ప దేవాలయం, లక్నవరం, బొగత జలపాతం, పాఖాల సరస్సు మొదలైన ప్రాంతాలను సందర్శించిన వారు 80,05,225 మంది అయితే అందులో దాదాపు రెండువేల పైచిలుకు విదేశీ పర్యాటకులని పర్యాటకశాఖ గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ మహానగరాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అతిముఖ్యమైన అంశంగా స్వీకరించింది. అందులో భాగంగానే భద్రకాళి జియోబయో డైవర్సిటీ, కల్చరల్ పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. విద్యాకేంద్రంగా, పారిశ్రామిక కారిడార్‌గా, ఐటీ కేంద్రంగా వరంగల్‌ను తీర్చిదిద్దాలనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. ఈ క్రమంలో స్థానికంగా ఉండే వారాంతపు సెలవుల్ని కుటుంబసభ్యులతో గడిపేందుకు అనువైన కొత్త ప్రదేశాలు లేవని భావించిన జిల్లా యంత్రాంగం ఈ సరికొత్త పథకానికి నాంది పలికింది.

68 కోట్లతో థీమ్‌పార్క్

భద్రకాళి చెరువు తీరం (హంటర్‌రోడ్, పద్మాక్షిగుట్ట) వెంబడి దాదాపు 4.5 కిలోమీటర్ల దూరాన్ని భద్రకాళి షోర్‌బండ్‌గా ఎంపిక చేసుకొని 30మీటర్ల వెడల్పుతో (దాదాపు 400 హెక్టార్ల స్థలాన్ని) రూ.68 కోట్లతో అత్యాధునిక హంగులతో జియో బయోడైవర్సిటీ కల్చరల్ పార్క్‌ను నిర్మించేందుకు కుడా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో హృదయ్ పథకం కింద రూ.18 కోట్లు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.50 కోట్లు ఖర్చుచేస్తారు.

జోన్‌కో ప్రత్యేకత..

చెరువువైపు ఉన్న 3.8 కిలోమీటర్లను 30 మీటర్ల వెడల్పుతో భద్రకాళి షోర్‌బండ్‌ను ఐదు జోన్లుగా విభజించారు. ఇందులో రెండువైపులా ఎంట్రెన్స్ ప్లాజాలు, వాకింగ్‌ట్రాక్స్, టాయ్ ట్రైన్ ట్రాక్, రబ్బర్‌వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆటలాడుకోవడానికి అనువైన ప్రాంతం ఇలా మొత్తం ఐదు జోన్లుగా విభజించారు. ఎక్కడ చూసినా ఆహ్లాదభరిత వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దబోతున్నారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌తో ల్యాండ్‌స్కేపింగ్‌కు నీటి సరఫరా వంటి అంశాలే కాకుండా బ్యాటరీ సైక్లింగ్ విధానంతో ఒక ఎంట్రెన్స్ ప్లాజా నుంచి మరో ఎంట్రెన్స్ ప్లాజా ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా లోపల తిరిగేందుకు బ్యాటరీ సైకిళ్లను వాడేందుకు ఏర్పాట్లు చేస్తారు. అంతేకాకుండా టాయ్ ట్రైన్ విషయంలోనూ అదే బ్యాటరీ సిస్టమ్‌ను వినియోగించబోతున్నారు. భద్రకాళి షోర్‌బండ్ మొత్తం (3.8కి.మీ.) కాకతీయ శిల్పకళా వైభవం ఉట్టిపడే విధంగా తోరణ స్తంభాలను ప్రత్యేకంగా చెక్కించి మధ్య మధ్యలో పెడుతూ వారసత్వ ప్రతీకను ప్రతిబింబించే విధంగా పనులు చేస్తున్నారు. భద్రకాళి షోర్‌బండ్ నిర్మాణ పనులు దాదాపు 40 శాతం పూర్తయ్యాయి. భద్రకాళి చెరువులో ఉన్న గుట్ట నుంచి పద్మాక్షి గుట్టకు ఒక సస్పెన్షన్ రోప్‌వే నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ఇక్కడి చారిత్రక వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని నూతన పర్యాటక విధానాన్ని అమలు చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. వరంగల్ చరిత్ర, సంస్కృతి, కాకతీయ శిల్పకళావైభవం ఉట్టిపడేలా నిర్మిస్తున్న ఈ పార్క్ ద్వారా ప్రపంచ పర్యాటక పటంలో వరంగల్‌ను నిలబెట్టనున్నాం.

– కడియం శ్రీహరి, ఉపముఖ్యమంత్రి

కుడా చరిత్రలోనే నిలిచిపోయేలా..



కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేపడుతున్న భద్రకాళి ఆధునిక హంగులతో దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యద్భుతమైన కల్చరల్ పార్క్‌ను చేపట్టాం. ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సహకారం, జిల్లా యంత్రాంగం చొరవతో ఈ పనులన్నీ పూర్తిచేసి కుడా చరిత్రలోనే నిలిచిపోయేలా తీర్చిదిద్దుతున్నాం.

– మర్రి యాదవరెడ్డి, కుడా చైర్మన్

దేశానికే తలమానికం..



దేశానికే తలమానికమైన సుందర పర్యాటక క్షేత్రంగా భద్రకాళి, ఖిలా వరంగల్, కాజీపేట దర్గా మొదలైన చారిత్రక ప్రాంతాల ఔన్నత్యాన్ని మరింత ద్విగిణీకృతం చేసేందుకు ఈ పనులు చేపట్టాం. భద్రకాళితోపాటు ఖిలా వరంగల్ రాతికోట ఉత్తర ద్వారం నుంచి పశ్చిమ ద్వారం వరకు ఉన్న కందక ప్రదేశాన్ని కేరళ మోడల్‌లో నిర్మించి రాతికోట అందాలను తిలకించే విధంగా బోట్ రూట్ కోసం ప్రణాళికలు రూపొందించాం.

– నన్నపునేని నరేందర్, మేయర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్

పెరుగుతున్న చలి

- ఆదిలాబాద్‌లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఫలితంగా చలి పెరుగుతున్నది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 4 నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన ఉట్నూర్, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లో చలి ప్రభావం అధికంగా ఉంది. కాగా జగిత్యాల, ఖమ్మం జిల్లాలో 10 డిగ్రీల చొప్పున నమోదు కాగా వరంగల్ రూరల్ జిల్లాలో 11 డిగ్రీలు నమోదైంది. రానున్న రెండు మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.



పల్లె ప్రగతి కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, వేదికపై సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది, విప్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఎర్రబెల్లి

తెలంగాణలోనే నిరంతర విద్యుత్

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

నర్సంపేట రూరల్: 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రెండో విడుత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని కడియం ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం టీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న నిరంతర విద్యుత్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఆడపిల్ల పుడితే నిరుపేద తల్లిదండ్రులు ఏ మాత్రం అధైర్య పడొద్దని, మేనమామలా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ల కింద పెండ్లి ఖర్చుల కోసం రూ.75,116 అందిస్తున్నారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

రైతులపై కపటప్రేమ వద్దు

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి : అధికారంలో ఉన్ననాడు రైతులను పట్టించుకోని నేతలు ఇప్పుడు అన్నదాతలపై కపట ప్రేమ చూపుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. వేరుశనగకు మద్దతు ధర ఇవ్వాలని వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్డుపై రైతులతో కలసి ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఆందోళన చేయడంపై శుక్రవారం సాయంత్రం నిరంజన్ రెడ్డి తన స్వగృహంలో విలేకరులలో మాట్లాడారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రైతులను పట్టించుకోకుండా నేడు కపటప్రేమలు చూపిస్తున్నారన్నారు. పలు దఫాలుగా ఎమ్మెల్యేగాను, మంత్రిగాను పని చేసిన అనుభవంతో తెలంగాణలో ఎందుకు వేరుశనగ కొనుగోలు కేంద్రం పెట్టించలేదన్నారు. రైతులు పండించే వివిధ రకాల ధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటిస్తున్నదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, లేనప్పుడు మరోమాట మాట్లాడి రైతులను గందరగోళానికి గురిచేయడం సబబుకాదన్నారు. ధాన్యాన్ని రైతు సమన్వయ సమితుల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకొని అన్నదాతల పాపం మూటగట్టుకున్నదన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీలో అక్రమాలు

- గద్వాల జిల్లాలో 9మందిపై చీటింగ్ కేసు

జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కేసీఆర్ కిట్ల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటన గద్వాల జిల్లాలో వెలుగు చేసింది. ఇందుకు బాధ్యులైన తొమ్మిది మందిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ప్రైవేటు దవాఖానలో ప్రసవించిన వారు తప్పుడు పద్ధతుల్లో కేసీఆర్ కిట్లను, పథకం డబ్బులను పొందినట్టు గుర్తించిన డీఎంహెచ్‌వో డాక్టర్ సునీత ఈ విషయమై వైద్య సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం బహిర్గతమైంది. ఇప్పటివరకు జిల్లాలో 15,678 మంది గర్భిణులు నమోదు చేసుకోగా, 2080 మందికి కేసీఆర్ కిట్లు అందజేశారు. మానవపాడు, ధరూరు మండలాలకు చెందిన వైద్య సిబ్బంది ప్రైవేటు దవాఖానలో ప్రసవమైన వారి వివరాలను ప్రభుత్వ దవాఖాన రికార్డుల్లో నమోదు చేసి వారికి కేసీఆర్ కిట్లను అందజేశారు. ఉండవెల్లికి చెందిన పింజరి ఆయేషా, అమరవాయికి చెందిన ఫెహరునిసా బేగం, పుల్లూరుకు చెందిన బోయ రేణుక, ధరూరు మండలం గుడ్డెందొడ్డికి చెందిన సుజాతలు కర్నూల్, గద్వాలలోని ప్రైవేట్ దవాఖానల్లో డెలివరీ అయ్యారు. వీరు నిబంధనలకు విరుద్ధంగా కేసీఆర్ కిట్లను అందుకున్నారు. ఈ విషయం తన దృష్టికి రావటంతో డీఎంహెచ్‌వో సునీత మానవపాడు, ధరూరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ కిట్‌ను, లబ్ధిదారులకు అందించే డబ్బులను తప్పుదోవ పట్టించిన డాక్టర్ రాజు, డాక్టర్ యాదయ్య, వైద్య సిబ్బంది రోజారాణి, మాబీ, కృష్ణవేణి, వినోదిని, స్టాఫ్ నర్సు విజయ, ఏఎన్‌ఎం రాధ, గౌసియాబేగంలపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

విద్యాప్రేరణ సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో నిర్వహించిన విద్యా ప్రేరణ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని రాజ బంగ్లా వద్ద శుక్రవారం డీఈవో జనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలాల విద్యా ప్రేరణ సదస్సులో మంత్రి మాట్లాడారు. ఉద్యోగమే పరమావధి కాదని, చదువు ఎంత చదివామన్నది కాదని, ఎంత సంస్కారం నేర్చామన్నది ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ బంగారు తెలంగాణ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని సూచించారు. చదువంటే మనల్ని మనం సంస్కరించుకొని సమాజాన్ని సంస్కరించే స్థాయికి ఎదుగడమన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. పరీక్షలు రాసే సమయంలో మెళకువలు పాటించాలని సూచించారు. ఈ సదస్సులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన ర్యాలీలో బైక్‌పై వస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి రాలేదని, కొట్లాడి సాధించుకున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి దాదాపు 10వేల మంది హాజరయ్యారు. అంతకుముందు రాణిపేట నుంచి మిడ్జిల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ గొప్పతనమేమీ లేదన్నారు. అనేకమంది విద్యార్థులు, ఉద్యోగులు, ఉద్యమకారులు సైతం తెలంగాణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. ఇందుకు కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీలే కారణమన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు ఉద్యమించిన తమను కాంగ్రెస్, టీడీపీ నాయకులు తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. ఇంతకాలం ఉద్యమ ద్రోహులతో జతకట్టిన కాంగ్రెస్ నాయకులు ఇకనైనా కండ్లు తెరిచి బంగారు తెలంగాణ కోసం కలిసిరావాలని పిలుపున్చారు. లేకుంటే భవిష్యత్తులో అభివృద్ధి నిరోధకులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వాల్యానాయక్, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు బాద్మి శివకుమార్, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకుముందు మిడ్జిల్‌లో కురుమ, యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. బాదేపల్లి శివాజీ నగర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

భారీగా చేరికలు

మహబూబ్‌నగర్ జిల్లా ఉమ్మడి మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 550 మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. మంత్రి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: అధికార టీఆర్‌ఎస్‌లోకి వలసలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాలు, కులాల వారు శుక్రవారం కూడా పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కిష్టాపురంలో పలువురు కాంగ్రెస్ నాయకులతోపాటు వార్డు సభ్యుడు బోయ లక్ష్మణ్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది మహిళలు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన రజకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే హన్మంత్ షిండే కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన 200 మంది మున్నూరు కాపు కులస్థులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



నల్లగొండ జిల్లా కిష్టాపురంలో వార్డు సభ్యుడు లక్ష్మణ్‌ను టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న భూంపల్లి మున్నూరు కాపు కులస్థులు

టీఆర్‌ఎస్‌కు 'డొంకేశ్వర్' బాసట



నందిపేట్ రూరల్: గ్రామాభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినందుకు నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం డొంకేశ్వర్ గ్రామస్థులు టీఆర్‌ఎస్‌కు బాసటగా నిలిచారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతోపాటు 8 కుల సంఘాల నాయకులు టీఆర్‌ఎస్ వెంటే ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం వారంతా హైదరాబాద్ వెళ్లి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఊరంతా టీఆర్‌ఎస్ వెంటే ఉంటుందని వారు తెలిపారు.

ఇల్లెందులో దారుణం

భార్యను కిడ్నాప్ చేసి హతమార్చిన భర్త



హతురాలు పద్మ (ఫైల్)



నిందితుడు బండారు ప్రభాకర్

ఇల్లెందు నమస్తే తెలంగాణ : భార్య కాపురానికి రావడం లేదని స్నేహితులతో కలిసి కిడ్నాప్ చేసి ఆపై హతమార్చాడో భర్త. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందులోని కాకతీయ నగర్‌కు చెందిన పద్మ, ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం తొడిదలగూడెం గ్రామానికి చెందిన బండారు ప్రభాకర్ 13ఏండ్ల క్రితం ప్రేమించి పెండ్లి చేసుకొన్నారు. పద్మ ఖమ్మం జెడ్పీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్నారు. పద్మకు ఇటీవల భర్త తో విభేదాలు ఏర్పడ్డాయి. ప్రభాకర్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని తెలిసి పద్మ తన తల్లి పోచమ్మ దగ్గర ఉంటున్నది. పద్మను ఇంటికి రావాలని ప్రభాకర్ వచ్చి పలుమార్లు హెచ్చరించాడు. అయినప్పటికీ ఆమె వెళ్లలేదు. గురువారం రాత్రి ప్రభాకర్ ఇద్దరు స్నేహితులతో కలిసి ఆటోలో వచ్చి ఇంటికి వెళ్తున్న పద్మను కిడ్నాప్ చేశారు. అక్కడి నుంచి పట్టణ శివారులోకి తీసుకెళ్లి చున్నీతో గొంతు బిగించి హత్యచేశారు. శుక్రవారం ఉదయం పోలీసులు పద్మ ఆచూకీ కోసం గాలిస్తుండగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు భర్త ప్రభాకర్, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఇల్లెందు డీఎస్పీ ప్రకాశ్‌రావు సందర్శించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. పద్మకు బాబు, పాప ఉన్నారు.

హెచ్‌సీఏ కార్యదర్శి శేష్ నారాయణపై వేటు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి శేష్ నారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. హైదరాబాద్ జట్టు ఎంపిక ప్రక్రియలో అక్రమాలు, ఎపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని అతనిపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన ఎపెక్స్ కౌన్సిల్ సస్పెన్షన్ విధించింది. సెలెక్షన్ కమిటీ నిర్ణయాల్లో కార్యదర్శి జోక్యాన్ని నిరసిస్తూ సెలెక్టర్లు రాజీనామా చేశారని హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తెలిపారు. కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలను అంబుడ్స్‌మన్ నర్సింహారెడ్డికి అందజేశామన్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అంబుడ్స్‌మన్ ఆరు నెలల్లోపు తన నివేదికను ఎపెక్స్ కౌన్సిల్‌కు ఇవ్వొచ్చు. ఆటగాళ్ల ఎంపికపై జూనియర్ జట్టు కోచ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో గత నెల 14న జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే శేష్‌కు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. లక్షల్లో డబ్బులు వసూలు చేసి సమర్థత లేని ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించారన్నది శేష్‌పై ప్రధాన ఆరోపణ. మరోవైపు హెచ్‌సీఏను సొంతం చేసుకోవాలనే ప్రణాళికలతోనే తనపై సస్పెన్షన్ వేశారని శేష్ ప్రత్యారోపణలు చేశాడు. వివేక్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఈ విషయంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు.

కబడ్డీ చాంప్ మహారాష్ట్ర



హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పురుషుల టైటిల్‌ను మహారాష్ట్ర జట్టు గెలుచుకుంది. శుక్రవారం గచ్చిబౌలీలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన ఫైనల్లో మహారాష్ట్ర 34-29తో సర్వీసెస్‌పై నెగ్గింది. కర్ణాటక మూడోస్థానంలో నిలిచింది. మహిళల టైటిల్‌ను హిమాచల్ ప్రదేశ్ చేజిక్కించుకుంది. ఫైనల్లో హిమాచల్ 38-25తో ఇండియన్ రైల్వేస్‌ను ఓడించింది. విజేతలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, భారత కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మృదుల భదూరియా, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసానీ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ బహుమతులు అందజేశారు.

ఆసీస్ 193/2

రాణించిన ఖవాజ, స్మిత్



ఖవాజ (91*)

సిడ్నీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న యాషెస్ ఐదో టెస్టులో ఆస్ట్రేలియా పట్టు బిగిస్తున్నది. టాప్ ఆర్డర్ రాణించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 2 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఖవాజ (91 బ్యాటింగ్), స్మిత్ (44 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ బాంక్రాఫ్ట్ (0) రెండో ఓవర్‌లోనే డకౌటైనా.. వార్నర్ (56), ఖవాజ రెండో వికెట్‌కు 85 పరుగులు జత చేశారు. తర్వాత స్మిత్ మరింత నెమ్మదిగా ఆడాడు. 27 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆసీస్ కెప్టెన్ టెస్టుల్లో 6 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 107 పరుగులు జోడించడంతో ఇన్నింగ్స్ కోలుకుంది. అంతకుముందు 233/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 346 పరుగులకు ఆలౌట్ అయింది. మలాన్ (62) ఔటైన తర్వాత టెయిలెండర్లు అలీ (30), కుర్రాన్ (39), బ్రాడ్ (31) తలా కొన్ని పరుగులు జోడించడంతో ఆసీస్ బౌలర్లలో కమిన్స్‌కు 4, హజెల్‌వుడ్, స్టార్క్‌కు చెరో రెండు వికెట్లు దక్కాయి.

తొలి రోజే తడాఖా

ఆహా.. సఫారీ గడ్డపై శుభారంభం లభించిందన్న సంతోషం కనీసం ఒక్క రోజు కూడా ఉండలేదు.. మన పేసర్లు ఆతిథ్య బ్యాట్స్‌మెన్‌ను ఆటాడుకున్నారన్న ఆనందం గంటసేపు కూడా నిలువలేదు. పాత చరిత్రను కండ్ల ముందుకు తీసుకురావడానికి దక్షిణాఫ్రికా బౌలర్లకు నిమిషం కూడా పట్టలేదు.. టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టేందుకు క్షణం కూడా పట్టలేదు. మనం రోజంతా కష్టపడి ప్రొటీస్ 10 వికెట్లు పడగొడితే... వాళ్లు మాత్రం ఒకే ఒక్క గంటలో 11 ఓవర్లు వేసి.. 28 పరుగులిచ్చి.. ముగ్గురు కీలక బ్యాట్స్‌మెన్‌ను వెనక్కి పంపారు. ఫలితంగా తొలి రోజే బౌలర్లు పండుగ చేసుకున్న తొలి టెస్టులో భారత్‌పై దక్షిణాఫ్రికా ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది.



కేప్‌టౌన్: ఇన్నింగ్స్ మూడో బంతికి ఎల్గర్ (0) ఔట్.. తర్వాతి ఓవర్‌లో మార్క్‌రామ్ (5), ఆ తర్వాతి ఓవర్‌లో ఆమ్లా (3).. ఐదు ఓవర్లలో దక్షిణాఫ్రికా స్కోరు 12/3. ఓవరాల్‌గా మ్యాచ్ తొలి గంటలో భారత్ పేసర్ భువనేశ్వర్ (4/87) సంచలన ప్రదర్శన చూపెడితే.. ఆఖరి సెషన్ చివరి గంటలో దక్షిణాఫ్రికా పేస్ త్రయం ఇదే సీన్‌ను పునరావృతం చేసింది. కేవలం 9 ఓవర్లలో విజయ్ (1), ధవన్ (16), కోహ్లీ (5)లను పెవిలియన్‌కు చేర్చి మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశారు. ఫలితంగా శుక్రవారం మొదలైన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 73.1 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. పిచ్‌పై ఏబీ డివిలియర్స్ (84 బంతుల్లో 65; 11 ఫోర్లు), డుప్లెసిస్ (62) ఫర్వాలేదనిపించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 11 ఓవర్లలో 3 వికెట్లకు 28 పరుగులు చేసింది. పుజార (5 బ్యాటింగ్), రోహిత్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఫిలాండర్, స్టెయిన్, మోర్కెల్ తలా ఓ వికెట్ తీశారు.

భువీ హవా..

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాకు స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్ చుక్కలు చూపెట్టాడు. పిచ్‌పై ఉండే తేమను సద్వినియోగం చేసుకుంటూ నిప్పులు కురిపించాడు. కేవలం మూడు ఓవర్లలో ముగ్గురు కీలక బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను భారత్ చేతుల్లోకి తెచ్చాడు. అయితే 12/3 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన కెప్టెన్ డుప్లెసిస్, డివిలియర్స్ బాధ్యాతాయుత ఆటతీరుతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. భువీని పక్కనబెట్టి మిగతా బౌలర్లలో పరుగులు రాబడుతూ నాలుగో వికెట్‌కు 114 పరుగులు జోడించారు. ఉన్నంతసేపు టీమ్ఇండియా బౌలింగ్‌పై పూర్తి ఆధిపత్యం చూపెట్టిన ఈ జోడీ.. 16 పరుగుల తేడాతో ఔటయ్యారు. మిడిలార్డర్‌లో డికాక్ (43), ఫిలాండర్ (23) ఆరో వికెట్‌కు 60 పరగులు జత చేయడంతో ప్రొటీస్ స్కోరు 200లు దాటింది. ఈ దశలో డికాక్ ఔటైనా.. కేశవ్ మహారాజ్ (35) సమయోచితంగా ఆడాడు. రబడ (26)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశాడు. చివర్లో స్టెయిన్ (16 నాటౌట్) కూడా బ్యాట్ ఝుళిపించాడు.

దక్షిణాఫ్రికా 286 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 28/3

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 0, మార్క్‌రామ్ (ఎల్బీ) భువనేశ్వర్ 5, ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, డివిలియర్స్ (బి) బుమ్రా 65, డుప్లెసిస్ (సి) సాహా (బి)హార్దిక్ 62, డీకాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమీ 23, మహారాజ్ (రనౌట్/అశ్విన్) 35, రబాడ (సి) సాహా (బి)అశ్విన్ 26, స్టెయిన్ 16 నాటౌట్, మోర్కెల్ (ఎల్బీ) అశ్విన్ 2; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 73.1 ఓవర్లలో 286 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221, 8-258, 9-280, 10-286. **బౌలింగ్:** భువనేశ్వర్ 19-4-87-4, షమీ 16-6-47-1, బుమ్రా 19-1-73-1, హార్దిక్ 12-1-53-1, అశ్విన్ 7.1-1-21-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, ధవన్ (సి&బి) స్టెయిన్ 16, పుజార 5 నాటౌట్, కోహ్లీ (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ 0 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 1; **మొత్తం:** 11 ఓవర్లలో 3 వికెట్లకు 28. **వికెట్ల పతనం:** 1-16, 2-18, 3-27. **బౌలింగ్:** ఫిలాండర్ 4-1-13-1, స్టెయిన్ 4-1-13-1, మోర్కెల్ 2-2-0-1, రబడ 1-0-1-0.

బెంగళూరుపై నార్త్‌ఈస్టర్న్ గెలుపు

చెన్నై: పీబీఎల్‌లో నార్త్‌ఈస్టర్న్ వారియర్స్ 3-2తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఐదింటిలో బెంగళూరు మూడు మ్యాచ్‌లు నెగ్గినప్పటికీ కీలకమైన రెండు ట్రంప్ మ్యాచ్‌ల్లో నార్త్‌ఈస్టర్న్ పై చేయి సాధించింది. పురుషుల డబుల్స్‌లో మథియాస్, కిమ్ సారంగ్ (బెంగళూరు) జోడి 15-12, 7-15, 15-12తో కిమ్‌జంగ్, చియోల్‌పై, సింగిల్స్‌లో జయరామ్ (నార్త్ ఈస్టర్న్) 15-8, 15-13తో చాంగ్‌వీ ఫెంగ్‌పై, మహిళల సింగిల్స్‌లో మిచెల్లీ లీ (నార్త్ ఈస్టర్న్) 7-15, 15-14, 15-13తో గిల్‌మోర్‌పై గెలిచారు. మరో పురుషుల సింగిల్స్‌లో అక్సెల్సెన్ (బెంగళూరు) 9-15, 15-13, 15-14తో వాంగ్‌పై, మిక్స్‌డ్‌లో మను అత్రి, సిక్కిరెడ్డి 12-15, 15-8, 15-9తో ప్రజక్తా, చియోల్ జోడిపై నెగ్గింది.

'ఆస్ట్రేలియన్'కు సెరెనా దూరం

మెల్‌బోర్న్: అమెరికా స్టార్, డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి దూరమైంది. ఫిట్‌నెస్‌ను మెరుగుపర్చుకోవాలనే ఉద్దేశంతో విరామం తీసుకుంటున్నట్లు వెల్లడించింది. టోర్నీలో పాల్గొనే ఫిట్‌నెస్ ఉన్నా.. మరింత మెరుగైన ప్రదర్శన చేయడానికి ఇది సరిపోదని చెప్పింది. ఆండీ ముర్రే, నిషికోరి కూడా ఈ టోర్నీ నుంచి వైదొలుగగా, జొకోవిచ్ పాల్గొనడంపై సందిగ్ధం కొనసాగుతున్నది.

సుశీల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: భారత రెజ్లర్లు సుశీల్‌కుమార్, పర్వీన్ రానా మధ్య వివాదం మరింత ముదిరింది. ఈ వివాదంపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు పర్వీన్ ఈ వారంలో మొదట్లో ఫిర్యాదు చేశాడు. కామన్వెల్త్ ఎంపికలో అవకతవకలు జరిగాయని ఆరోపించాడు. దీనిపై తాజాగా డబ్ల్యూఎఫ్ఐ స్పందిస్తూ..సుశీల్‌కు నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది.

చెత్త నుంచి సంపద!



మైసూర్ నగర పరిధిలోని ఓ చెత్త రీసైక్లింగ్ యూనిట్

మైసూర్‌లో సమర్థవంతంగా వ్యర్థాల నిర్వహణ

ప్రతిరోజూ 402 టన్నుల చెత్తసేకరణ

రీసైక్లింగ్‌తో సేంద్రియ ఎరువు, విద్యుత్ ఉత్పాదన

మైసూర్, జనవరి 5:

ప్రతి రోజూ ఉదయం ఆరుగంటలకు మైసూర్ నగర వీధులన్నీ విజిల్లతో ప్రతిధ్వనిస్తుంటాయి. ముదురాకుపచ్చరంగు దుస్తుల్లో, చేతి తొడుగులతో ఇంటింటికి తిరిగే మున్సిపల్ కార్మికులు వాటిని మోగిస్తూ చెత్తను సేకరిస్తుంటారు. 13లక్షల జనాభా ఉన్న మైసూర్ వ్యర్థాల నిర్వహణను అర్థవంతంగా చేపట్టి ఆదాయ సముపార్జనతోపాటు ప్రధాని మోదీ ప్రారంభించిన స్వచ్ఛభారత్‌కు అచ్చమైన ఉదాహరణగా నిలుస్తున్నది. ఇక్కడ రీసైక్లింగ్ ద్వారా చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చడంతోపాటు విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఆధునిక యంత్రాలతో సంప్రదాయ పద్ధతులతో చెత్తను పునరుత్పాదకంగా మారుస్తున్నారు. 1903లోనే ప్రణాళికా విభాగాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర మైసూర్ మున్సిపాలిటీది. 1908లో విద్యుత్‌దీపాల ఏర్పాటు, 1910లో భూగర్భ మురికినీటి వ్యవస్థను ప్రారంభించుకున్న మైసూర్ పలు నగరాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

ప్రపంచంలోనే అత్యధికంగా చెత్తను ఉత్పత్తి చేసే నగరాల జాబితాలో మనదేశంలోని నగరాలన్నీ ముందువరుసలో ఉంటాయి. దేశంలోని పట్టణాలన్నీ ఏడాదికి 6.2కోట్ల టన్నుల చెత్తను ఉత్పత్తి చేస్తున్నాయి. సేకరిస్తున్న చెత్తలో 28% మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నది. మిగతా డంపింగ్ యార్డులు, మిగతా మార్గాల్లో భూమిలో కలిసిపోతున్నది. మురికికాల్వలు, నదుల్లోనూ ఈ చెత్త పేరుకుపోతున్నది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ ప్రభావాలతో 2051నాటికి చెత్త ఉత్పత్తి ఐదురెట్లు పెరుగుతుందని న్యూఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ పరిశోధకులు 2016లో ఓ పరిశోధన పత్రాన్ని ప్రకటించారు.

పలు నగరాలకు స్ఫూర్తి

మైసూర్ పరిధిలో నిత్యం 402 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ప్రతీ ఇంటిలో తడి చెత్తకు, పొడి చెత్తకు వేర్వేరు డబ్బాలను వాడుతున్నారు. 400 చెత్త సేకరణ వాహనాల్లో కార్మికులు వాటిని సేకరిస్తున్నారు. మైసూర్ స్ఫూర్తితో ఈ విధానాన్ని ఇప్పుడు చాలా నగరాల్లో అమలు చేస్తున్నారు. మైసూర్‌లో సేకరిస్తున్న చెత్తలో కేవలం 8% మాత్రమే పనికి రాని వ్యర్థాలు. మిగిలిన దాన్ని నగరంలోని 9 రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తున్నారు. తిరిగి వాడుకోదగ్గ వస్తువులను వేరుచేసి మిగతా వ్యర్థాలను వర్మి కంపోస్టు తయారీకి వినియోగిస్తున్నారు. సుమారు 100 టన్నులపైగా వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తుండగా, మరో వంద టన్నుల వరకు ఎరువుగా మారుస్తున్నారు. వర్మి కంపోస్ట్‌ను రోడ్ల పక్కన, పార్కుల్లోని చెట్లకు ఎరువుగా వాడుతున్నారు. అప్పటికీ మిగిలే ఎరువును ఆసక్తిగల వారికి విక్రయిస్తున్నారు. మైసూర్‌లో ఫ్లెక్సీలు కనపడవు. బట్టపై రాసిన బ్యానర్లే అనుమతిస్తున్నారు. కర్ణాటకలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధమూ వ్యర్థాల నిర్వహణ విజయవంతానికి కారణం. 'మేం చెత్తను సంపదగా చూస్తు న్నాం. భూమిలోకి చెత్త చేరడాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని మైసూర్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డీజీ నాగరాజు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం

ప్రజల భాగస్వామ్యంతోనే మైసూర్‌లో వ్యర్థాల నిర్వహణ సత్ఫలితాలనిస్తున్నది. అధికారులూ నిరంతర ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రేడియో జింగిల్స్, వాట్సాప్ సందేశాలతో పారిశుద్ధ్య ప్రాధాన్యతను ప్రతిరోజూ గుర్తు చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా ఇందులో కీలకమైనది. ప్రజల నుంచి ఆస్తిపన్నుతోపాటే వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక పన్నును వసూలు చేస్తున్నది నగరపాలక సంస్థ. సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్లనుంచి వార్షిక రుసుముతోపాటు ఉత్పత్తయ్యే ఎరువుల నుంచి 5శాతం ఎరువును కార్పొరేషన్ సేకరిస్తున్నది. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమేనంటున్నారు ఢిల్లీలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లో ప్రోగ్రాం మేనేజర్‌గా పనిచేస్తున్న స్వాతి సంబ్యాల్. 'దేశంలోని చాలా మున్సిపాలిటీలు ఇలా చేసేందుకు సిద్ధంగా ఉన్నా, వాటికి తగినంత ఆర్థిక వనరులు లేవు. సిబ్బంది, వాహనాలు, మౌలిక సదుపాయాలు, ఆదాయం లేకే అవి స్వచ్ఛత కార్యక్రమాల్లో విజయం సాధించలేకపోతున్నాయి' అని ఆమె అన్నారు. మైసూర్ కార్పొరేషన్ కేవలం ప్రభుత్వంపైనే ఆధారపడకుండా వివిధ వర్గాల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య నిర్వహణను విజయవంతంగా కొనసాగిస్తున్నది. ఆసక్తి గల యువతకు కంపోస్టు ఎరువుల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ ఉపాధి కల్పనతోపాటు వారికి పలు రాయితీలను ప్రకటించింది. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఖర్చులో 70% తొలి ఏడాది ఎరువుల అమ్మకాలతో తిరిగిపొందేలా చేస్తున్నారు. అక్కడ ప్రతి వార్డుకు ఒక వర్మికంపోస్ట్ కేంద్రం నడుస్తున్నది.

చెత్త పునరుత్పాదన రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడులు

దేశంలో చెత్త పునరుత్పాదన రంగం పరిశ్రమగా విస్తరిస్తుండటంతో, దానిపై పెట్టుబడులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రారంభ మూలధన వ్యయం ఎక్కువగా ఉండటం, ప్రభుత్వ సాయం లేకపోతే నిలదొక్కుకోలేకపోవడం వంటి కారణాలవల్లే ఇలాంటి యూనిట్ల ఏర్పాటులో ప్రైవేట్ సంస్థలు మొదట్లో పెద్దగా ఆసక్తి చూపలేదని నేషనల్ సాలిడ్‌వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు అమియాకుమార్ సాహు తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి మారిందన్నారు. ప్రోత్సాహకాలతో మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని అసోచామ్ 2017 నివేదిక తెలిపింది. '2016 మార్చిలో దేశవ్యాప్తంగా 1.5లక్షల టన్నుల సేంద్రియ ఎరువుల్ని చెత్త నుంచి ఉత్పత్తి చేయగా, అదే ఏడాది ఆగస్టు నాటికి అది 13.1లక్షల టన్నులకు చేరింది. 2027 నాటికి చెత్త రీసైక్లింగ్ రంగంలో పెట్టుబడులు రూ.19,341 కోట్లకు చేరుతాయని అంచనా' అని అసోచామ్ పేర్కొన్నది. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఏడు ప్లాంట్ల నుంచి విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కేంద్రం కూడా ఎలక్ట్రిసిటీ బోర్డుల్ని ఆదేశించింది.

లోక్‌పాల్ నియామకాన్ని ఇంకెన్నాళ్లు నానుస్తారు?

ప్రధాని మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్



న్యూఢిల్లీ, జనవరి 5: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా విమర్శల దాడి కొనసాగిస్తూనే ఉన్నారు. ఉన్నత స్థాయిలో అవినీతిని నిరోధించడం కోసం 'లోక్‌పాల్'ను ఏర్పాటు చేయాలని నాలుగేండ్ల క్రితం చట్టం చేసినా ఇప్పటికీ ఎందుకు నియామకం జరుగలేదని రాహుల్ శుక్రవారం ప్రశ్నించారు. 'లోక్‌పాల్' నియామకాన్ని ఇంకా ఎంతకాలం నానుస్తారని నిలదీశారు. 2013లో నాటి యూపీఏ ప్రభుత్వం.. లోక్‌పాల్ చట్టాన్ని చేసింది. లోక్‌పాల్ బిల్లును పార్లమెంట్ ఆమోదించినప్పుడు మోదీ నాడు గుజరాత్ సీఎంగా చేసిన ట్వీట్‌ను రాహుల్ తన ట్వీట్‌కు జతచేశారు. 'లోక్‌పాల్ బిల్లు ఆమోదం పొందడంలో సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ నాయకత్వంలోని బీజేపీ ఎంపీలు సానుకూల, చురుకైన పాత్ర పోషించినందుకు నాకు గర్వంగా ఉంది' అని నాడు మోదీ ట్వీట్ చేశారు.

24 ఏండ్ల తర్వాత నిందితుడి అరెస్ట్

చెన్నై ఆరెస్సెస్ ప్రధానకార్యాలయం బాంబు పేలుడు కేసులో సీబీఐ పురోగతి

న్యూఢిల్లీ: దాదాపు 24 ఏండ్ల కిందటి చెన్నై ఆరెస్సెస్ ప్రధానకార్యాలయం బాంబు పేలుడు కేసులో ప్రధాన నిందితుడిని సీబీఐ శుక్రవారం అరెస్టు చేసింది. నిందితుడు ముస్తాక్ అహ్మద్‌ను చెన్నై నగరశివారులో అరెస్టు చేసినట్లు సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాళ్ తెలిపారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు 1993 ఆగస్టులో చెన్నైలోని ఆరెస్సెస్ ప్రధానకార్యాలయం లక్ష్యంగా పేలుడుకు పాల్పడ్డాడని, దీంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. బాంబు తయారీలో, మిగతా నిందితులకు ఆశ్రయం కల్పించడంలో ముస్తాక్ కీలకపాత్ర పోషించాడన్నారు. ఈ కేసును విచారించిన చెన్నైలోని టాడా కోర్టు 2007లో 11మంది నిందితులను దోషులుగా ప్రకటించింది. ప్రధాన నిందితుడైన ముస్తాక్‌ను పట్టుకోవడానికి సీబీఐ తన వేటను కొనసాగించింది.

మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పాఠశాల బస్సు, ట్రక్కు ఢీ

బస్సు డ్రైవర్, ఐదుగురు విద్యార్థులు దుర్మరణం

ఇండోర్, జనవరి 5: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. పాఠశాల బస్సు, ట్రక్కు ఢీకొనడంతో ఐదుగురు విద్యార్థులు మృతిచెందారు. బస్సు డ్రైవర్ కూడా మరణించారు. ఈ సంఘటన శుక్రవారం ఇండోర్ సమీపంలోని కనదియా బైపాస్‌లో చోటుచేసుకుంది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులను ఇంటి వద్ద దించడానికి డ్రైవర్ పాఠశాల బస్సులో బయలుదేరారు. అయితే వీరి బస్సు కనదియా బైపాస్ వద్దకు చేరుకునే సరికి స్టీరింగ్ ఫేయిల్ అయ్యింది. దీంతో ఎదురుగా ఉన్న ట్రక్కును బలంగా ఢీకొన్నది. ఈ దుర్ఘటనలో ఐదుగురు విద్యార్థులు, బస్సు డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా.. నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని వెంటనే సమీప దవాఖానకు తరలించారు. మధ్యప్రదేశ్ హోంశాఖ మంత్రి భూపేంద్ర సింగ్ మాట్లాడుతూ ఘటనపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

వెనుకబడిన జిల్లాల ప్రగతిపై దృష్టి పెట్టండి

అధికారులకు ప్రధాని మోదీ దిశా నిర్దేశం

న్యూఢిల్లీ, జనవరి 5: ఆర్థికంగా ప్రగతి సాధించని 115 జిల్లాలపై దృష్టి సారించాలని అధికారులకు ప్రధాని నరేంద్రమోదీ నిర్దేశించారు. ఢిల్లీలో గురువారం ఆయన డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో 'ఎంపిక చేసిన జిల్లాల్లో పరివర్తన' అనే అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ 14న బీఆర్ అంబేద్కర్ జయంతి నాటికి వెనుకబడిన జిల్లాల్లోని పేదల జీవితాల్లో పరివర్తన దిశగా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. వెనుకబడిన జిల్లాల్లో ఆశావాద సానుకూల వాతావరణం సృష్టించడంపైనే దృష్టి సారించాలన్నారు. ఆయా జిల్లాల్లో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించాలని స్పష్టం చేశారు. విజయగాథలే ప్రజల మనోభావాలను మార్చేస్తాయని చెప్పారు. భారతీయులు తలుచుకుంటే ఏదీ అసాధ్యం కాదన్నారు. రికార్డు సమయంలో లక్షల జన్‌ధన్ ఖాతాలు ప్రారంభం కావడమే దీనికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. నిర్దిష్ట గడువులోగా గ్రామాల విద్యుద్ధీకరణతోపాటు చారిత్రక వేగంతో నగరాల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. '2022 నాటికి నవ్యభారత్' అన్న ప్రధాని మోదీ విజన్ సాధనకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సదస్సు జరిగింది.